హైదరాబాద్
ఆదివారం
4-3-2018
సంపుటి: 2, సంచిక: 94
పేజీలు: 12+16, వెల: రూ.6
/manamnews
www.manamnews.com

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



ఉద్యమద్రోహి వల్లే
ఎన్‌కౌంటర్

6లో..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



ఏపీకి హోదా బదులు ప్యాకేజీ అంటగట్టాం. తెలంగాణకు ఏమిస్తారో త్వరగా డిసైడ్ చేయండి సార్..!

కేంద్రంలో థర్డ్‌ఫ్రంట్



కాంగ్రెస్, బీజేపీయేతర కూటమి..నేతృత్వం నేనే వహిస్తా..

- ముమ్మరంగా ప్రయత్నాలు
- కామన్ పొలిటికల్ ఎజెండా
- ఉమ్మడి నాయకత్వం ఉంటుంది
- పలు పార్టీల నేతలతో చర్చించాను
- దేశంలో గుణాత్మక మార్పు రావాలి
- కాంగ్రెస్, బీజేపీతో సాధ్యం కాలేదు
- ఇంకా మంచినీటికి దేవులాడుతున్నాం
- బీజేపీ హవా ఇలాగే కొనసాగదు
- ప్రధాని మోదీని దూషించలేదు

2లో..

- విమర్శించొద్దని ఎక్కడైనా ఉందా?
- వాడు.. వీడు.. తెలంగాణ భాష
- నేను మారను.. అలాగే మాట్లాడతా
- నన్ను ముట్టుకుని చూడండి.. మసైతరు
- నేను క్లియర్.. నన్నేమీ చేయలేరు
- తెలంగాణలో అసలు బీజేపీ ఉందా?
- కాంగ్రెస్‌కు 10 సీట్లకన్నా ఎక్కువ రావు
- ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే
- బీజేపీపై నిప్పులు చెరిగిన కేసీఆర్



కమలం..కదం

బీజేపీకి ఈశాన్యంలో మరో రెండు రాష్ట్రాలు

- త్రిపురలో తొలిసారి స్వయంగా అధికారంలోకి
- శూన్యం నుంచి శిఖరంవైపు అద్భుత విజయం
- నాగాలాండ్‌లో మళ్లీ ఎన్‌పీఎఫ్‌తో జట్టుకు రెడీ
- మేఘాలయలో ఏ పార్టీకీ ఆధిక్యమివ్వని ఓటర్లు

న్యూఢిల్లీ, మార్చి 3:

ఒకవైపు పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ లాంటి సంస్కరణల భారం.. మరోవైపు లలిత్ మోదీ, విజయ్ మాల్యా, నీరవ్ మోదీల పరారీ.. నాలుగేళ్ల పాలనలోనే ప్రభుత్వం మీద ప్రజల్లో పేరుకుపోయిందంటున్న వ్యతిరేకత.. వీటన్నింటినీ తోసిరాజని ఈశాన్య భారతంలోని మరో రెండు రాష్ట్రాల్లో కమలం కదం తొక్కింది. ఈ మేరకు త్రిపురలో 60 స్థానాలకుగాను 59 నియోజకవర్గాలకు నిర్వహించిన ఎన్నికలలో బీజేపీ 43 స్థానాల్లో విజయదుందుభి మోగించింది. మిగిలిన 16 స్థానాలను వామపక్షాలు కైవసం చేసుకున్నాయి. ఇక ప్రతిపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఒక్కసీటూ లభించకపోగా డిపాజిట్లు కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుత అసెంబ్లీలో 49 స్థానాలున్న వామపక్ష కూటమి 33 స్థానాలను, 10 సీట్లున్న కాంగ్రెస్ మొత్తాన్నీ కోల్పోగా.. అసలు ప్రాతినిధ్యమే లేని బీజేపీ 43 నియోజకవర్గాల్లో కదం తొక్కడం విశేషం. ఇక నాగాలాండ్‌లో అధికార ఎన్పీఎఫ్‌ను వీడి ఎన్డీపీపీతో జట్టుకట్టినా 59 స్థానాలకు మిగతా 6లో..

ఊరెళ్లారా.. ఎక్కడికి?

అమ్మానాన్నలను చూసే తీరికేది.. టూర్లు వెళ్లేందుకే సమయం సరి

మనం సండే స్పెషల్ 6లో..

ఫార్మాకు ప్రోత్సాహం

- బీడీఎంఏ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్



యువతి దారుణ హత్య

- చంపేసి.. మంటల్లో కాల్చి.. ఆనవాళ్లను రూపుమాపే యత్నం
- డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల పరిశీలన
- తండ్రి వద్దకు వచ్చి ఆగిన జాగిలం
- సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో దారుణం



సుహాసిని (ఫైల్ ఫోటో)

మిరుదొడ్డి, మార్చి 3(మనం న్యూస్): అనుమానస్పద స్థితిలో యువతి దారుణ హత్యకు గురైన సంఘటన మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో చోటుచేసుకుంది. రుద్రారం గ్రామానికి చెందిన చెట్లకాడి లక్ష్మి సంజీవులు రెండో కూతురు సుహాసిని(18) ఇంటర్మీడియట్ పూర్తి కాగా ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయ పనులు చూసుకుం టోంది. రెండేళ్ళక్రితం తల్లి మృతిచెంద డంతో వ్యవసాయపనుల్లో తండ్రికి చేదోడువాదోడుగా ఉంటుంది. సుహాసి ని చిన్నాన్నకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులంతా ఆసుపత్రికి వెళ్ళారు. శుక్రవారం మధ్యాహ్నం సుహాసిని వ్యవసాయ పొలం వద్దకు వె ళ్ళి ఇంటికి తిరిగి రాలేదు. రాత్రి సమయంలో తండ్రి పొలంవద్దకు వెళ్ళగా సుహాసిని విగతజీవిగా కనిపించింది. ఆమె మృతదేహం మంటల్లో కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డీసీపీ నర్సింహారెడ్డి, ఏసీపీ పరమేశ్వర్, సీఐ నిరంజన్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించి డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. జాగిలం మృతురాలి తండ్రి వద్ద ఆగడం సందేహాలకు దారితీసింది.

మల్టీలెవల్ మార్కెటింగ్‌తో మోసం

- **350 మంది నుంచి రూ.4.50 కోట్లు వసూలు**
- **నిందితుల అరెస్టు.. కోటిన్నర నగదు స్వాధీనం**



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

హైదరాబాద్, మార్చి 3 (మనం ప్రతినిధి): కొద్ది పెట్టుబడితో ప్రతిరోజు అదాయం సంపాధించవచ్చునని మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న ముఠా పోలీసులకు చిక్కింది. ఈ మఠా 350 మంది వద్ద రూ.4.50 కోట్లు వసూలు చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఈ దందాకు సూత్రధారిగా భావిస్తున్న ఓ మాజీ కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి దగ్గరి నుంచి రూ.1.70 కోట్ల నగదు, బంగారం స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ పోలీస్ కమీషనర్ వి.వి.శ్రీనివాసరావు శనివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ ప్రాంతానికి చెందిన జె.శ్యాంసుందర్(48)(డైరెక్టర్ ఈ- క్యాష్ ట్రేడ్ సెక్యూరిటీస్), తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ప్రాంతానికి చేందిన పి.వాసుదేవనాయుడు(26) (ఎండీ ఈట్రేడ్ సెక్యూరిటీస్) కలిసి నాంపల్లిలో మల్టీలెవల్ మార్కెటింగ్ పేరుతో ట్రేడ్ సెక్యూరిటీస్ అనే సంస్థను ప్రారంభించారు. ఓషన్ బ్లూ పేరుతో చైతన్య పురిలో, మల్టీట్యాక్స్ పేరుతో విజయవాడలో బ్రాంచీలు ప్రాంభించారు. గృహిణులకు ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తామని చెప్పి మభ్యపెట్టారు. ముందుగా రూ. 10 వేలు చెల్లించిన వారికి సీల్వర్ ప్యాకేజ్‌ని ఇచ్చారు. ఇందులో చేరిన వారికి ప్రతిరోజు రూ.200 చొప్పున వందరోజులు అందించారు. ఈ స్కీంలో చేరినవారు మరొకరిని చేర్పించాల్సి ఉంటుంది. ఇలా 350 మంది నుంచి రూ.4.50 కోట్లు వసూలు చేశారు. బిచాణా ఎత్తేసేందుకు రంగం సిద్ధం చేసుకోవడంతో వెస్ట్ జోన్‌టాస్క్ ఫోర్సు పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.



కేంద్రంలో థర్డ్‌ఫ్రంట్

- **నేనే నేతృత్వం వహిస్తా: కేసీఆర్**

హైదరాబాద్, మార్చి 3(మనం ప్రతినిధి) కేంద్రంలో కాంగ్రెస్, బీజేపియేతర పార్టీలతో మూడో ప్రత్యామ్నాయం ఏర్పాటుకు ముమ్మరంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. జాతీయస్థాయి ప్రత్యామ్నాయానికి అవసరమైతే తాను నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. మూడో ప్రత్యామ్నాయానికి కామన్ పొలిటికల్ ఎజెండాను సైతం రూపొందిస్తున్నట్లు పేర్కన్నారు. వెల్లడించారు. దేశ రాజకీయాల్లో గుణాత్మకమైన మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. శనివారం టీఆర్ఎస్ పార్లమెంటరీ భేటీ అనంతరం సీఎం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీపైనా, కాంగ్రెస్‌పైనా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశాన్ని 60 సంవత్సరాల పాటు కాంగ్రెస్, పాలించిందని, ప్రస్తుతం బీజేపీ అధికారంలో ఉందని, అయినా నేటికి మంచినీటి కోసం దేవురించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఈ రెండు పార్టీలు దేశానికి ఏం చేశాయో చెప్పాలన్నారు. రాజకీయ వ్యవస్థ దారుణంగా విఫలమైందని, రాజకీయాల్లో ప్రబలమైన మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. మన పొరుగు దేశం చైనా అభివృద్ధిలో అమెరికాతో పోటీ పడుతుంటే.. మనం ఎక్కడున్నామని ప్రశ్నించారు. ఈ రెండు పార్టీల పాలనలో దేశ పరిస్థితుల్లో, ప్రజల జీవితాల్లో ఎలాంటి గుణాత్మక మార్పు కనిపించలేదని అన్నారు. ఈ పరిస్థితి మారాలని ప్రజలు కూడా బలంగా కోరుకుంటున్నారని చెప్పారు. దేశ రాజకీయాల్లో మార్పు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, వంద శాతం కేంద్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం ఏర్పడుతుంది, ఈ దిశగా ఇప్పటికే కొంత మంది నాయకులతో చర్చలు జరిపాను, ఇటీవలే సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరితోనూ చర్చించానని చెప్పారు. దేశం సరికొత్త పంథాలో పయణించడానికి మార్పు అవసరమని, ఈ మార్పు కోసం తాను చొరవ తీసుకుంటున్నానని కేసీఆర్ తెలిపారు. దీనిపై తాను ఇంకా చంద్రబాబు నాయుడితో మాట్లాడలేదని కేసీఆర్ తెలిపారు. మూడో ప్రత్యామ్నాయానికి పరిస్థితిని బట్టి నాయకులు కూడా వస్తారని చెప్పారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించబోతున్నాననే భయంతోనే మోదీనో, తానేదో అన్నాననే పేరుతో బీజేపీ నాయకులు తనపై రాజకీయ దాడి చేస్తున్నారని విమర్శించారు.

సాధారణ ఎన్నికల్లో అలా ఉండదు..

బీజేపీ వరసగా రాష్ట్రాల్లో గెలిచినంత మాత్రాన అదే సరిస్థితి సాధారణ ఎన్నికల్లో ఉండాలన్న రూలేమీ లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోలేని రాష్ట్రాలు, ఓడిపోయిన రాష్ట్రాలు కూడా ఉన్నాయన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఎన్నికలు తరుముకు వస్తున్నప్పటికీ ప్రత్యామ్నాయానికి సమయం సరిపోతుందన్నారు. జనాతా పార్టీ పుట్టిన వంద రోజుల్లో దేశవ్యాప్తంగా స్వీప్ చేసిందని, తెలుగు దేశం ఏర్పడిన 9 నెలల్లోనే ఘన విజయం సాధించిందని అన్నారు. టీఆర్ఎస్ ఏర్పడిన పది నెలల్లోనే పంచాయితీ రాజ్ ఎన్నికల్లో ఘన విజయం సాధించిందని ఆయన వివరించారు. జాతీయ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే సత్త, హక్కు తనకు ఉన్నాయని చెప్పారు. దేశ పరిస్థితుల్లో గణనీయమైన మార్పు కోసం ప్రత్నామ్నాయం చాలా వసరం ఉందన్నారు.

మోదీని పరుష పదజాలంతో దూషించలేదు.

ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పర్యటన సందర్భంగా తాను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని పరుష పదజాలంతో దూషించలేదన్నారు. తాను మోదీ గారు అని మాత్రమే అన్నానని స్పష్టం చేశారు. దీనిపై అనవసరంగా బీజేపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. అలా అనాల్సిన అవసరం, సందర్భం కూడా కాదని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రధాన మంత్రిని విమర్శిస్తే జైలుకు వెళ్ళాల్సి వస్తుందని బీజేపీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి చేసిన హెచ్చరికలను ప్రస్తావిస్తూ.. విమర్శిస్తే జైలుకు పంపిస్తారా, ఇలా బెదిరించాలని చూస్తే సహించే ప్రసక్తేలేదన్నారు. ''కేసీఆర్‌ను ముట్టుకుని చూడండి ఏం జరుగుతుందో.. మాడి మసైపోతారు'' అని హెచ్చరించారు. ఎవరినైనా ఏమైనా చేయగలమని అనుకుంటే పొరపాటన్నారు. అవసరమైతే ప్రధాన మంత్రిని విమర్శిస్తామని స్పష్టం చేశారు. ప్రధాన మంత్రే తమ పాలనను అనేకసార్లు పొగిడారని, ఈ విషయంలో బీజేపీ నాయకులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. ప్రధాన మంత్రి మోదీ తనకు వ్యక్తిగతంగా మంచి మిత్రుడని కేసీఆర్ చెప్పారు. ఆయనను దూషించాల్సిన అవసరం తనకు లేదన్నారు. వాడు వీడు అని తాను అన్నానని, ఇది రాష్ట్రాన్ని పరిపాలించిన తెలుగు దేశం, కాంగ్రెస్ పార్టీలను ఉద్దేశించి అన్నానని స్పష్టం చేశారు. వాడు అధికారంలోకి వచ్చినా, వీడు అధికారంలోకి వచ్చినా రైతులకు, ఇతర వర్గాలకు ఒరిగిందేమీలేదని చెప్పానని స్పష్టం చేశారు. వాడు వీడు అనేది తెలంగాణ భాష అని, ఇక్కడి ప్రజలు ఇలానే మాట్లాడాతరని చెప్పారు. ఎవరి కోసమో ఈ భాషను మార్చుకోవాల్సిన అవసరం లేదని, తాను అలానే మాట్లాడాతనని స్పష్టం చేశారు.

నేను క్లియర్.. నన్ను ఎవరూ ఏమీ చేయలేరు..

తాను, తన కుటుంబం, రాజకీయ జీవితం, ముఖ్యమంత్రిగా పరిపాలన అంతా బహిరంగ రహ్యమేననని, తాను ఏ తప్పు చేయలేదని, చేయబోనని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. తాను ప్రతి సంవత్సరం ఆదాయ పన్ను చెల్లిస్తున్నానని, ఎన్నికల్లో అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు వెల్లడిస్తున్నానని అన్నారు. తనకు ఎలాంటి అక్రమ ఆస్తులు లేవని సుస్పష్టం చేశారు. రాజకీయాల్లో ఉన్నందున ఇలాంటి విమర్శలు వస్తాయనే, కుటుంబ సభ్యులం అందరం కలిసి ఇక నుంచి ఎలాంటి ఆస్తులు సంపాదించవద్దని తీర్మానం చేసుకున్నామని కేసీఆర్ వివరించారు. అన్ని విషయాల్లో తాను క్లియర్‌గా ఉన్నానని, తనను ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. అన్ని పార్టీల మాదిరిగానే టీఆర్ఎస్ ఎన్నికల్లో వ్యవహరిస్తుంది. ఎన్నికల్లో అక్రమ మార్గాలను అనుసరించాల్సిన అవసరం లేదన్నారు. ''కేంద్ర మంత్రి నిర్మాలా సీతారామన్ ఇక నుంచి తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెడతా అంటున్నారు. ఇప్పటి వరకు పెట్టవద్దని ఎవరు అన్నారు. ప్రతి రోజు, ప్రతి గంట దృష్టి పెట్టమనండి.. ఎవరు కాదన్నారు'' అని కేసీఆర్ ప్రశ్నించారు. తాము కూడాఎన్నికల్లో పోటీ పడే గెలవాలని, మరో విధానంలో కాదన్నారు.

తెలంగాణలో బీజేపీ ఉందా?..

తెలంగాణలో అస్సలు బీజేపీ ఉందా అని కేసీఆర్ ప్రశ్నించారు. తమ దృష్టిలో తెలంగాణలో బీజేపీ లేనేలేదని, ఓ రాజకీయ పార్టీగానే పరిగణించడంలేదన్నారు. ఈ పార్టీని ఓ జోక్‌గా తీసుకుంటామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు కూడా గెలవదన్నారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితిపై తాను రెండు సార్ల సర్వేచేయించానని, ఆరున్నర లక్షల శాంపిల్స్‌తో ఈ సర్వే జరిగిందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఒక సర్వేలో 106 సీట్లు, మరో సర్వేలో 103 సీట్లు వస్తాయని వచ్చిందని, ఇదే విషయాన్ని ప్రజలకు చెప్పామని పేర్కొన్నారు. ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోసం తాము ఈ సర్వే చేయలేదన్నారు. గడ్డం పెంచుకుంటేనో, బస్సు యాత్రలు చేస్తేనో అధికారం రాదన్నారు. రాష్ట్రంలో ప్రజలంతా సంతోషంగానే ఉన్నారని, కాంగ్రెస్, బీజేపీలే ప్రస్టేషన్‌లో ఉన్నాయని విమర్శించారు. బస్సు యాత్రలో ఎక్కడా ఐదు వేల మంది కంటే ఎక్కవ రావడంలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పది సీట్ల కంటే ఎక్కవ రావని కేసీఆర్ స్పష్టం చేశారు. రైతుల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ రెండూ రెండేనని, వారికి చేసిన మేలు ఏంటో ఈ పార్టీలు చెప్పాలన్నారు.

ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే: కేసీఆర్

ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని స్వయంగా ప్రధాని మోదీనే చెప్పినందున ఇవ్వాల్సిందేనని కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రత్యేక హోదా విషయంలో అక్కడ ఉన్న పాలక పార్టీ, కేంద్రంలో ఉన్న బీజేపీ స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజలను అనసరంగా గందరోళపరచవద్దని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ''ఏదైనా చెబితే అది చేయాలి. ఇస్తామంటే ఇవ్వాలి. ఇదేం పద్ధతి. దీని వల్ల ఏపీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు'' అని కేసీఆర్ అన్నారు. మోదీ ప్రభుత్వంపై వైసీపీ అవిశ్వాస తీర్మానం పెట్టాలని ప్రయత్నించడం చౌకబారు రాజకీయ ఎత్తుగడగా కేసీఆర్ అభివర్ణించారు.

మన్యంలో భయం...భయం

- తుపాకి మోతలతో దద్దరిల్లుతున్న ఏజెన్సీ
- మావోయిస్టు నేతల హెచ్చరిక
- టీఆర్ఎస్ నేతల ఆందోళన
- అగ్రనేతలే లక్ష్యంగా కూంబింగ్
- రాష్ట్రంలో అనధికార రెడ్ అలర్ట్

హైదరాబాద్, మార్చి 3(మనం ప్రతినిధి): మన్యంలో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి. మావోయిస్టుల కోసం తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులతో పాటు అటవీ గ్రామాల్లో పోలీసులు కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దులో శుక్రవారం జరిగిన ఎన్‌కౌంటర్లో పదిమంది మావోయిస్టులు, ఒక గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ మృతిచెందిన విషయం తెలిసిందే. మావోయిస్టు ముఖ్యనేతలు పరారయ్యారనే సమాచారంతో పోలీసు బలగాలు శనివారం కూడా కూంబింగ్‌ను ముమ్మరంగా చేపట్టాయి. ఈక్రమంలో సరిహద్దు ప్రాంతంలోని కోడిపుంజుల గుట్ట అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య మరోసారి కాల్పులు కొనసాగాయి. తుపాకుల మోతతో అటవీ ప్రాంతాలు దద్దరిల్లుతున్నాయి. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని మావోయిస్టు సానుభూతి పరులు గ్రామాలను వదలి వెళ్తున్నారు. మావోయిస్టు అగ్రనేతలే లక్ష్యంగా పోలీసులు పక్కా ప్రణాళికతో అడుగులు ముందుకు వేస్తున్నారు.

2012లో ఛత్తీస్‌గఢ్‌లోని పూవర్తి అటవీప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్లో కేకేడబ్ల్యు కార్యదర్శి సుధాకర్‌తో పాటు 12మంది హతమయ్యారు. 2013లో ఛత్తీస్‌గఢ్ మల్లం పేట కిష్టాపురం అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో యాక్షన్‌టీం కమాండర్ రాజుతో పాటు సహా 9 మంది మృతి చెందారు. 2016లో ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్లో పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందిన దాఖలాలున్నాయి. కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న మావోయిస్టులు చాపకింద నీరులా తమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని, పార్టీని విస్తరిస్తున్నారనే సమాచారంతో పోలీసులు పక్కా ప్రణాళికలను రూపొందించే పనిలో పడ్డారు. ఇందులో భాగంగానే గత నెల 16న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఐజీల స్థాయి సమావేశాన్ని రహస్యంగా నిర్వహించారు.

ఇటీవలి కాలంలో మావోయిస్టు లు భారీ సంఖ్యలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సంచరించినట్టుగా పోలీసులు గుర్తించారు. పినపాక, భద్రాచలం డివిజన్లలో మావోయిస్టులు ఇసుకు ట్రాక్టర్లను ధ్వంసం చేయటంతో పాటు ఇన్‌ఫార్మర్లను హత్యచేసి సవాల్ విసిరారు. కరపత్రాలను, బ్యానర్లను పలు గ్రామాల్లో కడ్తుండటంతో పోలీసులు మావోయిస్టుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతామైన పూజారికాంకేడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సమావేశం ఏర్పాటు చేస్తున్నారనే పక్కా సమాచారంతో ఇరు రాష్ట్రాల పోలీస్ బలగాలు ప్రణాళికతో ముందుకు కదిలాయి. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్లో 10 మంది మావోయిస్టులు మృతి చెందారు. కాగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని మన్యం ప్రాంతాల్లో పోలీసు బలగాల భారీగా కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. మన్యం ప్రాంతంలో పోలీసులు వాహనాల తనిఖీలను చేపట్టారు. దీంతో ఏజెన్సీ ప్రాంతంలో ఎప్పుడేం జరుగుతోందోఅనే భయం గిరిజనుల్లో నెలకొంది.

ప్రతీకారం తీర్చుకుంటాం..

టీఆర్ఎస్ నేతలపై దాడులు చేస్తామని, ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారం తీర్చుకుంటామని మావోయిస్టులు హెచ్చరించిన నేపథ్యంతో టీఆర్ఎస్ నాయకుల్లో ఆందోళన మొదలైంది. గ్రామాల్లో వెళ్లండి, ప్రజలతో మమేకం కండి అంటూ సీఎం కేసీఆర్ ఇప్పటికే హుకుం జారీ చేశారు. మావోయిస్టుల నేపథ్యంలో గ్రామాల్లో ఎట్లా తిరగాలి అంటూ టీఆర్ఎస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. మావోయిస్టుల హెచ్చరికల నేపథ్యంలో ప్రతీకార దాడులు జరుగవచ్చని పోలీసులు ఇప్పటికే అనధికార రెడ్ అలర్ట్ ప్రకటించారు.

విభజన హామీలపై నిలదీస్తాం

పార్లమెంటులో కేంద్రంపై పోరు

- **చట్టంలోని ప్రతి హామీ నెరవేర్చాలి**
- **టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ**
- **సమావేశంలో సీఎం కేసీఆర్**
- **రిజర్వేషన్లపై రాష్ట్రానికో విధానామా?**
- **రైతుల్ని మోసగిస్తున్న కేంద్రం: కేసీఆర్**



ప్రగతి భవన్‌లో జరిగిన టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో సీఎం కేసీఆర్ తదితరులు

హైదరాబాద్, మార్చి 3 (మనం ప్రతినిధి): విభజన హామీలపై పార్లమెంట్‌లో కేంద్రాన్ని నిలదీస్తామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలిపారు. శని వారం ప్రగతి భవన్‌లో టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విభజన చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీల అమలుపై చర్చించారు. ఈ నెల 5 నుంచి తిరిగి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో టీఆర్ఎస్ ఎంపీలు వివిధ సమస్యలను ప్రస్తావిస్తారని, విభజ చట్టంలోని హామీల అమలు కోసం కేంద్రంపై పోరాడుతారని ముఖ్యమంత్రి ప్రకటించారు. హామీల అమలుకు పలుమార్లు కేంద్ర మంత్రులను కలిసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉత్తరాఖండ్ తరహాలో రెండు తెలుగు రాష్ట్రాలకు పరిశ్రమల రాయితీలు ఇచ్చే విషయాన్ని కేంద్రం విస్మరించిందని చెప్పారు. తెలంగాణకు రావాల్సిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్.. ఐఐఎం వంటి విద్యా సంస్థల ఏర్పాటుపై పార్లమెంట్‌లో నిలదీయాలని ఎంపీలకు సూచించారు. విభజన హామీలు అమలు జరిగే వరకు పోరాటం చేయాలని కేసీఆర్ ఆదేశించారు. విభజన చట్టంలో పేర్కొన్న ప్రతి హామీని కేంద్రం నెరవేర్చాల్సిందేని స్పష్టం చేశారు. పరిస్థితిని బట్టి ఎప్పటికప్పుడు సమీక్షించుకుని పార్లమెంట్‌లో అనుసరిం చాల్సిన వ్యూహంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

రిజర్వేషన్లకు ఒకే విధానం ఉండాలి

గిరిజన, ముస్లిం రిజర్వేషన్ల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని కూడా కేసీఆర్ తప్పు పట్టారు. రిజర్వేషన్ల విధానం అన్ని రాష్ట్రాల్లోనూ ఒకే మాదిరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రానికో విధా నం ఉండకూడడం సరికాదన్నారు. లేదంటే ఏ రాష్ట్ర పరిస్థి ని బట్టి ఆ రాష్ట్రం వీటిపై నిర్ణయం తీసుకునే అవకాశం కల్పించాలని సూచించారు. రిజర్వేషన్ల పెంపు కోసం అవసరమైతే రాజ్యాంగ సవరణ చేయాలని కేసీఆర్ కోరారు.

మిషన్ భగీరథ నిధులపై స్పందనేదీ?

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానించాలని ఎన్నిసార్లు కోరినా కేంద్రం నుంచి స్పందన లేదని కేసీఆర్ విమర్శించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న మిషన్ భగీరథకు 19 వేల కోట్లు, మిషన్ కాకతీయకు ఐదు వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫారస్సు చేసిందని, దీనిపై కూడా కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదని మండిపాడ్డారు. రైతులకు మద్దతు ధర పెంచాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మద్దతు ధర విషయంలో రైతులను మోసం చేస్తున్నారని, ప్రతిసారి చాలా స్వల్పంగా పెంచుతున్నారని, కొన్ని పంటలకు అసలు మద్దతు ధరే లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం 24 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టినా పెద్దగా ప్రయోజనం కలగడం లేదన్నారు.

రాజ్యసభ రేసులో బాలరాజ్

- **సీఎం హామీ నేపథ్యంలో తేరపైకి..**
- **ప్రచారంలో నోముల పేరు**

హైదరాబాద్, మార్చి 3(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రంలో ఖాళీ అయిన మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి షెడ్యూల్ విడుదలైంది. సంఖ్యాబలంపరంగా ఇందులో రెండు స్థానాలు కచ్చితంగా అధికార పార్టీకే దక్కనున్నాయి. మూడో స్థానానికి పోటీ ఉండేలా ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. ఇదిలావుంటే.. గొల్లకురుమల భవన శంకుస్థాపన సందర్భంగా యాదవ సామాజిక వర్గానికి రాజ్యసభ సీటు ఇస్తానని సీఎం కేసీఆర్ హామీచ్చారు. దీనికి సంబంధించి ఇప్పటికే పలువురి పేర్లు విన్పిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్ పేరు రాజ్యసభ రేసులోకి చేరింది. ఓయూలో పీహెచ్‌డీ పూర్తిచేసిన బాలరాజ్‌యాదవ్ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో బాల్క సుమన్, గాదరి కిషోర్, ఎర్రోళ్ల శ్రీనివాస్, పిడమర్తి రవిలతో పాటు కీలక పాత్ర పోషించారు. కేయూ నుంచి వాసుదేవరెడ్డి, రాకేష్‌లతో ఉద్యమ తీవ్రతను పెంచేందుకు కృషిచేశారు. ఇప్పటికే వీరందరికీ వివిధ పదవులు చేపట్టి ప్రభుత్వంలో భాగస్వామ్యులయ్యారు. కాగా, బాలరాజ్ యాదవ్ ఉద్యమ సమయం నుంచి నేటి వరకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు వెంట నడుస్తున్నారు. మంత్రులతో మంచి సంబంధాలు ఉన్నాయి. 2014 ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడ్డారు. దీంతో ఇప్పటికే బాలరాజ్ అభ్యర్థితత్వంపై చర్చ జరిగినట్టు తెలుస్తోంది.

చేదెక్కుతున్న చెరుకు

- **సాగు నుంచి కోత వరకు కష్టాలే**
- **కూలీల కొరత ప్రధాన సమస్య**
- **మూతపడుతున్న చక్కెర పరిశ్రమలు**
- **నష్టాల పాలవుతున్న చెరుకు రైతులు**



హైదరాబాద్ , మార్చి 3 (మనం ప్రతినిధి): జీహ్వకు తీపినిచ్చే చెరుకును సాగు చేస్తున్న రైతులు జీవి తాలు చేదెక్కుతున్నాయి. సాగు నుంచి కోతల వరకు అనేక సమస్యలు. చెరుకు కోత, కూలీల కొరత రైతు లకు, చక్కెర పరిశ్రమలకు ప్రధాన సమస్యలుగా మారా యి. మార్కెట ధరల వల్ల కూడా రైతులు, పరిశ్రమల నిర్వాహకులు ఢీలా పడుతున్నారు. సమస్యలు తాళలేక చక్కెర పరిశ్రమలు మూతపడుతుండడంతో రైతుల పరి స్థితి అగమ్యగోచరం అవుతుంది. ఇప్పుడు ఉత్పత్తి చేసిన దాని కంటే రెట్టింపు చెరుకు ఉత్పత్తి చేసినా, క్రషింగ్ చే యగల పరిశ్రమలున్నా పక్క రాష్ట్రాల నుంచి చక్కెర దిగుమతి చేసుకునే దుస్థితి దాపురించింది.

రాష్ట్రంలోని చక్కెర పరిశ్రమలు

ఏళ్ల తరబడి లాభాల బాటలో నడిచిన చక్కెర పరి శమలు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 11 పరిశ్రమలున్నాయి. ఇందులోకి సహకార సంఘాల ద్వారా ఒకటి, ప్రభుత్వ, ప్రైవేట్ సంయుక్త భాగస్వామ్యంలో మూడు, ఏడు ప్రైవేటు సంస్థలు ఉన్నాయి. నిజామాబాద్ చక్కెర పరిశ్రమ సహకార సంఘాల ఆధ్వర్యంలో నడిచేది. అది ప్రస్తుతం మూతపడింది. నిజాం డెక్కన్ షుగర్స్ లిమిటెడ్ సంస్థతో ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న బోధన్, మెదక్, మెట్‌పల్లి చక్కెర పరిశ్రమల్లో ఉత్పత్తి నిలిచిపోయింది. ప్రైవేట్ సంస్థల ఆధ్వర్యంలో గణపతి షుగర్స్, ట్రైడెంట్ షుగర్స్, గాయత్రి షుగర్స్ కామారెడ్డి, గాయత్రి షుగర్స్ నిజాంసాగర్, కాకతీయ షుగర్స్, మధుకోన్ షుగర్స్, కృష్ణవేణి షుగర్స్‌లో ఉత్పత్తి జరుగుతుంది. కాగా, రాష్ట్రంలో ప్రతి ఏడాది రెండున్నర నుంచి మూడున్నర లక్షల టన్నుల చెరుకు దిగుబడి వచ్చేది. కానీ ఈ ఏడాది రెట్టింపు కంటే అధికంగా దిగుబడి వచ్చిందని అధికా రులు చెబుతున్నారు. గతంలో 25 వేల మంది రైతులు చెరుకు సాగుచేసేవారు. ఈ ఏడాది దాదాపు 30 వేల మంది రైతులు 30 వేల నుంచి 40 వేల హెక్టార్లలో చెరుకు సాగు చేశారని అధికారులు అంచనా. ఈ సంవత్సరం పండిన చెరుకు నుంచి రెండున్నర లక్షల టన్నుల చక్కెర ఉత్పత్తి అవుతుందని అంటున్నారు. రాష్ట్ర అవసరాలకు ఏడాదికి ఏడున్నర లక్షల చక్కెర అవసరం. అంటే దాదాపు ఐదు లక్షల టన్నుల లోటుంది. డిమాండ్‌కు ఉత్పత్తి చాలా అంతరం ఉంది.

చెరుకు రైతులు, చక్కెర పరిశ్ర మలు ఎదుర్కొంటున్న ప్రధాన సమ స్యలు చెరుకు కోత, కూలీల కొరత. ఈ కారణంగానే ఖమ్మం, వనపర్తిలోని చక్కెర పరిశ్రమల్లో ఉత్పత్తి నిలిచిపో యింది. స్థానికంగా కూలీల కొరత ఉండడంతో పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుంచి కూలీలను తీసుకొస్తున్నారు. కూలీలతో కాకుండా మిషనరీతో పనిచేయించవచ్చు కానీ ఒక చెరుకు కోత మిషన్ (హార్వెస్టర్)ను కొనుగోలు చేయడానికి రూ.1.20 కోట్ల నుంచి రూ.1.70 కోట్లు అవుతుంది. హార్వెస్టర్ కొనుగోలుకు ప్రభుత్వం నుంచి సబ్సిడీ లేదు. ఇంత మొత్తంలో డబ్బు ఖర్చు పెట్టి రైతులు గానీ, పరిశ్రమల యాజమానులు గానీ హార్వెస్టర్ కొనే పరిస్థితి లేదు. ఒకవేళ సహకార సంఘాల ఆధ్వర్యంలో హార్వెస్టర్‌ను కొనుగోలు చేసినా దానిని నిర్వహణలో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి చెరుకు హార్వెస్టింగ్‌కు సహాయం చేయాలని ప్రతిపాదనలు పంపామని, రూ.20 కోట్లు కేటాయించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి.



హైదరాబాద్‌లో శనివారం చంద్రబాబును కలిసి తమ ఇంట్లో జరిగే శుభకార్యానికి రావాలని ఆహ్వానిస్తున్న టీఆర్ఎస్ నేతలు వినోద్, వివేక్ కుటుంబ సభ్యులు

కులవృత్తుల బలోపేతానికి సీఎం కృషి

- సొసైటీ ఎన్నికలు నిర్వహణకు చర్యలు
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని

హైదరాబాద్, మార్చి 3(మనం ప్రతినిధి): కులవృత్తులపై ఆధారపడిన వారిని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ, డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మారెడ్డితో శనివారం తన చాంబర్‌లో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ



అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి తలసాని శ్రీనివాసరావు

రూ.5వేల కోట్లతో గొల్ల, కురుమలకు గొర్రెలు, మత్స్య వృత్తిపై ఆధారపడిన వారికి చేప పిల్లలు పంపిణీ చేస్తున్నామన్నారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల్లో గొర్రెల పెంపకం దారులు, మత్స్యకారుల సొసైటీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మొత్తం 8025 గొర్రెల పెంపకందారుల సొసైటీలు ఉన్నాయని, వీటిలో 7037 సొసైటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. వీటితో పాటు 946 మత్స్య సహకార సొసైటీలకు ఎన్నికలు జరగాల్సి ఉందన్నారు. త్వరలో క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి సొసైటీలకు ఎన్నికలు నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని, సొసైటీ ఎన్నికలు నిర్వహిణకు అనుమతి కోరుతూ సీఎంకు ప్రతిపాదనలు పంపుతామని వివరించారు.



త్రిపుర విజయంతో స్వీట్లు పంచుకుంటున్న బీజేపీ శ్రేణుల

బీజేపీ నేతల సంబరాలు

- సీపీఎం నేతలు కళ్లు తెరవాలి : కృష్ణసాగర్
- అంచనాలు మించిన విజయం: రాంచంద్రరావు

హైదరాబాద్, మార్చి 3 (మనం ప్రతినిధి): త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో ఆ పార్టీ రాష్ట్ర నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి కృష్ణసాగర్ విలేకరులతో మాట్లాడారు. వామపక్షానికి కంచుకోటగా ఉన్న త్రిపురలో బీజేపీ చారిత్రాత్మక విజయం సాధించిదని, సీపీఎం విధానం, సిద్ధాంతాలు నవతరానికి అర్థకాకుండా పోయిందని, ఇప్పటికైనా ఆ పార్టీ నేతలు కళ్లు తెరవాలని కృష్ణ సాగర్ అన్నారు. కర్ణాటక, కేరళ, తెలంగాణలో జరిగే ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధిస్తుందన్నారు. దక్షిణాదిన బీజేపీకి స్థానం లేదన్న ప్రాంతీయ పార్టీలకు ఈ విజయం చెంపపెట్టు అన్నారు. ఎమ్మెల్సీ రాంచంద్రరావు మాట్లాడుతూ మా అంచనాలకు మించి త్రిపురలో సీట్లు సాధించామని, మోదీ చేస్తున్న అభివృద్ధి, అమిత్ షా నాయకత్వం, రామ్ మాధవ్ వ్యూహరచన విజయానికి కారణమని అన్నారు. త్రిపురలో అప్రజాస్వామిక వాతావరణం ఉండేదని, మాణిక్ సర్కార్ ప్రజావ్యతిరేక విధానాలను అవలంభించడం వల్లే ప్రజలు బీజేపీకి పట్టం కట్టారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, ఎమ్మెల్యే రాజా సింగ్, సుధాకర్ శర్మ, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలి

- కలిసి రావాలంటూ సెటిలర్లకు పిలుపు
- అండగా ఉంటామంటూ ఉత్తమ్ హామీ
- కేటీఆర్‌కు అహంకారం పెరిగింది: షబ్బీర్‌అలీ
- 2019 తర్వాత కేసీఆర్ జైలుకే: మధుయాష్కి



హైదరాబాద్, మార్చి 3(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం నుంచి కేసీఆర్‌ను తరిమికొట్టాలని టీపీసీసీ అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో శనివారం మాజీ శాప్ చైర్మన్ రాజ్‌ఠాకూర్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. తెలంగాణ సొమ్ము తిని కేటీఆర్‌కు కళ్లు నెత్తికెక్కుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను టీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరుతున్న ప్రతి ఒక్కరికి తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. హైదరాబాద్‌లో ఉన్న సెటిలర్స్ తమతో కలిసిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గతంలో కేసీఆర్ సెటిలర్స్‌ను ఎలా భయపెట్టారో ఒక్కసారి గుర్తు చేస్తున్నానని అన్నారు. కాంగ్రెస్ బస్సు యాత్రను చూసి టీఆర్ఎస్‌కు గుబులు పుడుతుందన్నారు. కేటీఆర్‌ను తిట్టడానికి రేవంత్ సరిపోతాడన్నారు. తనపై ఉన్న కేసును హైకోర్టు కొట్టి వేసిందని తెలిపారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ కేటీఆర్‌కు అహంకారం బాగా పెరిగిందన్నారు. కాంగ్రెస్‌పై కేసులు ఉన్నాయంటున్న కేటీఆర్ వాటిని ఎందుకు బయటపెట్టడంలేదన్నారు. అధికారంలో ఉన్నది మీరే కదా అన్ని ఎద్దేవ చేశారు. మైనార్టీలకు కేసీఆర్ ఇచ్చిన హామీలు, రిజర్వేషన్లు ఎక్కడికి పోయాయాని ప్రశ్నించారు. హిమాయత్ నగర్‌లో చిన్న ఇంట్లో ఉండే ఓవైసీ కుటుంబానికి ఇప్పుడు రూ.వేల కోట్లు, భవంతులు ఎలా వచ్చాయన్నారు. మధుయాష్కిగౌడ్ మాట్లాడుతూ తెలంగాణలోవచ్చే ప్రభుత్వం కాంగ్రెస్‌దేనన్నారు. కేసీఆర్ ఆయన కుటుంబం 2019 ఎన్నికల తర్వాత జైలుకు వెళ్లడం ఖాయమన్నారు.

కేటీఆర్ బచ్చా కాదు.. లుచ్చా: రేవంత్

- అమరవీరుల కుటుంబానికే కాంగ్రెస్ రాజ్యసభ సీటు
- కేసీఆర్ జాతీయస్థాయి ఫ్రంట్ పెడతామనడం హాస్యాస్పదం



హైదరాబాద్, మార్చి 3(మనం ప్రతినిధి): కాంగ్రెస్‌పై అడ్డగోలుగా మాట్లాడుతున్న కేటీఆర్‌ను బచ్చా కాదు లుచ్చా అని అనాలని కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ఇప్పటి వరకు ఏ పదవి దక్కలేదన్నారు. కేసీఆర్ బంధువు సంతోశ్‌ను రాజ్యసభకు పంపాలని చూస్తున్నారని ఆరోపించారు. అమరవీరుల కుటుంబాల సభ్యుడికి కాంగ్రెస్ రాజ్యసభ సీటు ఇచ్చి బరిలోకి దింపుతుందన్నారు. కేసీఆర్ కుటుంబం వైపు ఉంటారో, తెలంగాణ సమాజం వైపు ఉంటారో తేల్చుకోవాలన్నారు. కేసీఆర్ జాతీయ స్థాయిలో ఫ్రంట్ ఏర్పాటు చేయాలనడం హాస్యాస్పదమన్నారు. అన్ని వర్గాల ప్రజలను కేసీఆర్ మోసం చేస్తున్నారన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న టీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు.

కందుల సేకరణలో కేంద్రం వివక్ష

- కొనుగోళ్లపై పరిమితి విధించడమా?
- ఇప్పటికే 24 లక్షల క్వింటాళ్లు కొన్నాం
- ఇంకా మార్కెట్‌కు కందులు వస్తున్నాయ్
- ఈసారి 2.51 లక్షల హెక్టార్లల పంట
- గోడౌన్ల డిమాండ్‌ను అంచనా వేయండి
- స్థలం కోసం కలెక్టర్లకు లేఖ రాయాలి
- మార్కెటింగ్ అధికారులతో సమీక్షలో మంత్రి హరీశ్‌రావు



అధికారులతో సమీక్ష జరుపుతున్న నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, మార్చి 3: కందుల సేకరణలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. కొనుగోళ్లపై పరిమితి విధించడంపై ఆయన మండిపడ్డారు. ఇప్పటివరకు 1315 కోట్ల రూపాయల విలువ చేసే 24,13,267 క్వింటాళ్ళ కందులను తెలంగాణ ప్రభుత్వం సేకరించిందని మంత్రి చెప్పారు. వీటి విలువ 1,315 కోట్లు కాగా.. అందులో వెయ్యికోట్లు రాష్ట్ర ప్రభుత్వమే భరించిందని చెప్పారు. మరోవైపు గోడౌన్లు లేని మండలాల్లో డిమాండ్‌ను అంచనా వేసి 15 రోజుల్లో నివేదిక సమర్పించాలంటూ శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 164 మండలాల్లో గోడౌన్లు లేవని చెబుతూ.. గోడౌన్ల నిర్మాణానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించాలంటూ ఆయా జిల్లాల కలెక్టర్లకు లేఖ రాయాలని సూచించారు. ఈమేరకు శనివారం సెక్రెటేరియట్‌లో జరిపిన కందుల కొనుగోళ్ళ సమీక్షలో ఈమేరకు ఆదేశాలు జారీచేశారు. తెలంగాణ రైతులకు మద్దతు ధర కల్పించడంలో, కందుల సేకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిపై హరీశ్‌రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి ఎన్ని లేఖలు రాసినా స్పందన లేదన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 24 లక్షల క్వింటాళ్ళకు పైగా కందులు కొనుగోలుచేసినా, ఇంకా దాదాపు మరో 1.50 లక్షల మెట్రిక్ టన్నుల కందులు మార్కెట్‌కు వస్తున్నట్టు చెప్పారు. ఈసారి 2.51 లక్షల హెక్టార్లలో రైతులు కంది పంట వేశారని తెలిపారు. కేవలం 75 వేల మెట్రిక్ టన్నుల సేకరణకే కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందంటూ కేంద్రంపై హరీశ్‌రావు అసంతృప్తి వ్యక్తంచేశారు. కంది రైతుల బకాయిల చెల్లింపునకుగాను ప్రభుత్వం 600 కోట్ల బ్యాంక్ గ్యారంటీ ఇచ్చిందన్నారు. అత్యంత త్వరగా కంది రైతుల బకాయిలు చెల్లించాలని మార్క్‌ఫెడ్, హాకా సంస్థలను మంత్రి కోరారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలోని 330 గోడౌన్లలో 185 గోడౌన్‌లు మాత్రమే వినియోగంలో ఉన్నాయని, మిగతా 145 గోడౌన్‌లన్నింటినీ ఖరీఫ్‌లోగా పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. గోడౌన్‌లు మంజూరు అయినప్పటికీ భూసేకరణ పూర్తికాని ప్రాంతాల్లో, ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాలని కోరారు. ఇందుకు గాను స్థానిక శాసన సభ్యులు, జిల్లా మంత్రులతో చర్చించాలని అధికారులను హరీశ్‌రావు ఆదేశించారు. ప్రైవేట్ గోడౌన్‌లలో 4 లక్షల మెట్రిక్ టన్నుల సరకులు ఉండడంపై మంత్రి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలోని గోడౌన్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి కోరారు. ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు, విత్తనాలను రైతులు నిల్వ చేసుకోవడానికి వీలుగా గోడౌన్ల నిర్మాణ ప్రక్రియను పూర్తిచేయాలని కోరారు. తెలంగాణలో కొత్తగా మార్కెటింగ్ శాఖా పరంగా 9 కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటును సీఎం కేసీఆర్ ఆమోదించిన నేపథ్యంలో కోల్డ్ స్టోరేజ్‌ల డిమాండ్ ఎక్కడున్నదో మార్కెటింగ్ పరమైన విశ్లేషణ జరపాలని హరీశ్ రావు కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్‌పై కేబినెట్ సబ్ కమిటీ ఈ నెల 6న సమావేశం అవుతున్నందున నాబార్డు, మార్కెటింగ్, హార్టీకల్చర్ సంస్థలు ఉమ్మడిగా ఈ అధ్యయనం చేయాలని కోరారు. ఏ ప్రాంతంలో ఎక్కువగా ఏ పంట పండిస్తున్నారు, దిగుబడి ఎంత వస్తున్నది, ఆ ప్రాంతాల్లో ఉన్న సాగునీటి వసతి, మార్కెటింగ్ సదుపాయాలపై ఒక నివేదిక సమర్పించాలని హరీశ్ రావు సూచించారు.

పాలమూరు నుంచి లోక్‌సభకు పోటీ చేస్తా

- రాష్ట్ర రాజకీయాలపై ఆసక్తి లేదు
- కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 3(మనం ప్రతినిధి): వచ్చే ఎన్నికల్లో తాను పాలమూరు నుంచి లోక్‌సభకు పోటీ చేస్తానని కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర రాజకీయాలపై ఆసక్తి లేదని, జాతీయ రాజకీయాల్లో కొనసాగుతానని జైపాల్ చెప్పారు. గాంధీ భవన్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సరే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. టీఆర్ఎస్‌కు కేంద్రంలో బీజేపీకి ఒప్పందం ఉందన్నారు. ప్రగతి శీల శక్తులు, అల్పసంఖ్యాక వరాలను మోసం చేసేందుకే కేసీఆర్ మోదీకి వ్యతిరేకంగా మాట్లాడారని జైపాల్ రెడ్డి ఆరోపించారు. నోట్ల రద్దు, జీఎస్టీ, రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో కేసీఆర్ బీజేపీకి మద్దతు ఇచ్చారని చెప్పారు. ఏకవచనంతో మోదీని మాత్రమే కాదని, రాహుల్ గాంధీని కూడా మాట్లాడారని జైపాల్ రెడ్డి విమర్శించారు. 2014 ఎన్నికల్లో బీజేపీతో అవగాహన కోసం బహిరంగంగానే అడిగారని, టీడీపీతో పొత్తు సాధ్యంకాలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎన్నికలకు ముందు పొత్తు కుదరకున్నా.. తరువాతైనా కేసీఆర్ బీజేపీతోనే కలుస్తారన్నారు. కేసీఆర్ అవకాశవాదని, ఆయ నకు మోదీ తప్ప వేరే గత్యంతరం లేదన్నారు. ఈ నాలుగేళ్లలో కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారో కేసీఆర్ చెప్పాలని జైపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. కాగా, పాలమూరు నుంచి తన పెద్ద కూ తురు పోటీ చేస్తుందని ఇటీవల కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, మాజీ మంత్రి డీకే అరుణ చెప్పారు.

సీఎం క్షమాపణ చెప్పాల్సిందే

- సీఎం కేసీఆర్ రైతులకు ఏంచేశారు?
- ఈశాన్యంలో మద్దతు కూడగట్టుకున్నాం
- తెలంగాణ, కర్నాటకలోనూ గెలుస్తాం
- బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 3(మనం ప్రతినిధి): ప్రధాని మోదీని అనుచితంగా సంబోధించిన విషయంపై సీఎం కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందేనని బీజేపీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. కేసీఆర్ వ్యాఖ్యలను ఆయన కుటుంబం తక్కువచేసి చూపే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధానిపై కేసీఆర్ వ్యాఖ్యలు ఆక్షేపణీయమని స్పష్టం చేశారు. దీనిపై కేసీఆర్ నోరు విప్పేంత వరకు వదిలేది లేదన్నారు. బంగారు తెలంగాణ అంటూ కేసీఆర్ మాట్లాడే మాటలు ఇవేనా? అని ప్రశ్నించారు. బాధ్యత మరిచి, స్థాయి విడిచి చేస్తున్న వ్యాఖ్యల వల్ల, యావత్ దేశ ప్రజల మనోభావాలు దెబ్బతింటున్నాయన్నారు. ముఖ్యమంత్రి మాటలు హుందాగా ఉండాలని, సమాజానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. కేంద్రం రైతులకు కోసం కిసాన్ చానెల్ ప్రారంభించిందని, 14 కోట్ల ఎకరాలకు భూసార పరీక్షలు నిర్వహించదని, ఎరువుల కొరతలేకుండా చేస్తుందని, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు రెట్టింపు నష్టపరిహారం చెల్లిస్తుందని తెలిపారు. మూడున్నర సంవత్సరాల్లో రైతులకు సీఎం కేసీఆర్ చేసింది ఏమిటో చెప్పాలని, ఆ విషయంపై మాట్లాడేం దుకు బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ సొంత నియోజక వర్గంలోనే రైతులు ఆత్మహత్యలు అధికంగా ఉన్నాయ న్నారు. రైతులకు రుణ మాఫీలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని, వారిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారన్నారు. ఒక్క రైతుకైనా పావలా వడ్డీ రుణాన్ని అందించారా అని ప్రశ్నించారు. రైతులకు కావాల్సింది భిక్ష కాదని, గిట్టుబాటు ధరలని, ఇతర రాష్ట్రాలు రైతాంగానికి లాభం చేకూర్చుతున్న పథకాలను, ఇక్కడ అమలు చేయాలన్నారు.



త్రిపుర ఎన్నికల్లో విజయంపై మాట్లాడుతున్న బీజేపీ నేతలు

తెలంగాణలోనూ విజయం మాదే

సీపీఎం కంచుకోటను బద్దలుకొట్టి బీజేపీ విజయదుందుభి మోగించదని, బీజేపీ ఈశాన్య భారత ప్రజల మద్దతు కూడగట్టుకుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. క్రిస్టియన్లు, ముస్లింలు, పేదలకు బీజేపీ వ్యతిరేకం కాదనడానికి ఈ విజయం నిదర్శనమన్నారు. కర్ణాటక, తెలంగాణలోనూ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ధైర్యముంటే అసదుద్దీన్ ఓవైసీని అంబర్‌పేట నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలవాలని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వచ్చే ఎన్నికల్లో సికింద్రబాద్, అంబర్‌పేటల్లో బీజేపీని ఓడిస్తామని ఓవైసీ ఇటీవలే వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే!



ఎన్టీఆర్ ట్రస్ట్ 20వ వార్షికోత్సవ వేడుకల్లో చంద్రబాబు కుటుంబం

ఎన్టీఆర్ ట్రస్టు.. సేవా స్ఫూర్తికి నాంది


- ట్రస్ట్ 20 వార్షికోత్సవ వేడుకల్లో చంద్రబాబు

హైదరాబాద్, మార్చి 3 (మనం ప్రతినిధి): భావితరాల సేవా స్ఫూర్తికి నాందిగా ఎన్టీఆర్ ట్రస్ట్ నిలుస్తుందని, పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఎన్టీఆర్ పేరుతో ట్రస్ట్ ప్రారంభించామని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్టీఆర్ ట్రస్ట్ 20వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ స్కూలు విద్యార్థులు, చంద్రబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. కుటుంబంతో కలిసి ఎన్టీఆర్ ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనడం తీపి జ్ఞాపకంగా మిగిలిపోతుందన్నారు. విద్యార్థులు ఇష్టపడి చదవాలి కానీ బలవంతంగా కాదన్నారు. అలాంటి వాతావరణాన్ని ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలో టీడీపీ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో ఐటీకి ఎంతో ప్రాధాన్యతం ఇచ్చామన్నారు. ట్రస్టు మోడల్ స్కూల్‌లో ఇంటర్‌నెట్ సౌకర్యాల ఏర్పాటు చేశామని, దీంతో విద్యార్థులు విజ్ఞానం పెంచుకునే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగు నింపడానికి ఎన్టీఆర్ ట్రస్టు నిరంతరం కృషి చేస్తుందని, ట్రస్ట్ ద్వారా ఎంతో మంది పిల్లలకు విద్యనందిస్తున్నందుకు గర్వపడుతున్నానని పేర్కొన్నారు. పిల్లలకు ఆస్తులనుకాదు, చదువు, సంస్కారాలను వారసత్వం ఇవ్వాలని తెలిపారు. అందుకే లోకేశ్, బ్రాహ్మణి చదువు విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకున్నట్టు వెల్లడించారు. ట్రస్ట్ మోడల్ స్కూల్ 75 శాతం అమ్మాయిలే ఉండడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఎన్టీఆర్ హయాంలోనే మహిళల సమానత్వం కోసం కృషి చేశారని, అందుకోసమే తిరు పతిలో తొలి మహిళా యూనివర్సిటీని నెలకొల్పారని స్పష్టంచేశారు. ప్రస్తుతం అబ్బాయిలకంటే అమ్మాయిలే ఎక్కువగా రాణిస్తున్నారని, రానున్న కాలంలో అబ్బాయిలే అమ్మాయిలకు కట్నం ఇచ్చి పెండ్లి చేసుకుంటారని తెలిపారు.

'మిలియన్ మార్చ్ గుర్తు చేసుకుందాం'

- 10న ట్యాంక్‌బండ్‌పై సభ.. నడక
- పార్టీలకతీతంగా తరలిరండి: కోదండరామ్
- ఉద్యమసోయిని మర్చిన సీఎం కేసీఆర్: చాడ
- అనుమతివ్వకపోతే 'స్ఫూర్తి' మరిచినట్లే: గోవర్ధన్

హైదరాబాద్, మార్చి 3 (మనం ప్రతినిధి): తెలంగాణ సాధన కోసం మిలియన్ మార్చ్ చేపట్టి ఆరేళ్లవుతున్న సందర్భంగా 'మిలియన్ మార్చ్ స్ఫూర్తిని గుర్తు చేసుకుందాం' పేరిట భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 10న హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై జరిగే సభ, నడక కార్యక్రమాలకు పార్టీలకతీతంగా తెలంగాణ ప్రజలంతా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఇంటి పార్టీ అధ్యక్షుడు చెరుకు సుధాకర్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. సమావేశం అనంతరం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో కోదండరామ్‌తో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, న్యూడెమోక్రసీ రాష్ట్ర నేత గోవర్ధన్, ప్రజాఫ్రంట్ నేత సురేందర్‌రెడ్డి, పురుషోత్తం దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఉద్యమ సోయిని సీఎం కేసీఆర్ మరచిపోయారని చాడ వెంకటరెడ్డి విమర్శించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రపోరులో మిలియన్ మార్చ్ సంచలనం సృష్టించిందన్నారు. కేంద్రానికి దడ పుట్టించిందని తెలిపారు. లక్షలాదిగా తెలంగాణ వాదులు ప్రత్యేక రాష్ట్రం కోసం పోలీస్ బారికేడ్లు, ముండ్ల కంచలను దాటుకుంటూ మార్చ్‌లో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఈ నెల 10న 'మిలియన్ మార్చ్ స్ఫూర్తిని గుర్తు చేసుకుందాం' పేరిట నిర్వహిస్తున్న కార్యక్రమంలో తెలంగాణ ఆట, పాట, మాట వినిపించాలని అన్నారు. అనంతరం ట్యాంక్‌బండ్ ఈ కొస నుంచి ఆ కొస వరకు నడక ఉంటుందని చెప్పారు. కార్యక్రమం అనుమతి కోసం పోలీస్ అధికారులతో మాట్లాడామని గోవర్ధన్ తెలిపారు. కార్యక్రమానికి సీఎం కేసీఆర్ అనుమతి ఇవ్వకపోతే ఉద్యమంతోనే ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన విషయాన్ని, నాటి స్ఫూర్తిని ఆయన మరచినట్టేనని చెప్పారు. పదో తేదీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల వరకు కార్యక్రమం ట్యాంక్‌బండ్‌పై ఉంటుందన్నారు. పార్టీలకతీతంగా తెలంగాణ వాదులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలుంటాయని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జేఏసీ చైర్మన్ కోదండరాం



ఉప్పరి రమేష్‌కుమార్

> తెలంగాణ ఏర్పాటైన తరుణంలోనూ కాంగ్రెస్ అధినేత్రి సోనియాను కలిసి స్నేహ హస్తం అందించిన కేసీఆర్ అటు తరువాత ఏం చేశారో అందరికీ తెలిసిందే. ఇప్పుడు కూడా అదే తీరులో మోదీని పొగడుతూనే వార్ సిగ్నల్ ఇస్తున్న కేసీఆర్ అన్నంత పనిచేస్తాడని చెప్పవచ్చు. అన్నింటినీ బేరీజు వేసుకొని రంగంలోకి దిగే కేసీఆర్ ఒక వేళ బీజేపీ తనను ఇరుకునపెడితే ఎలా అన్నదానిలో తన వైఖరిని బయట పెట్టారు.



మరో సమరానికి 'సై' అంటున్న మొండిఘటం

- దేశ రాజకీయాల వైపు కేసీఆర్ చూపు
- తెలంగాణ టు ఢిల్లీ ప్లాన్ రె 'ఢీ'..!
- థర్డ్ ఫ్రంట్ నాయకత్వానికి సిద్ధమంటూ స్పష్టీకరణ
- బీజేపీ, కాంగ్రెస్సేతర పార్టీలు, శక్తులతో సమాలోచనలు
- ఏపీ సమస్యపై వ్యూహాత్మక సపోర్ట్
- వ్యక్తిగతంగా మోదీ స్నేహితుడంటూనే బీజేపీపై ఫైర్
- తనను ముట్టుకుంటే తెలుస్తది భస్మమైపోతారంటూ హెచ్చరికలు
- నన్ను వదిలి చూడండి తెలంగాణ సత్తా చూపిస్తానంటూ ధీమా

ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు తన మనసులో మాటను బయట పెట్టారు. ఇన్నర్ ఎజెండా ఏంటో తేల్చి చెప్పేశారు. దేశ రాజకీయాలపై తన చూపు ఉందంటూ స్పష్టం చేశారు. 'ఏం... నేను దేశ వాసిని కాదా?.. నా దేశం కోసం పనిచేసే హక్కు నాకు లేదా..? నా దమాక్, ధమ్ దేశానికి పనికొస్తాయ్ అవసరమైతే థర్డ్ ఫ్రంట్‌కు నాయకత్వం వహిస్తా.. నన్ను వదిలి చూడండి తెలంగాణ వారి సత్తా చూపిస్తా' అంటూ కుండబద్దలు కొట్టేశారు. వ్యక్తిగతంగా ప్రధాని మోదీ తన ఫ్రెండ్ అంటూనే బీజేపీపై ఫైర్ అయ్యారు. తనను ముట్టుకుంటే తెలుస్తది భస్మమై పోతారంటూ హెచ్చరించారు. రాజకీయంగా కాంగ్రెస్‌తో పాటు బీజేపీని ఏరిపారేసిన కేసీఆర్ వ్యక్తిగతంగా ఎవరిలో తనకు శత్రుత్వం లేదన్నారు. పనిలో పనిగా ఆంధ్రప్రదేశ్ సమస్యపై స్పందిస్తూ వ్యూహాత్మకంగా సపోర్ట్ చేసి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనన్నారు. మొత్తానికి శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన కేసీఆర్ అనేక అంశాలను ప్రస్తావిస్తూ సంచలన వాఖ్యలు చేశారు.

ఇటీవల ప్రధాని మోదీపై తాను చేసిన వాఖ్యలు వివాదాస్పదమైన నేపథ్యంలో తనదైన శైలిలో వివరణ ఇస్తూ రాజకీయ వేడి పుట్టించారు. మొండిఘటంగా పేరున్న కేసీఆర్ చేసిన సంచలన వాఖ్యలు దేశ రాజకీయాల్లో మార్పులు అనివార్యమని చెబుతున్నాయి. అంతేకాదు తెలంగాణ రాష్ట్రంలోనూ కొన్ని అంశాలపై జరుగుతున్న ప్రచారాలకు మరింత ఊతమిచ్చారు. కేసీఆర్ దేశ రాజకీయాలవైపు వెళితే.. ఇక్కడ ముఖ్యమంత్రి ఎవరు అన్నదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముందస్తు ఎన్నికలు వచ్చినా రాకున్నా 2019లో జరిగే సమరానికి అంతా సిద్ధమవుతున్న సమయంలో కేసీఆర్ 'నా రూటు ఢిల్లీ వైపు' అంటూ చెప్పేయడంతో అసలు కథ మొదలైంది. ఇప్పటికే కేసీఆర్ వారసులెవరు..? తెరాస మళ్లీ అధికారంలోకి వస్తే సీఎం పీఠాన్ని అధిరోహించేదెవరు..? ఇది ఇప్పుడు తెలంగాణలో జరుగుతున్న ప్రచారం... ఎన్నికలకు మరెంతో సమయం లేక పోవడం అన్ని పార్టీలు అస్త్ర శస్త్రాలను సిద్ధం చేసుకుంటున్న తరుణంలో తెరాసలో మటుకు కేసీఆర్ వారసులెవరన్న రాజకీయ వేడిని పుట్టిస్తోంది. ఇది ఊహాగానం. ఒట్టి ప్రచారమే అని కొట్టి పారేయలేం. ఎందుకంటే తెరాస ముఖ్య నేతల్లో అనేకమంది తమ ఆంతరంగిక చర్చల్లో ఇవే అంశంపై మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవం కూడా ఇదే.. కేసీఆర్ ఢిల్లీ బాట పడితే మరి ఆయన వారసుడిగా ఇక్కడ ఎవరు సీఎం.. ఆ నలుగురు (కేసీఆర్, కేటీఆర్, హరీష్, కవిత) ఈ అంశానికి అంత ప్రాధాన్యత ఉండదని కొట్టి పారేస్తున్నా ఆలోచించాల్సిన అంశంగా చెప్పక తప్పదు. తనదైన చతురతతో, వ్యూహాలతో అసాధ్యమనుకున్న తెలంగాణను కేసీఆర్ సాధించిన తీరు, అటు తరువాత చోటు చేసుకున్న అనేక అంశాలు ఆయన సత్తాను స్పష్టం చేశాయి. తన రాజకీయ వారసుడి అంశానికి కూడా కేసీఆర్ తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెడతారని, సమస్య ఉంటే కూడా అంతే చతురతతో దాన్ని పరిష్కరిస్తారని ప్రచారం కూడా ఉంది.

ఈ అంశాన్ని కాసేపు పక్కన పెడితే కేసీఆర్ శనివారం చేసిన వ్యాఖ్యలు ఢిల్లీలో ప్రకంపనలు పుట్టించినట్లు చెప్పవచ్చు. మూస పద్ధతి మారాలి.. గుణాత్మక మార్పు కావాలంటూ ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ చర్చనీయాంశమైంది. ఢిల్లీలో అధికారమంటే కాంగ్రెస్ లేదా బీజేపీ ఇంతేనా అంటూ కేసీఆర్ చేసిన కామెంట్స్ ఆలోచనలను రేకెత్తిస్తున్నాయి. వాక్చా తుర్యం, మొండితనం, ఎంచుకున్న అంశం పట్ల అంకిత భావం, తెగించి పోరాడే తత్వమున్న కేసీఆర్ దేశ రాజకీయాల్లో మార్పు ఎందుకు అవసరమన్నది స్పష్టం చేశారు. మార్పు అంటే అధికార మార్పు కాదు గుణాత్మక మార్పు కావాలంటూ గణాంకాలతో సహా సోదాహరణగా వివరించారు. చైనా దేశాన్ని ఉదాహరణగా చెప్పిన ఆయన 25 సంవత్సరాల వ్యవధిలో ఆ దేశం సాధించిన ప్రగతిని వివరిస్తూ మనం ఎందుకు సాధించలేమని ప్రశ్నించారు. ఇప్పటికీ తాగు, సాగునీటి కోసం దేశ వ్యాప్తంగా జనం అనేక ప్రాంతాల్లో అల్లాడుతున్నారని అన్నారు. 70 సంవత్సరాల దేశ రాజకీయాల్లో 64 సంవత్సరాలు కాంగ్రెస్, బీజేపీలే పరిపాలించాయని తెలిపారు. రాజకీయ చరిత్రలో పెనుమార్పులు ఉదహరిస్తూ మూడుసార్లు అధికార మార్పిడి జరిగిన విషయాన్ని ప్రస్తావించారు. కేంద్రంలో జనతా పార్టీ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ పార్టీలు అప్పట్లో రాజకీయ ప్రకంపనలు సృష్టించి అధికారాన్ని చేపట్టిన విషయాలను గుర్తుచేస్తూ టీఆర్ఎస్ అంశాన్ని చెప్పారు. 'నా ధిమాక్ ధమ్ పనికొస్తే థర్డ్ ఫ్రంట్‌కు కేంద్రంలో నాయకత్వం వహిస్తా'నని కేసీఆర్ చెప్పడం ఆ పనిముట్టు (టూల్) సిద్ధమైనట్లుగానే చెప్పకతప్పదు. ఏది చేసినా పక్కా స్కెచ్‌తో ముందుకు వచ్చే కేసీఆర్ ఇంతగా స్పష్టత ఇచ్చారంటే అలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు జోరందుకున్నట్లు స్పష్టమవుతోంది.

మేధావులు, సీనియర్ పాత్రికేయులు, ఎకనామిస్ట్‌లు ఇలా ఎంతోమందితో ఢిల్లీ స్థాయిలో తాను చర్చించినట్లు కేసీఆర్ చెప్పడం థర్డ్ ఫ్రంట్ ఊహాగానాలకు బలం చేకూర్చినట్లయింది. భావ సారూప్యత ఉన్న పార్టీలతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని కేసీఆర్ స్పష్టం చేశారు. 'ఇంతదాక వచ్చినాక ముసుగేసుకొని ముందుకెళ్తామా... బాదాప్తా మోదీని కలిసే ముందుకెళ్తా' అని ఆయన చెప్పడం కోసమెరుపు. తెలంగాణ ఏర్పాటైన తరుణంలోనూ కాంగ్రెస్ అధినేత్రి సోనియాను కలిసి స్నేహ హస్తం అందించిన కేసీఆర్ అటు తరువాత ఏం చేశారో అందరికీ తెలిసిందే. ఇప్పుడు కూడా అదే తీరులో మోదీని పొగడుతూనే వార్ సిగ్నల్ ఇస్తున్న కేసీఆర్ అన్నంత పనిచేస్తాడని చెప్పవచ్చు. అన్నింటినీ బేరీజు వేసుకొని రంగంలోకి దిగే కేసీఆర్ ఒక వేళ బీజేపీ తనను ఇరుకునపెడితే ఎలా అన్నదానిలో తన వైఖరిని బయట పెట్టారు. 'జేబుకున్న పెన్ను సహా ఐటీకి లెక్కలు ఇచ్చినం...ఆస్తుల విషయంలో మా కుటుంబం స్పష్టంగా ఉంది... ఇకపై ఇంకా ఎలాంటి ఆస్తులు అక్కర్లేదని తీర్మానించుకున్నాం..' అని కేసీఆర్ స్పష్టం చేశారు. తనను ముట్టుకుంటే భస్మమైపోతారని బీజేపీని నేరుగానే హెచ్చరించారు. ఇలా తనరూటు ఇక ఢిల్లీ వైపు అంటూ ఆయన అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ రాజకీయ ప్రకంపనలను సృష్టిస్తున్నారు.

'వర్గీకరణ' వాస్తవికతకు ప్రతిరూపం

ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ విధానం సామాజిక న్యాయానికి వ్యతిరేకంగా తయారైంది. అసలు రిజర్వేషన్ భావననే అభాసుపాలు చేస్తోంది. మాదిగ, మాదిగ ఉపకులాల ఏబీసీడీ వర్గీకరణ డిమాండ్ వచ్చినప్పుడు విప్లవ, ప్రజాస్వామిక శక్తులు ఈ ప్రాతిపదిక మీద సంఘీభావం ప్రకటించాయి. మాల, మాదిగ కులాల మధ్య పంపకాలకు సంబంధించిన సమస్య కాబట్టి జటిలంగా కనిపిస్తోంది గాని, రిజర్వేషన్ల అనుకూల ఉద్యమానికి మండల్ కమిషన్ సమయంలోనే దేశ వ్యాప్తంగా ఒక బలమైన పునాది ఏర్పడింది. అయితే అక్కడ అగ్రకులాలు అడ్డంగా నిలబడ్డాయి. ప్రతిభను పోటీగా తీసుకొచ్చాయి. ఇక్కడ వర్గీకరణను మాల కులంలోని పిడికెడు మంది ఎదుర్కొంటున్నారు. నిజానికి వర్గీకరణ మాల ఉపకులాలకు కూడా మేలు చేస్తుంది.

ఈ పాతికేళ్ల అనుభవాలు, వాదాలు, వివాదాలు మన సామాజిక వ్యవస్థ స్వభావాన్ని తెలియజేస్తున్నాయి. నిచ్చెనమెట్ల కులవ్యవస్థలో పైన ఉన్న ప్రతి కులం తాను ఎక్కువ అనుకోవడం, కింది ఉన్న కులాల పట్ల చిన్నచూపుతో ఉండటమే బ్రాహ్మణీయ ఆధిపత్య భావజాలం. దోపిడీ దౌర్జన్యాలకు, అంతిమంగా విముక్తికి వ్యతిరేకంగా దళిత, పీడిత కులాలన్నీ సామాజిక తలంలో అయినా ఐక్యం కావడానికి అవరోధం ఇక్కడే ఉన్నది. అనేక ప్రజా పోరాటాల ఫలితంగా రాజ్యాంగంలో భాగమైన రిజర్వేషన్లను జనాభా ప్రకారం పంచుకోడానికి కూడా సిద్ధం కాలేకపోవడానికి కులవ్యవస్థ స్వభావమే కారణం. లేకపోతే మాల నాయకత్వం ఇరవై ఏళ్ల కిందే ముందుకు వచ్చి ..ఇంతకాలం గుర్తించ లేకపోయాం .. అన్యాయం జరిగిపోయింది.. వెంటనే దళితుల్లోని అన్ని కులాలకు జనాభా ప్రకారం ఉమ్మడి రిజర్వేషన్లు పంచాల్సిందే.. అనేది.

దళితులకు రిజర్వేషన్లు అంటే మాల, మాదిగకు, ఆ మాత్రం కూడా ఎదగని ఇతర ఉపకులాలకు ఈ ఫలాలు దక్కడమే. వర్గీకరణ డిమాండ్ వచ్చాక ఈ దిశగా దళిత ఉద్యమంలో గట్టి ప్రయత్నం జరగలేదు. నిజానికి మాలకులంలో చాలా ప్రభావశీలమైన వ్యక్తులు, నాయకులు చాలారంగాల్లో ఉన్నారు. వాళ్లలో కొందరికైనా ప్రజాస్వామికవాదులనే గుర్తింపు ఉన్నది. అలాంటి వారిలో ఒకరిద్దరు వర్గీకరణ సానుకూలతకు కృషిచేసి ఉండవచ్చు. కానీ ఫలించలేదు. దాదాపుగా మాల నాయకత్వం తమ కులం ప్రయోజనం గీటురాయిగానే ఆలోచించింది. ఈ సమస్యను ఓట్ల రాజకీయాల్లోకి తీసికెళ్లి వర్గీకరణను అడ్డుకోవాలని చూసింది. అలాగే ఈ పక్క వర్గీకరణ సాధన అనే పేరుతో దండోరా నాయకత్వం మధ్యమధ్యలో ఉద్యమం చేస్తూనే ఓట్ల రాజకీయాలను ఆశ్రయించింది. ఇక్కడి దాకా రాకుండా సమస్య పరిష్కారం కావాలని ప్రజాస్వామిక శక్తులు రెండో దశలో సమైక్యత కోసం, సమన్వయం కోసం చేసిన ప్రయత్నాలు కూడా ఫలించలేదు.

> **దళిత, బహుజన కులాలు రాజ్యాంగ పరిధిలో పొందేది కొంచెమే. వాళ్ల ముందు విముక్తి, ప్రగతి అనే లక్ష్యాలు ఉన్నాయి. బూర్జువా మార్గంలో విముక్తి ఎలాగూ సాధ్యం కాదు. చదువు, ఉద్యోగాల వల్ల (అట్లని తక్కువ చేయనవసరం లేదు) సాధించే ప్రగతి కూడా ఎలా ఉంటుందో ఈ డెబ్బై ఏళ్లలో చూస్తునే ఉన్నాం. కాబట్టి సామాజిక న్యాయం కోసం పోరాడటమంటే బూర్జువా పరిధిలో కుదించుకు పోవడం కాదు.**

వేర్వేరు రంగాల్లో ఉన్న మాల ప్రముఖులు దళిత అస్తిత్వం, ఆర్తి, ఆకాంక్షలు వినిపించినవాళ్లే. కానీ వర్గీకరణ ఉద్యమం వచ్చాక వాళ్లంతా మాల కులస్థులుగా ప్రతిస్పందించారు. పీడిత అస్తిత్వ స్పృహలు ఎన్నో సామాజిక, సాంస్కృతిక సంబంధమైన విషయాలను వెలుగులోకి తెచ్చాయి. పాత వాటిని కొత్తగా చూపించాయి. ముఖ్యంగా ఒకరకమైన సామాజిక సున్నితత్వాన్ని అలవర్చాయి. కానీ అంతిమంగా సాంఘిక విముక్తి అంటే ఏమిటి? అనే ప్రశ్నకు పార్లమెంటరీ మార్గంలో అధికారం సంపాదించడమే అనే అర్థం దాదాపుగా స్థిరపరచారు. ఇది కూడా ఆరోపణ కాదు. పీడిత కుల అస్తిత్వవాదులు తాముగా తేల్చేసిన వాదన ఇది. ఆరకంగా ఇది వాళ్లు చెబుతున్న అస్తిత్వవాదంలో భాగం. దీనికి భిన్నంగా ఆలోచించేవాళ్లూ ఉండొచ్చు. అంటే పార్లమెంటరీ, రాజ్యాంగ వాదానికి భిన్నంగా ఆలోచించేవాళ్లు ఉండొచ్చు. కానీ సాంఘిక విముక్తికి ప్రధానమార్గంగా ప్రకటితమైనది మాత్రం దళిత బహుజన మెజారిటీ ఓట్ల ఆధారంగా చట్టసభల్లో సీట్లు పొందడమే. దీన్నే రాజ్యాధికారం అను కొని, దాని సాధించడం ద్వారా సాంఘిక విముక్తి పొంద వచ్చని అనుకుంటున్నారు. లేదా సాంఘిక విముక్తికి దారి సుగమం అవుతుందని అంటున్నారు. ఇది సరికాదని ఆ యా పీడిత అస్తిత్వవాదుల్లో ప్రత్యేకంగా ఎవరైనా చెబుతున్నారా? ఆధారాలు లేవు.

చట్టసభల్లో మెజారిటీ సీట్లు పొందడానికి దళిత బహుజన పీడిత కులాలన్నీ ఏకం కావాలని, తద్వారా ఆత్మగౌరవం ప్రకటించుకొనే క్రమంలో రాజ్యాధికారం సంపాదించుకోవాలని అంటున్నారు. ఇదంతా జరగాలంటే అంటరానితనంతో వెలివేతకు గురవుతున్న కులాలు, మిగతా పీడిత కులాలు ఒకటి కావాలి. దీనికి ఆయా పీడితకులాల మధ్య ఉన్న సామాజిక అంతరాలు అవరోధంగా ఉన్నాయి. అగ్ర కుల ఆధిపత్య వ్యతిరేకత అనే ముఖ్యమైన ఉమ్మడి ప్రాతిపదిక మీద దీన్ని అధిగమించేందుకు ప్రయత్నించవచ్చు. కానీ ఇది ఒక్కటే సరిపోదని, అస్తిత్వవాదం ప్రకారమే కింది కులాల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం సాధ్యం కాదని ఎస్సీ వర్గీకరణ ఉద్యమ అనుభవాలు చెబుతున్నాయి.

మాదిగ, మాదిగ ఉపకులాలకు, మాల ఉపకులాలకు మేలు జరిగే వర్గీకరణకు దాదాపు పాతికేళ్లుగా అవరోధంగా ఉన్న సమస్యలను విస్మరించి సామాజిక న్యాయ సాధనను, పీడిత అస్తిత్వవాదాలను అర్థంచేసుకోవడం కష్టం. ఎన్నికల ద్వారా పార్లమెంటరీ పద్ధతిలో రాజ్యాధికారం సంపాదించుకోడానికి ఉన్న సవాళ్లను పట్టించుకోకుండా సాంఘిక విముక్తి సాధిస్తామని అనుకోవడం కల్ల. ప్రజా ప్రాతినిధ్యం అనే విలువను బూర్జువా ప్రజాస్వామ్యం తీసుకొని వచ్చింది. అయితే రాజ్యాంగయంత్రంపై బూర్జువావర్గం (సామాజికంగా అగ్రకులాలు) ఆధికారం చెలాయిస్తున్నంత కాలం, కులవ్యవస్థ ఉన్నంతకాలం సామాజికన్యాయం అమలు కావడమే కష్టమని గత ముప్పై ఏళ్ల సామాజిక రాజకీయ ప్రయోగాలు రుజువు చేస్తున్నాయి. వర్గీకరణ నినాదం ఒక సామాజిక వాస్తవికతను ఎత్తిచూపింది. అంతే కాదు, అస్తిత్వవాదాల ముందున్న సవాళ్లను కూడా దాపరికం లేకుండా బయటికి తెచ్చింది. దీన్ని దీనిగా కాకుండా అస్తిత్వ సామాజిక, సాంస్కృతిక, మేధో రంగాలకు బయటి సమస్యగా సమస్యగా చూసేవాళ్లూ ఉండొచ్చు. ఇది అన్నిటికంటే ప్రమాదం. శకలీకరణ వాదానికి తిరుగులేని ఉదాహరణగా మిగిలిపోతుంది. వర్గీకరణ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించడమంటే మాదిగ, మాదిగ ఉప కులాలకు రిజర్వేషన్ల ద్వారా కలిగే చిన్న ప్రయోజనం నెరవేరాలని కోరుకోవడమే కాదు. అది ఎట్లాగూ ఉంటుంది. అయితే అది లేవదీసిన సవాళ్లను పట్టించుకోకుండా దాటవేయడం కుదరదు. ఇవేమీ పట్టించుకోకుండా ఎన్నికల మార్గంలో సాంఘిక విముక్తి సాధించాలనుకుంటే ఎండమావి వెంట పరిగెత్తడమే. కొందరు ఎన్నికలు, సామాజిక పోరాటాలు అనే జమిలి సూత్రం ముందుకు తేవచ్చు. ఓట్లకు, పోరాటాలకు కూడా అనేక అంతరాలు ఉన్న పీడిత కులాలన్నిటినీ కలిపే సాధారణ తలం ఏమిటి? అని మళ్లీ మొదటి ప్రశ్న దగ్గరికే చేరుకుంటారు.

పీడిత అస్తిత్వాలకు, పీడిత వర్గానికి ఉండే మౌలిక సంబంధాన్ని అంగీకరించకుండా ఒక్క ఆడుగు కూడా సాగదు. అది చాలా లోతైన సిద్ధాంత విషయం. అంటే ఆచరణకు సంబంధించిన విషయం. వర్గీకరణ ఉద్యమ నేపథ్యంలో ఏర్పడిన సామాజిక ప్రపంచం ఈ విషయంపట్ల శ్రద్ధ పెట్టకపోవడం వల్లే ఉమ్మడి రిజర్వేషన్ల పంపకాలనే అతి చిన్న డిమాండ్ నెరవేరలేదు. దీనికి పాలకవర్గ స్వభావం, ఓట్ల పార్టీల అవకాశవాదం, వంచన తక్షణ కారణాలే. అందువల్ల ముందు పాలకపార్టీలను, ప్రభుత్వాలనే బోను ఎక్కించాలి. ఈ క్రమంలో వర్గీకరణ ఉద్యమం నడిచిన తీరు కూడా చర్చనీయాంశమే. నిజానికి వర్గీకరణ వల్ల మాదిగ ఉపకులాలు పొందేది చదువులో కొన్ని సీట్లు, కొన్ని ఉద్యోగాలు మాత్రమే. సమాజంలో వాళ్లు పొందాల్సిన వాటి ముందు అవి చాలా స్వల్పమే. దళిత, బహుజన కులాలు రాజ్యాంగ పరిధిలో పొందేది కొంచెమే. వాళ్ల ముందు విముక్తి, ప్రగతి అనే లక్ష్యాలు ఉన్నాయి. బూర్జువా మార్గంలో విముక్తి ఎలాగూ సాధ్యం కాదు. చదువు, ఉద్యోగాల వల్ల(అట్లని తక్కువ చేయనవసరం లేదు) సాధించే ప్రగతి కూడా ఎలా ఉంటుందో ఈ డెబ్బై ఏళ్లలో చూస్తునే ఉన్నాం.

కాబట్టి సామాజిక న్యాయం కోసం పోరాడటమంటే బూర్జువా పరిధిలో కుదించుకుపోవడం కాదు. బూర్జువా మార్గం మీద విమర్శ పెట్టి, దాన్ని తిరస్కరించి అసలైన ప్రజాస్వామిక మార్గాన్ని అందుకోవడమే.

◆ పాణి

(నేడు ఎస్సీ వర్గీకరణపై విరసం సదస్సు)

శ్రీదేవీ.. నువ్వంటే అందమేనా?

ప్రియమైన శ్రీదేవీ..

నువ్వు నువ్వు కాదు! నువ్వూ నేనూ వేరు కాదు! నువ్వూ నేనూ వొకటి కాదు?! నువ్వు చనిపోయినాక నేను మాత్రం మిగిలుంటానా?! నువ్వులేక నేను లేను! లేనే లేను!

ఎవరయినా యెపుడయినా చనిపోతారని తెలుసు! కాని శ్రీదేవీ.. నువ్వు కూడా చనిపోతావని తెలీదు! మన చావు మనకు తెలీదు కదా? మన చావుని మనం ముందస్తుగా వూహించలేం కదా? అయినా నువ్వు యెత్తీ దించకుండా యే రోగం బారిన పడకుండా యే ఆసుపత్రులూ తిరక్కుండా యే వైద్యుల ప్రయోగాలకి దొరక్కుండా నిద్రలోనో మెలకువలోనో నీకే తెలిసీ తెలియకుండా తనువు చాలించావుకదా, అదే చాలనుకోనా? కష్టమైన జీవితానికి సుఖమైన చావని సరిపెట్టుకోనా? మరి యీ అర్థాంతరపుచావేమిటి? పోని చావు అర్థాంతరంగా వుండొచ్చు! కాని అర్థవంతంగా వుండాలి కదా?

చెప్పు దేవీ చెప్పు.. నువ్వెలా చనిపోయావో చెప్పు. ప్చ్.. నిజమే, చనిపోయాక చెప్పడానికేం లేదు! చెప్పినా చెల్లదు! సరే నీ పోస్ట్ మార్టం నివేదికని నువ్వు చూశావా? అందర్నీ నీ అభినయంతో అరెస్టు చేసిన నువ్వు కార్డియాక్ అరెస్టుకు గురయ్యావని మొదట విన్నప్పుడు నాకూ తీవ్రమైన గుండెపోటు వచ్చింది! నీకు వస్తే నాకు రాకుండా యెలా వుంటుంది? నీ గుండె ఆగితే నా గుండె ఆగకుండా యెలా వుంటుంది? లేదు.. నువ్వు మద్యం సేవించి ఆమత్తులో బాత్ రూమ్ టబ్బులో ప్రమాదవశాత్తూ పడి తలకు గాయమై చనిపోయావన్నది ఫోరెన్సిక్ రిపోర్ట్! పోస్ట్ మార్టం రిపోర్ట్!అదే యే మగాడన్నా చనిపోవడానికి ముందు తాగివుంటే అది పాయింటే కాదు! నువ్విప్పుడు తాగుబోతువి! ప్రపంచానికి వున్న రెండుకళ్ళూ మోసావ్..వొకటా రెండా సర్జరీల మీద సర్జరీలు చేసి శరీరాన్ని సరిదిద్దుకున్నావ్.. కొలతల్లో నిన్ను నువ్వు బంధించుకున్నావ్.. చూసేవాడి కంటి చూపే శాసనాలుగా చేసుకున్నావ్.. అసలు నువ్వెప్పుడైనా నీకు నచ్చింది నువ్వు తిన్నావా? కడుపునిండా వొక్క పూటంటే వొక్క పూట తిన్నావా?



నీ శరీరాన్ని యెంత హింసించుకుంటే.. యెన్ని పూటలు.. యెన్ని రోజులు.. యెన్నెన్ని నెలలు.. యెన్నెన్ని సంవత్సరాలు హిసించుకుంటే పేగులు బిగించి ముడేసుకుంటే కడుపు కాల్చుకుంటే నీకీ అందం వచ్చింది?నాకయితే అందం అనేది అత్యంత బూతు పదం! ఎవరి అందం వారిదని నీవెరగనిదా? చూడు.. నువ్వు చనిపోయినాక ఎంబామింగ్ చేశారని గుడ్డిలోకం అనుకుంటోంది! నువ్వు బతికి వున్నప్పుడూ చేసింది అదే కదా? ఆ ఎంబామింగే కదా? మనుషులు ఎండిపోరా? పండిపోరా? ఎల్లవేళలా తాజాగా వుండడానికి నువ్వేమైనా 'యింద్రజ'వా? మామూలు మనిషివి కావా?

చూడు.. మూసిన కళ్ళు తెరిచి యిప్పుడైనా చూడు.. నువ్వంటే యీ జనానికి దేహం! దాహం! మోహం! చూడు.. నువ్వు చనిపోయావన్న స్పృహ లేకుండా నువ్వూ చీమూ నెత్తురూ వున్న మనిషివని గుర్తులేకుండా.. టీవీల నిండా నీ అందమే యేరులై పారుతోంది! నీ మెడ నునుపూ విశాలమైన వీపూ నడుము వంపూ నీ చనుకట్టూ నీ అధరమూ నీ జఘనమూ నీపిరుదులూ యివే ప్రవహిస్తున్నాయి! 'ఆకుచాటూ పిందె తడిచే.. కొమ్మ చాటు పువ్వు తడిచే..' తడిపితే తడిసిన తడిపి మోపెడు అందాలు యింటింటినీ యెత్తి ముంచుతున్నాయి! అందరూ వేటగాళ్ళే! నువ్వు 'లేడి'వి! ఏ 'లేడీ' అయినా అలానే రూపు కట్టాలి కదా? అదిగో 'సిరిమల్లె పూవా..' నీ పదహారేళ్ళ పురుషుడవి! దృష్టి పురుషుడిది! అయినా ఆ మత్తు నీ బాధని చిత్తు చేసిందా? మొత్తానికి మోకాలి లోతు నీళ్ళలోమునిగి వూపిరాడక చనిపోయావని అంటే నాకయితే నమ్మబుద్ధి కావడం లేదు! నువ్వు ఖచ్చితంగా నీ కన్నీళ్ళలో మునిగిపోయి చనిపోయి వుంటావు!

ఒంటి మీద గీత పడితే తట్టుకోలేనిదానివి! కత్తుల కోతలకి యెలా వొప్పుకున్నావే?! నీ సిల్కు శిరోజాలు యేమయ్యాయి? నీకు శిరోముండనం చేసి నీకు యిష్టమని కంచిపట్టు చీర కప్పి పెట్టారా? మల్లెల మనోరథం మీద నీ భౌతికకాయాన్ని కీర్తికాయం చేసి వూరేగించినప్పుడు గుక్కపట్టి యేడ్చావా? నీలో నువ్వే నవ్వుకున్నావా? ఇదే కాదు, యేదయినా యెప్పుడయినా బైటికి కనిపించనిచ్చావా? మేకప్పుని కప్పుకున్నట్టే నవ్వుని ముఖానికి అద్దుకొని అతికించుకొని బతికేశావని యెవరూ యెరగనిదా? అసలు నువ్వు నువ్వుగా వున్నావా? పుట్టింది మొదలు తండ్రో తల్లో చెల్లో భర్తో యెవరో వొకరు నీకు యజమాని! కష్టం నీది! కాసు వాళ్ళది! శ్రమ నీది! అధికారం మాత్రం వాళ్ళది! అధికారం వాళ్ళది మాత్రమేనా? నిన్ను అభిమానించే నీ ప్రేక్షకులది మాత్రం కాదా? తిలా పాపం తలా పిడికెడు! నీదీ పిడికెడు వుంది! చదవనూ రాయనూ రాకపోయినా జీవితాన్ని చదువుకున్న దానివి! ప్రపంచాన్ని చూసిన దానివి! వయసే అందమని నీకు తెలియనిదా? వయసే అపురూపమని నీకు తెలీదా? నలభైయేళ్ళ క్రితం వున్న పదహారేళ్ళు యెప్పటికీ అలానే వుండిపోతాయా? నిన్ను 'అందాల రాశి' అన్నందుకు 'అతిలోక సుందరి' అని కీర్తించినందుకు ఆముద్రని నిలుపుకోవడానికి ముక్కు కోయించుకున్నావ్.. పెదవులు కత్తిరించుకున్నావ్.. నిండుదనం అతికించుకొని బరువైన గుండెల్ని అందాలు బొప్పాయి కాయల్లో సృజనాత్మకంగా వెల్లివిరుస్తున్నాయి! నీ అందాన్ని కీర్తిస్తూ నిన్ను అత్యాచారం చేస్తున్నాయి! పగలు నీ సినిమాలు సహా యీ రాత్రి పొద్దుబోయాక 'హాట్ సాంగ్స్' అన్నీ నీవే! చచ్చినా నిన్ను వదలరు! వీళ్ళకోసమా నువ్వు దేహాన్ని ఖండ ఖండాలుగా చెక్కుకొని చిక్కుకున్నది! చాలదన్నట్టు నువ్వు పడ్డ హింస మరిచిపోయి నీ స్థానంలోకి నీ కూతుళ్ళు రావాలని ఆశపడుతున్నది! నీకన్నా యెవరైనా గెలవగాలరా? అసలు నువ్వు గెలిచావా? ఓడావా?

నువ్వింక 'మిస్టర్ ఇండియా'గా మాకు గుర్తుండవ్! 'మిస్టరీ' గానే గుర్తుంటావ్! అందరికీ నీ భర్తతో సహా 'క్లీన్ చిట్' యిచ్చేసారు! మరి నీకెవరిస్తారు క్లీన్ చిట్? నీ చావు వెనుక రహస్యాలను యెవరు బయట పెడతారు? కాకపోతే యిక అందరూ నిన్ను కీర్తిస్తారు! కాని నీ పక్షాన యెవరున్నారు? ఎవరూ యేమీ మాట్లాడకుండా దుబాయి ప్రభుత్వం కేసు మూసేసింది! విమానం ఇండియా చేరేలోపలే తెగవాగిన ఛానళ్ళ నోళ్ళూ మూతబడిపోయాయి! తెచ్చిన వారెవరు? తేల్చిన వారెవరు? వాళ్ళ కనుసన్నల నియంత్రణలోనే కదా.. దేశమయినా దేహమయినా నడిచేది? గప్ చిప్! ఏటా నీ వర్ధంతులు చేసుకుంటారు! నీ గురించి వదంతులూ చేసుకుంటారు!

నువ్వూ నేనూ విడిపోయి యాభై యేళ్ళు కావచ్చు.. కానీ మనం యిద్దరమూ వొకరికొకరం యాభై నాలుగేళ్ళుగా తెలుసు!

నువ్వే నేనయిన.. నీలో నేనయిన..

నీ

శ్రీ అమ్మా యాంగేర్ అయ్యపాన్

◆ బమ్మిడి జగదీశ్వరరావు

సినిమా అంటే 24 శాఖల కలయిక అనడం కంటే కష్టం అనొచ్చు. అది శారీరకంగా అయినా, మానసికంగా అయినా ఉంటుంది. అన్ని శాఖలు కష్టాలు పడేవి మాత్రం ప్రేక్షకుడిని సంతోష పెట్టడానికే అనేది వాస్తవం. ఒక్కొక్క శాఖకు ఒక్కో ప్రత్యేకత.. ప్రాముఖ్యత ఉంటుంది. దేని కష్టం దానిదే.. దేని ప్రాముఖ్యత దానిదే. అటు వంటి ప్రత్యేకత.. ప్రాముఖ్యత ఉన్న డిపార్ట్‌మెంట్ ఎడిటింగ్. దర్శకుడి ఆలోచనలను కుదురుగా కూర్చి.. ఆ ఆలోచనలను ప్రేక్షకుడికి అర్థమయ్యేలా తెరపై ఆవిష్కరింపచేసే ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో ... తనదైన శైలిలో రాణిస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్న ఎడిటర్ ప్రవీణ్ పూడి. 'ఇతర సామాజిక మాధ్యమాల్లో ఎవరికి వాళ్లు ఏవేవో ఎడిట్ చేస్తూనే ఉంటారు. అవన్నీ ఎడిటింగ్ కిందకు రావు. అటు ఇటు మార్చి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వేసి చేయడం ఎడిటింగ్ కాదు. ఇదంతా ఒక స్టేజ్ మాత్రమే. ఆ తర్వాత స్టేజ్ ఒకటి ఉంటుంది. కథకు స్క్రిప్ట్, క్యారెక్టర్ బిహేవియర్స్ చాలా కీలకం. అవన్నీ దర్శకుడు ఆలోచిస్తూనే సినిమాను తెరకెక్కిస్తారు. ఆ విషయాన్ని ఎడిటర్ కూడా గ్రహించాలి. స్క్రిప్ట్ మూడ్‌ని అర్థం చేసుకోవాలి. ఈ ప్రయాణంలో ప్రతిరోజూ నేర్చుకోవడమే అని అంటున్న ఎడిటర్ ప్రవీణ్ పూడితో మనం ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ...





ఎడిటర్ టు డైరెక్టర్...

కథని తెరమీద చెప్పాలంటే దర్శకుడికి చాలా క్వాలిటీస్ ఉంటాయి. అవన్నీ ఉంటే ఎడిటర్ కాస్త సులభంగా డైరెక్టర్ కాగలుగుతాడు. కథకు సంబంధించిన అవగాహన.. రచన మీద, మ్యూజిక్ మీద పట్టు ఉండాలి. కథను చక్కగా నెరేట్ చేయాలనే అభిప్రాయం ఉండాలి. ఇవన్నీ ఉంటే ఎడిటింగ్ అనేది సినిమాకు ప్లస్ అవుతుంది. అంతేగానీ ఎడిటింగ్ చేయగలిగినంత మాత్రాన డైరెక్షన్ చేయగలిగినట్టు కాదు.



సినిమా ఇబ్బందులు అప్పుడే తెలుస్తాయి

– ప్రవీణ్ పూడి

నేపథ్యం...

నాన్నది ఏలూరు, అమ్మ వాళ్లది గుడివాడ. నాన్న మెకానికల్ ఇంజనీర్ కావడంతో కోదాడ దగ్గర హుజూర్ నగర్‌లో సెటిల్ అయ్యాం. తర్వాత అక్కడి నుండి హైదరాబాద్‌కి వచ్చేశాం. ఆర్థిక పరిస్థితులు బాగులేకపోవడంతో నేను ఇంటర్ మధ్యలోనే చదువు ఆపేశాను. సినిమా ఇండస్ట్రీలో మాకు తెలిసినవారు కెమెరా అసిస్టెంట్‌గా నన్ను జాయిన్ అవమని సలహా ఇచ్చారు. అప్పట్లో ఫిలిం కెమెరా డిపార్ట్‌మెంట్‌లో చేరడానికి వయసు సరిపోదనిపించింది. నాకు తెలిసిన కజిన్ ఒకాయన ఎడిటింగ్‌లో జాయిన్ అయితే బావుంటుందని సలహా ఇచ్చారు. అప్పట్లో సినిమా అంతా లాక్ చేశాక, ఫైనల్‌గా నెగిటివ్ మ్యాచ్ చేసి ఎడిట్ చేసే డిపార్ట్‌మెంట్‌లో ఆయన పనిచేసేవారు. (ఈ ఫైనల్ నెగిటివ్ ల్యాబ్‌కు వెళుతుంది). ఆయనే నన్ను ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లోకి తీసుకొచ్చారు. ఆయన పనిచేసే సినిమాలు పూర్తి కాగానే మిగతా సమయం ఖాళీగా ఉండేవాడిని. కోటగిరి వెంకటేశ్వరరావుగారి అసిస్టెంట్‌గారి వద్ద నన్ను జాయిన్ అవమని చెప్పారు. అప్పుడు కోటగిరి వెంకటేశ్వరరావు (చంటి) గారి వద్ద అప్రెంటీస్‌గా జాయిన్ అయ్యాను. తర్వాత అసిస్టెంట్ ఎడిటర్ అయ్యాను. రెండున్నరేళ్ల పాటు అసిస్టెంట్‌గా పనిచేశాను. 'చూడాలని వుంది', 'సమరసింహారెడ్డి', 'రాజకుమారుడు' సహా పలు సినిమాలకు పనిచేశాను. 'రాజకుమారుడు' సమయంలో చంటిగారికి కాలుకి గాయమైంది. డాక్టర్స్ బెడ్ రెస్ట్ తీసుకోమని చెప్పారు. అప్పుడు 'రాజకుమారుడు' సినిమాకు సంబంధించిన ఎడిటింగ్ వర్క్‌ను పూర్తి చేయమని దత్తుగారు, రాఘవేంద్రరావుగారు మార్తాండ్ కె.వెంకటేశ్‌గారిని కోరారు. ఆయన ఆ వర్క్‌ను పూర్తి చేయడానికి మార్తాండ్‌గారు ల్యాబ్‌కు వచ్చారు. ఆయనతో ఏర్పడ్డ పరిచయంతో మార్తాండ్‌గారి వద్ద నేను జాయిన్ అయ్యాను. మార్తాండ్‌గారి వద్ద 'కలిసుందాం రా', 'బద్రి' సహా పలు సినిమాలకు రెండేళ్ల పాటు పనిచేశాను. ఆ సమయంలో






ఎన్‌లాగ్‌లో డిజిటలైజేషన్ స్టార్ట్ అయ్యింది. ఆ ప్రాసెస్‌లో మార్తాండ్‌గారు నన్ను డిజిటల్‌లో ఎడిటింగ్ చేసే సాఫ్ట్‌వేర్ టూల్ ఎవిడ్ నేర్చుకోమని సలహా ఇచ్చారు. అయితే నాకు హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ గురించి తెలియకపోవడంతో మధురానగర్‌లోని ఓ కంప్యూటర్ కోర్సులో జాయిన్ అయ్యాను. అప్పట్లో ప్రసాద్ ల్యాబ్స్, శబ్దాలయా స్టూడియో, రామానాయుడు స్టూడియోల్లో మాత్రమే ఎవిడ్ ఉపయోగించి ఎడిటింగ్ చేసేవారు. ఈ మూడు స్టూడియోల్లో ముగ్గురు ఎడిటర్స్ ఉండేవారు. వీళ్ల ముగ్గురు టెక్నికల్‌గా అవిడ్ సంస్థతో ప్రత్యేకంగా శిక్షణ పొందినవారే. మార్తాండ్‌గారి సినిమాలను ఈ మూడు స్టూడియోస్‌లో వీలును బట్టి ఎడిట్ చేసేవారు. ఆ ప్రాజెక్ట్స్‌లో పనులు ఎలా జరుగుతున్నాయో చూడమని నాకు మార్తాండ్‌గారు బాధ్యతలను అప్పగించారు. ఈ క్రమంలో శబ్దాలయాలోని శ్రీగుహ, ప్రసాద్ ల్యాబ్స్‌లో కార్తిక్‌లతో మంచి పరిచయం ఏర్పడింది. వారితో కలిసి పనిచేయడం వల్ల సాంకేతికంగా ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. డిజిటల్‌లో ఇంకా నైపుణ్యం సాధించాలని అనుకుంటున్న సమయంలో.. ప్రియదర్శిని రామ్ స్టూడియో, చిత్రలేఖ స్టూడియో, సిబార్ స్టూడియో, బి.నర్సింగరావు స్టూడియో అంటూ కొన్ని స్టూడియోలను స్టార్ట్ చేశారు. ఆ సమయంలో శ్రీగుహ సిబార్ స్టూడియోలో జాయిన్ అయ్యారు. అదే స్టూడియోలో మార్తాండ్‌గారి రెండు సినిమాలకు సంబంధించిన పనులను పర్యవేక్షించమని నాకు చెప్పారు. సిబార్ స్టూడిలో టెలివిజన్, డబ్బింగ్, ఎడిటింగ్ సహ పలు డిపార్ట్‌మెంట్‌లు ఉండటాన్ని గమనించాను. అక్కడ మరికొన్ని విషయాలను నేర్చుకున్నాను. శిబార్ గ్రూప్‌కి చెందిన సృష్టి స్టూడియో ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో జాయిన్ అయ్యాను. అందులో కొన్ని ఫీచర్ ఫిలింస్, కమర్షియల్ యాడ్స్, డాక్యుమెంటరీలకు పనిచేశాను. సృష్టిలో రెండున్నరేళ్లు పనిచేసిన తర్వాత పవన్‌కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌కు చెందిన ఎడిటింగ్ డిపార్ట్‌మెంట్‌లో జాయిన్ అయ్యాను. ఇందులో ఎడిటర్‌గా ఎంటీవీకి చెందిన యూసఫ్ ఖాన్ పనిచేసేవారు. 'జానీ' నుండి 2008 వరకు పవన్‌కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్‌లో పనిచేశాను.









ఎడిటింగ్ అంటే...



ఎడిట్ చేయడమంటే ఎవరో తీసుకొచ్చిన అవుట్‌పుట్‌ని కేవలం ముందు, వెనుక కట్ చేసి అతికించడం కాదు. ఇప్పుడు ఫేస్‌బుక్‌లలో, ఇతర సామాజిక మాధ్యమాల్లో ఎవరికి వాళ్లు ఏవో ఎడిట్ చేసి చేస్తూనే ఉంటారు. అవన్నీ ఎడిటింగ్ కిందకు రావు. ముందూ, వెనుకలు కట్ చేసి అతికిస్తే సరిపోదు. ఐదారు వీడియోలను లేదా షాట్‌లను మిక్స్ చేసి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వేసి చేయడం ఎడిటింగ్ కాదు. ఇదంతా ఒక స్టేజ్ మాత్రమే. ఆ నెక్స్ట్ స్టేజ్ ఒకటి ఉంటుంది. స్క్రిప్ట్, క్యారెక్టర్ బిహేవియర్స్ చాలా కీలకం. అవన్నీ దర్శకుడు ఆలోచిస్తూనే సినిమా చేస్తారు. ఆ విషయాన్ని ఎడిటర్ కూడా గ్రహించాలి. స్క్రిప్ట్ మూడ్‌ని అర్థం చేసుకోవాలి. కథను, టెక్నికల్ పద్ధతులు అన్నీ చేసిన తర్వాత, ఆడియన్ ఆలోచనలకు అనుగుణంగా సినిమా చేయాలి. అంతకు ముందు చేసిందంతా దర్శకుడు చెప్పిన ఎడిటింగ్. ఆ తర్వాత స్క్రీన్‌ప్లేని చూసే విధానం మారాలి. అంటే ఎడిటర్ సినిమాను ఆడియన్‌గా చూడాలి. అప్పుడు కథ ఎలా వెళ్లింది? ఏ సీన్‌లో ఎలా చెప్తున్నాం.. అనేది తెలుస్తుంది. టేకాఫ్ ఎలా ఉంది? కామెడీ ఎలా ఉంది? క్లైమాక్స్ ఎలా ఉంది? వంటివన్నీ అర్థమవసాగుతాయి. అంతేగానీ నాలుగు టూల్స్ నేర్చుకుని వచ్చి చేసేది ఎడిటింగ్ కాదు. ఇన్ డెప్త్ నాలెడ్జ్ కావాలి. స్క్రీన్‌ప్లే అనేది కూడా తెలియాలి. ఆడియన్‌ని సినిమాలోకి తీసుకెళ్లగలిగితే అది గ్రేట్. మనం చూసి డిసైడ్ అయ్యాకే కొన్ని వేల మంది సినిమా చూస్తారు. వాళ్ల దృష్టితో సినిమాను చూస్తేనే సినిమాలో ఉన్న ఇబ్బందులన్నీ తెలుస్తాయి.



నా కోరిక అలా తీరింది...

ఇండియాలో వన్ ఆఫ్ ది ఫైనెస్ట్ ఎడిటర్ శ్రీకర్ ప్రసాద్‌గారితో పనిచేయాలని నాకు కోరిక ఉండేది. ఆయన వర్కింగ్ స్టైల్ అంటే ఎంతో ఇష్టముండేది. త్రివిక్రమ్‌గారి దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ హీరోగా 'జల్సా' సినిమాకు శ్రీకర్ ప్రసాద్‌గారు ఎడిటర్. శ్రీకర్‌గారికి హైదరాబాద్‌లో ఓ ఎడిటింగ్ రూమ్ ఉంది. 'జల్సా' సినిమాకు అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేసే అవకాశం వచ్చింది. ఎప్పుటినుండో ఆయనతో కలిసి పనిచేయాలనుకున్నాను. కాబట్టి నేను పవన్‌కల్యాణ్‌గారి పర్మిషన్ తీసుకుని 'జల్సా' సినిమాకు అసోసియేట్ ఎడిటర్‌గా పనిచేశాను. ఆ తర్వాత 'ఖలేజా' సినిమాకి కూడా శ్రీకర్‌గారి వద్ద పనిచేశాను. ఇక కావాల్సినంత అనుభవం వచ్చింది కదా! నెక్స్ట్ ఎడిటర్ అవుదామని అనుకున్నాను. కానీ నేను ఎడిటర్ కావడానికి కాస్త గ్యాప్ వచ్చింది. ఒకటిన్నర సంవత్సరం పాటు వెయిట్ చేశాను. నాకు సాయి అనే స్నేహితుడు ఉండేవారు. ఆయన ద్వారా మన్యం రమేష్‌గారు పరిచయం అయ్యారు. ఆయన నిర్మాణంలో.. అశోక్ రూపొందించిన 'ఆకాశరామన్న' సినిమాకు తొలిసారిగా ఎడిటర్‌గా పనిచేసే అవకాశం వచ్చింది.

సక్సెస్ పర్సెంటేజ్ ఎంతంటే...

సినిమా సక్సెస్‌లో పర్సెంటేజ్ అని ఏముంటుంది. అన్నీ డిపార్ట్ మెంట్లు కలిస్తేనే సినిమా. సినిమా, స్క్రీన్‌ప్లే అనేది ఒక డైరక్టర్ పేపర్ మీద రాసుకున్నప్పుడు ఏదయితే ఫీల్ అవుతాడో దానికి మ్యూజిక్, విజువల్, సౌండ్,.. వీటన్నిటినీ కలిపి రియల్ టైమ్‌లో ఫీల్ ఇవ్వాలి. ఇది ఆడియన్స్‌కి సంబంధించినంత వరకు ఏం చేయాలి? ఎక్కడ ఏది చేస్తే బావుంటుంది? అనే విషయంలో ఎడిటర్ ఇన్‌పుట్స్ కూడా ఉంటాయి. కొన్ని సీన్లలో పది పేజీల డైలాగులు ఉన్నాయనుకోండి. అప్పుడు ఎడిటర్ అనే వ్యక్తి 'ఇక్కడ లెంగ్త్ ఎక్కువ అవుతోంది. దీనికి ఇంత అవసరం లేదు. దీనికి ఇంకా ఎడిట్ చేయొచ్చు. ఐదు లైన్లు సరిపోతుంది..' వంటివి మనం ఆలోచించవచ్చు. ఎడిటర్ అనే వాడు ప్రతి సినిమాకి మారుతాడు. అప్పుడు ఎడిటింగ్ స్టైల్ మారుతుంది. కొన్ని సార్లు స్క్రిప్ట్ వీక్‌గా ఉండవచ్చు. కొన్ని సార్లు సీన్ వీక్‌గా ఉండవచ్చు. లేదా కొన్ని సార్లు ఎక్స్‌ట్రార్డినరీగానూ ఉండవచ్చు. ఎక్స్‌ట్రార్డినరీ మేకింగ్ ఉండవచ్చు. ఇలాంటి అన్ని సందర్భాల్లోనూ ఎడిటర్ అనే వాడు పని చేయాల్సి ఉంటుంది. వీక్‌గా ఉన్నప్పుడు కాసింత ఎక్కువ ఇన్‌పుట్స్ ఇవ్వాలి. లేకుంటే కాసింత తక్కువగా పని చేయాల్సి వస్తుంది. ఏదైనా ఇన్‌పుట్స్‌ని బట్టి పనిచేయాలి. ఎడిటర్ అనేవాడు అనేక మార్గాల్లో పనిచేస్తాడు. రైటింగ్ టేబుల్, ఫుటేజ్ షూట్ తర్వాత.. రైటింగ్ పేజ్‌లో ఎలాంటి పరిస్థితుల్లో ఎలా ఉంటుందో...దాన్ని విజువల్‌గా ప్రెజెంట్ చేయాలి. డైరక్టర్‌గానీ, రైటర్‌గానీ ఒక కథ రాసుకున్నప్పుడు.. ఆ కథలో ఎక్కడెక్కడ సినిమాటిక్ ఎక్స్‌ప్రెషన్స్, డ్రమటిక్ మూవ్ మెంట్స్ కావాలో... అవన్నీ విజువలైజ్ చేసుకుని దాని బట్టి ఫుటేజ్‌ని తీసుకురావాలి. ఆ ఫుటేజ్‌ని మరలా పేపర్‌లో ఉన్న విషయంతో మనం పోల్చి చూసుకోవాలి. కొన్నిసార్లు కొన్ని సన్నివేశాలు కానీ, కొన్ని మాటలు కానీ.. ఫైనల్‌గా బావుండకపోవచ్చు. అలాంటివన్నీ బేరీజు వేసుకుంటూ వెళ్లాలి.

అన్నింటిని అలా ఊహించలేం..



ఎడిటింగ్ సమయంలోనే సినిమా హిట్ అవుతుందా? ఫ్లాప్ అవుతుందా? అని పసిగట్టవచ్చా! అని అంటే అన్ని సినిమాలను అలా ఊహించలేమని చెప్పగలను. అయితే కొన్నింటిని చూస్తే పసిగట్టవచ్చు. ప్రతి సినిమాకూ 100 శాతం ఊహించి చేయలేం. కొన్ని సినిమాలు మన మనసుకు నచ్చవచ్చు. అయితే అవే సినిమాలు అవతలి మనిషికి నచ్చుతాయా? లేదా? అనేది చెప్పలేం. హిస్టరీలో చాలా సినిమాలు ఫ్లాప్‌లున్నాయి. మీరన్నట్టు ముందే కనుక తెలుసుకోగలిగితే వాటిని ఫ్లాప్‌లు కాకుండా ఆపగలిగి ఉండేవారు కదా!. కానీ ఎందుకు చేయలేకపోయారు. ఎందుకంటే ప్రేక్షకులను ఎక్కువ శాతం ఎంగేజ్ చేయాలన్నదే టెక్నీషియన్స్ ఆలోచన. మనం అనుకున్న కాన్సెప్ట్ కనుక ఆడియన్స్‌ని ఎంగేజ్ చేయగలిగితే అది చాలా పెద్ద హిట్ అవుతుంది. ఆడియన్స్‌కి నచ్చిన సినిమాలనే మనం తీస్తున్నామా ? లేదా? అనేది కీలకం. అలాగే ఆడియన్స్ అభిరుచులకు తగ్గట్టు సినిమా ఉందా? లేదా? అనేది కూడా చాలా కీలకం. ఇప్పుడు పరిస్థితులు ఎలా ఉన్నాయి? రేపు పరిస్థితులు ఎలా ఉంటాయి? అనేది ఆలోచించుకోవాలి. అన్ని శాఖల వాళ్లూ దాన్ని గుర్తించుకుంటూ ఉండాలి. కాస్ట్యూమ్స్ నుంచి స్టైలింగ్, స్క్రిప్ట్.. అన్నీ డిఫరెంట్‌గా చేయాలి. రచయితలు కూడా గ్రాంథికం నుంచి వ్యావహారికం వరకు వచ్చేశారు. పాటలు కూడా అంతే. టేకింగ్ కూడా అలాగే ఉంటున్నాయి. అందరి అభిరుచినీ అర్థం చేసుకోగలిగితే అది చాలా హిట్ అయినట్టే. కాన్సెప్ట్ అడ్వాన్స్‌గానూ ఉండకూడదు అలాగని మరీ పాతగానూ ఉండకూడదు.

అప్‌డేట్...

చేస్తున్న సినిమాలను బట్టే మనం నేర్చుకుంటూ ఉంటాం. ఉదాహరణకు '24' సినిమా చేశాను. వీఎఫ్ ఎక్స్ ఫ్రాన్స్ నుంచి చేశారు. రెహమాన్‌గారు సంగీతం అందించారు. కెమెరా ఇంకెవరో చేశారు. వాళ్లందరినీ చూసి కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉంటాం. ఇవాళ టెక్నికల్‌గా ఏది నేర్చుకోవాలన్నా టెక్నాలజీ ఉంది. ఇంటర్నెట్ ముందు కూర్చుంటే చాలా నేర్చుకోవచ్చు. అలా ప్రతి రోజూ నేర్చుకుంటూనే ఉంటాం.

కరెంట్ ప్రాజెక్ట్స్ ..

రాజ్ తరుణ్ లవర్, హీరో గోపీచంద్ గారితో ఓ సినిమా జరుగుతోంది. కోన వెంకట్‌గారితో ఓ సినిమా ఉంది. తాప్సీ, ఆది పినిశెట్టి సినిమా ఉంది. ఇంకో మూడు సినిమాలు కూడా మొదలు కాబోతున్నాయి.

– మోహన్ కుమార్ తుమ్మల



ఫార్మాకు ప్రోత్సాహం

ఫార్మాసిటీతో కాలుష్యనియంత్రణ

- అత్యుత్తమ సాంకేతిక పద్ధతుల వినియోగం
- కాలుష్య కారక యూనిట్లు ఔటర్ అవతలికే
- క్లస్టర్ల వారీగా పరిశ్రమల అభివృద్ధి
- కాలుష్య నియంత్రణ ప్రమాణాలు పాటించాలి
- లేకుంటే కఠిన చర్యలకు వెనుకాడేద్చి లేదు
- బీడీఎంఏ ప్రతినిధులతో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మార్చి 3: దేశానికే ఫార్మా రాజధానిగా హైదరాబాద్‌కు ఉన్న పేరు నిలబెట్టుకోడానికి కావల్సిన సహాయ సహకారాలు పరిశ్రమ వర్గాలకు అందిస్తామని మంత్రి కేటీ రామారావు అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో ఆయన బల్క్ డ్రగ్ మ్యాన్యూఫాక్చరర్స్ అసోసియేషన్ (బీడీఎంఏ) ప్రతినిధులతో సమావేశ మయ్యారు. తెలంగాణ ఫార్మాసిటీ ఏర్పాటు ద్వారా ఫార్మసీ రంగ అభివృద్ధితోపాటు కాలుష్య సమస్యను పూర్తిగా అరికట్టడం సాధ్యమవుతుందన్నారు. ఇందుకు అత్యుత్తమ సాంకేతిక పద్ధతులను ఉపయోగిస్తామని తెలిపారు. కాలుష్యకారక పరిశ్రమలను ఔటర్ రింగు రోడ్డు అవతలకు తరలించి.. క్లస్టర్ల వారీగా పరిశ్రమలను అభివృద్ధి చేస్తామని చెప్పారు. తాము అన్ని రకాలుగా చేయూతనిస్తామని, అలాగే ఫార్మా కంపెనీలు కూడా నిర్దేశిత కాలుష్య నియంత్రణ ప్రమణాలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకునేందుకు వెనకాడబోమని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. పటాన్ చెర్వు, బొల్లారం వంటి పారిశ్రామిక కేంద్రాల్లో ఆసుపత్రుల స్థాయి పెంపు లాంటి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పరిశ్రమ వర్గాలు ముందుకొచ్చాయి. దీంతోపాటు అయా ప్రాంతాల్లోని చెరువులు, జలవనరుల అభివృద్ధిలోనూ పాలు పంచుకోవాలన్న మంత్రి విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఫార్మా ప్రతినిధులు తమ విస్తరణ ప్రణాళికలను మంత్రికి తెలిపారు. ముఖ్యంగా పరిశ్రమకు ఎదురవుతున్న సవాళ్లను.. వాటి పరిష్కారానికి ప్రభుత్వం నుంచి తాము ఆశిస్తున్న సహకారాన్ని మంత్రికి వివరించారు. పరిశ్రమల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. జీడిమెట్ల కాలుష్య శుద్ధి ప్లాంటుస్థాయిని పెంచాలని మంత్రిని కోరారు. హైదరాబాద్ ఫార్మాసిటీ ద్వారా ఫార్మా రంగంలో తెలంగాణ స్థానం మరింత సుస్థిరం అవుతుందని ఫార్మా కంపెనీల ప్రతినిధులు మంత్రికి తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజన్, ఇతర ముఖ్య అధికారులున్నారు.

ఊరెళ్లారా.. ఎక్కడికి?

అమ్మానాన్నలను చూసే తీరికేది.. టూర్లు వెళ్లేందుకే సమయం సరి

(మనం సెంట్రల్ డెస్క్)
హోలీకి లాంగ్ వీకెండ్ వచ్చింది. కొంతమందికి అనుకోకుండా రెండు రోజులు హోలీ సెలవు వస్తే.. మరికొందరు ఒక్క శుక్రవారం లీవ్ పెట్టుకుంటే నాలుగు రోజుల పాటు కావల్సినంత ఖాళీ దొరికింది. ఈ నాలుగు రోజులు ఏం చేశారు? ఎక్కడికెళ్లారు?

సౌజన్య హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తుంది. నెలకు దాదాపు 50 వేల జీతం. భర్త కుమార్‌కు కూడా వేరే కంపెనీలో పెద్ద ఉద్యోగమే. ఆయనకు ఇంకో 70 వేల పైచిలుకు చేతికి వస్తుంది. హోలీ లాంగ్ వీకెండ్ వస్తోంది.. ఏం చేద్దామని భర్త అడగడం పాపం.. వెంటనే చాంతాడంత లిస్టు బయటకు తీసింది. ''ఇంకా సమ్మర్ పూర్తిగా మొదలవ్వలేదు కాబట్టి గోవా అయితే బాగుంటుంది. లేదా ఎండలు వచ్చేశాయనుకుంటే హార్స్‌లీ హిల్స్ లాంటి డెస్టినేషన్‌కు వెళ్దాం..'' ఇంక ఆమె మాటల ప్రవాహానికి బ్రేక్ వేయకపోతే ఆ జాబితా పెరిగిపోతుందని కుమార్ ఆపాడు. ''అమ్మానాన్నల దగ్గరకి వెళ్లి దాదాపు మూడేళ్లవుతోంది. ఎటూ మీ పుట్టిల్లు కూడా అక్కడికి దగ్గరే కాబట్టి రెండు రోజులు అక్కడ, రెండు రోజులు ఇక్కడ స్పెండ్ చేస్తే పెద్దవాళ్లు కాస్త సంతోషిస్తారు కదా'' అన్నాడు. ''ఉన్న నాలుగు రోజుల సెలవులని అలా ఎవరైనా వేస్ట్ చేస్తారా, మళ్లీ మనం బయటకి వెళ్లాలంటే అన్నాళ్లు సెలవులు ఎక్కడ దొరుకుతాయి, విడివిడిగా రెండు వీకెండ్లు ప్లాన్ చేయొచ్చులే'' అని నీళ్లు చల్లేసింది సౌజన్య. ఒక్క సౌజన్యే కాదు.. ప్రస్తుతం చాలామంది పరిస్థితి ఇలాగే ఉంటోంది. తల్లిదండ్రులకు కాస్తంత సమయం ఇచ్చేవాళ్లు చాలా తక్కువైపోతున్నారు. వీకెండ్ లేదా లాంగ్ వీకెండ్ వస్తే అయితే ఇంట్లో ప్రశాంతంగా రెస్టు తీసుకోవడం.. లేదా ఎక్కడికైనా డెస్టినేషన్‌కి ప్లాన్ చేయడం సరిపోతోంది. వయసు, సంపాదన ఉండగానే అన్ని చోట్లకూ తిరిగేయాలని, తర్వాత పిల్లలు వస్తే వాళ్ల పరీక్షలని, ఏదో రకం కారణాలతో వెళ్లడం కుదరదు కాబట్టి ఇప్పుడే వెళ్లొచ్చేద్దామని అంటున్నారు తప్ప.. తల్లిదండ్రులతో సరదాగా నాలుగు రోజులు గడపడానికి మాత్రం చాలామందికి సమయమే ఉండట్లేదు. తమ తల్లిదండ్రులు విశాఖపట్నంలో ఉంటారని, తామిద్దరం హైదరాబాద్‌లో ఉద్యోగాలు చేసుకుంటున్నాం కాబట్టి అక్కడకు వెళ్లి రావాలంటే కాస్తంత ఖాళీ కావాలని కుమార్ చెప్పాడు. ఖాళీ దొరికినప్పుడు వెళ్దామనుకుంటే తన భార్య ప్రిఫరెన్సులు వేరేలా ఉంటాయని.. కాదనేది లేక తాను కూడా సరేనన్నాల్సి వస్తోందని, మూడేళ్ల నుంచి ప్రయత్నిస్తుంటే ఒక్క వీకెండ్ కూడా వెళ్లడం కుదరడం లేదని చెప్పాడు. ఉద్యోగాలలో క్షణం తీరిక లేకుండా బిజీ బిజీగా ఉండటం, సెలవులు చాలా తక్కువగా దొరకడంతో చాలామంది కుటుంబంతో గడిపే సమయం తగ్గిపోతోంది. ఏసీ నీల్సన్, బ్రిటానియా సంస్థలు దేశంలోని ఆరు ప్రధాన నగరాలలో చేసిన సర్వేలో ఈ విషయం శాస్త్రీయంగా రుజువైంది. గడిచిన మూడేళ్లలో తమ తల్లిదండ్రుల వద్దకు వెళ్లలేదని.. అయితే ఏదో ఒక ఫంక్షన్‌లో వాళ్లు వచ్చినప్పుడు కలిశామని దాదాపు సగం మంది చెప్పారు. గడిచిన మూడేళ్లలో కనీసం ఒకసారి ముందు అమ్మానాన్నల వద్దకు వెళ్లాలని అన్నీ సిద్ధం చేసుకున్నా చివరి నిమిషంలో రద్దు చేసుకున్నవాళ్లు ఏకంగా 76% ఉన్నారు. ఏడాది మొత్తమ్మీద తల్లిదండ్రులతో 30 రోజులు కూడా గడపని వాళ్లు సగం మందికి పైగానే ఉన్నారు.

డిజిటల్‌గా కలుస్తున్నాం

వ్యక్తిగతంగా తాము తమ తల్లిదండ్రుల వద్దకు వెళ్లలేకపోయినా వాట్సాప్ లేదా ఫేస్‌బుక్ ద్వారా వాళ్లతో ఎప్పుడూ టచ్‌లోనే ఉంటున్నామని, తమ ఫొటోలు షేర్ చేయడం, వీడియోకాల్స్ మాట్లాడటం ద్వారా దూరాన్ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నామని మార్కెటింగ్ ఉద్యోగి కిశోర్ చెప్పాడు. తాను వారానికి ఐదు రోజులు బయట తిరగాల్సి ఉంటుందని, అందుకే కాస్త ఖాళీ దొరికితే విశ్రాంతి తీసుకోడానికే ప్రిఫరెన్స్ ఇస్తానని తెలిపాడు. ప్రతి వారం తప్పనిసరిగా వీడియో కాల్ మాట్లాడి అమ్మానాన్నల క్షేమ సమాచారాలు కనుక్కుంటానన్నాడు. తాను హైదరాబాద్‌లో పనిచేస్తుంటే తన తల్లిదండ్రులు విజయవాడ నుంచి 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న పల్లెలో ఉంటారని, అక్కడకు వెళ్లాలంటే రెండు బస్సులు మారాల్సిందేనని, తిరిగి వచ్చేటపుడు కూడా ముందుగా బయల్దేరి విజయవాడ వస్తేతప్ప హైదరాబాద్ రావడం కుదరదని.. అందుకే తాను ఇలా చేస్తున్నానని అన్నాడు. ఇక బెంగళూరులో మీడియాలో పనిచేసే నిఖితది మరో కథ. ఆమె తల్లిదండ్రులు కడపలో ఉంటారు. ఇంకా పెళ్లి కాలేదు. కనీసం ఏడాదికి ఒకసారి బాగా చేసుకునే క్రిస్మస్‌కు అయినా రమ్మని ఆమె తల్లిదండ్రులు గత నాలుగేళ్లుగా అడుగుతున్నారు. తన ఆఫీసులో స్టాఫ్ తక్కువగా ఉండటంతో వెళ్లడం కుదరట్లేదని, పైగా ఇంటికి వెళ్తే పెళ్లెప్పుడు చేసుకుంటావని బలవంతపెడుతున్నారని నిఖిత చెప్పింది. పైగా.. క్రిస్మస్ సమయంలో ఇంటికి వెళ్లాలంటే టికెట్ల ధరలు చాలా ఎక్కువగా ఉంటాయని తెలిపింది.



తమ దగ్గర ట్రిప్‌లు బుక్‌చేసుకునేవారిలో 10–12% పెద్ద గ్రూపులే ఉంటాయని, అయితే వాళ్లంతా సహోద్యోగులో, స్నేహితులో అవుతారు తప్ప కుటుంబ సభ్యులు దాదాపుగా ఉండరని ఆన్‌లైన్ ట్రావెల్ సంస్థ క్లియర్‌ట్రిప్ ప్రతినిధి ఒకరు తెలిపారు. కజిన్స్ అంతా కలిసి వెళ్లడం దాదాపుగా కనిపించడం లేదని, స్నేహితులతో కలిసి వెళ్లడమే ఇప్పటి ట్రెండని క్లియర్ ట్రిప్ చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ అమిత్ తనేజా చెప్పారు.

కోడళ్ల పాత్ర ఎక్కువే..!

తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లకపోవడానికి అమ్మాయిలు (కోడళ్ల) పాత్ర ఎక్కువగా ఉందనే వాదన కూడా వినిపిస్తోంది. అబ్బాయిల తల్లిదండ్రులకు బదులు జాలీ ట్రిప్పులకే కోడళ్లు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని, ఆ మేరకు భర్తలపై ఒత్తిడి తెస్తున్నారని అంటున్నారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో ఈ వైఖరి మరీ ఎక్కువైపోయిందని పేర్కొంటున్నారు. భార్యల మాట కాదనలేక భర్తలు వారికే ఓటు వేస్తున్నారని అభిప్రాయపడుతున్నారు.

పాక్‌లో జర్నలిస్టు కాల్చివేత

ఇస్లామాబాద్, మార్చి 3: పాకిస్థాన్‌లోని రావల్పిండిలో గుర్తు తెలియని వ్యక్తులు ఓ జర్నలిస్టును కాల్చి చంపారు. అంజుమ్ మునీర్ రాజా(40) గురువారం రాత్రి మోటార్ సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా కొందరు దుండగులు అతనిని ఆపి కాల్పులు జరిపారు. శరీరం నుంచి ఆరు బుల్లెట్లు దూసుకుపోవడంతో అంజుమ్ అక్కడికక్కడే మరణించాడు. దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. అత్యంత కట్టుదిట్టమైన భద్రత కలిగిన ప్రాంతమైన పాకిస్థాన్ మిలటరీకి చెందిన జాతీయ హెడ్‌క్వార్టర్స్‌కు కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగింది. అంజుమ్‌కు ఐదేళ్ల కొడుకు ఉన్నాడు. ఉదయం వేళలో పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న అంజుమ్, ఇస్లామాబాద్‌కు చెందిన ఓ ఉర్దూ పేపర్‌లో సాయంత్రం వేళల్లో ఉప సంపాదకుడిగా పని చేస్తున్నాడు. అంజుమ్ మృతి ఘటనను పాక్ జర్నలిస్టు సంఘాలు ఖండించాయి.

కమలం..కదం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ఎన్ని కల్లో ఫలితాలు ప్రకటించిన మేరకు ఎన్డీపీపీకి 16, బీజేపీకి 11 దక్కాయి. అలాగే అధి కార ఎన్‌పీఎఫ్‌కు 27 స్థానాలు రాగా, నాలుగు చోట్ల ఇతరులు గెలిచారు. అయితే, బీజేపీ మళ్లీ తమతో కలవాలని ఎన్‌పీఎఫ్ పిలుపునిచ్చింది. దీనిపై బీజేపీ కూడా సానుకూల స్పందన వ్యక్తం చేస్తున్నట్లు కనిపిస్తోంది. దీంతో అక్కడ ఎన్‌పీఎఫ్, బీజేపీల సంకీర్ణం అధికారంలోకి వచ్చే అవకాశాలున్నాయి. కాగా, మేఘాలయలో ఏ పార్టీకీ ఆధిక్యం దక్కలేదు. మొత్తం 59 స్థానాలకుగాను అధికార కాంగ్రెస్ 21, ఎన్‌పీపీ 19, బీజేపీ 2 స్థానాల వంతున గెలుచుకోగా ఇతరులు 17చోట్ల గెలుపొందారు. దీంతో ఇతర పార్టీలవారిని ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీలు అప్పుడే ప్రయత్నాలు ప్రారంభించాయి.

మూడు రాష్ట్రాల్లో బీజేపీ పటిష్ఠ వ్యూహం


త్రిపురలో ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్‌కు మచ్చలేని నాయకుడిగా, గట్టిగా ఐదువేల రూపాయల బ్యాంకు బ్యాలెన్సు కూడా లేని నిజాయితీపరుడుగా పేరుంది. మరోవైపు రాష్ట్రంలో తమకు ఆ స్థాయి నాయకుడెవరూ లేకపోయినా బీజేపీ దూసుకుపోయింది. నాగాలాండ్‌లో ఎన్డీపీపీతో పొత్తు పెట్టుకున్నా ఆధిక్యం లభించనప్పటికీ మళ్లీ అధికార ఎన్‌పీఎఫ్‌తో జట్టుకట్టేందుకు సిద్ధమైంది. మరోవైపు మేఘాలయలో గెలవకపోయినా.. కాంగ్రెస్‌కూ అవకాశం లేకుండా హంగ్ అసెంబ్లీ ఏర్పడే పరిస్థితి తీసుకొచ్చింది. నిన్నగాక మొన్న అసోం, అరుణాచల్ ప్రదేశ్‌లలో విజయంతో ఈశాన్య రాష్ట్రాలలో కాషాయ జెండా ఎగరేసిన బీజేపీ.. ఇప్పుడు పాతికేళ్లుగా త్రిపురలో పాతుకుపోయిన సీపీఎంను ఓడించి భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తోంది. ఐదేళ్ల కిందట అసెంబ్లీలో బీజేపీ ఉనికి శూన్యమే అయినా, ఒక్కసారిగా శిఖరస్థాయికి దూసుకుపోయి చరిత్ర సృష్టించింది. మేఘాలయలో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోగా.. వామపక్షాలకు ఇక మిగిలింది కేరళ రాష్ట్రం ఒక్కటే కావడం గమనార్హం. ప్రాంతీయ పార్టీలు మునుపెన్నడూ లేని స్థాయిలో కింగ్‌మేకర్లుగా ఎదుగుతున్నాయి. దేశంలోని 29 రాష్ట్రాలకుగాను ఇప్పుడు 19 బీజేపీ పాలనలోకి వచ్చినట్లయింది. ఈశాన్యం విషయానికొస్తే ఇప్పటికే అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్‌లలో అధికారంలో ఉన్న ఆ పార్టీ.. ఇక త్రిపుర, నాగాలాండ్‌లలోనూ అధికారపక్షంగా అవతరించనుంది. ఈ నేపథ్యంలో... నిన్న మొన్నటివరకు తాము కేవలం 'కాంగ్రెస్ ముక్త భారతం' కావాలనుకునేవాళ్లమని, ఇప్పుడు 'వామపక్ష ముక్త భారతం' కూడా సాధ్యమేనని ప్రస్తుత ఫలితాలు నిరూపిస్తున్నాయని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించారు.


రోడ్లు.. రైళ్లతోనే!

ఈశాన్య రాష్ట్రాలలో చాలాకాలం నుంచీ మౌలిక సదుపాయాలు సరిగా లేవు. సరిగ్గా ఈ అంశాన్ని గుర్తించి అవకాశాన్ని ఒడిసిపట్టిన బీజేపీ.. రోడ్లు, రైలు మార్గాలను అభివృద్ధి చేసింది. తద్వారా తన విజయానికి బాటలు పరచుకుంది. ఇక ఆర్‌ఎస్‌ఎస్ వర్గాలు చాపకింద నీరులా ప్రచారం చేసుకుంటూ జనాల్లోకి పార్టీ చొచ్చుకెళ్లేందుకు కృషిచేశాయి.

మేలుచేసిన పొత్తులు

ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవడం ఈసారి బీజేపీకి ఎక్కువగా మేలు చేసింది. త్రిపురలో ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఐపీటీఎఫ్)తో పొత్తు బీజేపీకి భారీ విజయాన్ని అందించింది. రాష్ట్ర జనాభాలో 31 శాతంగా ఉన్న గిరిజనులకు చేరువ కావడానికి ఇది దోహదపడింది. రాష్ట్రంలో భారీగా ఉన్న నిరుద్యోగాన్ని అరికట్టడంపై వామపక్షాలకుగల అవగాహన లోపాన్ని గమనించి వ్యూహం రచించింది. వెదురు, జౌళి, ఫుడ్ ప్రాసెసింగ్‌లాంటి రంగాలకు ప్రత్యేక ఆర్థిక మండళ్ల ఏర్పాటుతో ఉపాధి కల్పనపై హామీ ఇచ్చి గిరిజన యువతను ఆకట్టుకుంది. కేంద్రం నుంచి నేరుగా నిధులు పొందడానికి వీలుగా స్వయం ప్రతిపత్తి మండలిని ఏర్పాటు చేస్తామని కూడా వాగ్దానం చేసింది.





కెమెరా కనుసన్నల్లో పోస్ట్‌మార్టం

భద్రాద్రికి చేరిన మృతదేహాలు

- **మృతుల గుర్తింపులో గందరగోళం**
- **కెమెరా కనుసన్నల్లో పోస్ట్‌మార్టం**
- **హైకోర్టు సూచనల అమలుతో జాప్యం**
- **పోలీస్ పహారాలో ప్రభుత్వ ఆసుపత్రి**



భద్రాచలం, మార్చి 3(మనం న్యూస్): ఆంధ్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్ మృతదేహాల గుర్తింపులో గందరగోళం నెల కొంది. దట్టమైన అటవీ ప్రాంతంలో శుక్రవారం తెల్ల వారుజామున చోటుచేసుకున్న భారీ ఎన్‌కౌంటర్‌లో 10మంది మావోయిస్టులు, ఒక గ్రేహౌండ్ కమాం డెంట్ సుశీల్‌కుమార్ మృతి చెందిన విషయం తెలి సిందే! ఇందులో ఇద్దరు మావోయిస్టులు, గ్రేహౌండ్ కమాండెంట్ సుశీల్ కుమార్ మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రత్యేక హెలీకాప్టర్‌లో భద్రా చల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి అధికారులు తరలించారు. శుక్రవారం సాయంత్రం సమయానికి రెండు మావోయిస్టు మృతదేహాలు మాత్రమే చేరుకున్నాయి. కమాండెంట్ సుశీల్ కుమార్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి ప్రభుత్వ లాంఛనాలతో తుదివీడ్కోలు ఇచ్చారు. మృతదేహానికి పోలీస్ ఉన్నతాధికారులు నివాళులు అర్పించారు. కాగా ఎన్‌కౌంటర్‌లో రాష్ట్రస్థాయి అగ్రనేతలు ఉన్నారనే వచ్చిన వార్తలను మావోయిస్టు వర్గాలు ఖండించాయి. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని మావవ హక్కుల సంఘాలు శుక్రవారం సుప్రీంకోర్టులో అప్పీలు చేయగా గతంలో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారమే మావోయిస్టుల మృత దేహాలను భద్రాచలం ఏరియా ఆసుపత్రిలోనే పోస్ట్‌మార్టం నిర్వహించాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశించింది. అదేవిధంగా పోస్ట్‌మార్టంను వీడియోలో చిత్రీకరించాలని సూచించింది. ఎన్‌కౌంటర్‌పై విచారణ జరిపి మృతదేహాలకు న్యాయ నిపుణుల సమక్షంలో పోస్ట్‌మార్టం నిర్వహించాలని ఆదేశించింది. మిగతా ఎనిమిది మృతదేహాలను శనివారం ఉదయం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. శనివారం ఫోరెన్సిక్ అధికారుల సమక్షంలో పోస్ట్‌మార్టం నిర్వహించేందుకు ఎక్కువ సమయం కేటాయించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారమే పోస్ట్‌మార్టం నిర్వహించాలని న్యాయ నిపుణుల సమక్షంలో పోస్ట్‌మార్టం చేసేందుకు సమయం వెచ్చించాల్సి వచ్చిందని పోలీస్ వర్గాలు తెలిపారు. కాగా మృతదేహాల కోసం వచ్చిన వారివారి కుటంబీకులు ఏరియా ఆసుపత్రి ప్రాంగణంలో పడిగాపులు కాసారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందింది ఎవరన్న విషయం కచ్చితంగా తెలియక మృతదేహాల గుర్తింపులో గందరగోళ పరిస్థితి నెలకొంది. కాగా, శనివారం సాయంత్రం పోలీసులు మృతుల వివరాలను వెల్లడించారు.. 1) దాడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్, 2) ఇత్రు (తిప్పాపురం) , 3)బుద్రి (ఛత్తీస్‌గఢ్), 4) రామే (సుకుమా), 5) మల్లేష్ (ఛత్తీస్‌గఢ్ సెక్షన్ కమాండర్), 6) కమల (వెస్ట్ బస్తర్), 7) కోసి (రంగయ్‌గూడెం), 8) సుఖి (గంగులోర్), 9) రత్న (బీజాపూర్), 10) సోంబిలుగా గుర్తించారు. పోస్ట్‌మార్టం పూర్తయ్యాక మృతదేహాలను వారివారి బందువులకు అప్పగించనున్నారు.


పోలీస్ పహారాలో ఆస్పత్రి..

రెండురోజుల నుంచి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ప్రాంగణం గట్టి బందోబస్తు నడుమ ఉంది. సుమారు వందమంది పోలీస్ బలగాలతో ఏరియా ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పోలీసులు డేగ కన్ను వేసి ఉంచారు. ఎటువంటి ఆవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మావోయిస్టు మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించి వారి బంధువులకు అప్పగించనున్నారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో యుద్ద వాతావరణం నెలకొంది. భద్రాచలం ఏజెన్సీలోని చర్ల, వెంకటాపురం సరిహద్దులో గల కోడిపుంజుల గుట్ట వద్ద శనివారం ఉదయం పోలీసులకు, మావోయిస్టులకు మళ్ళీ కాల్పులు జరిగాయి. నిన్న ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతానికి కొద్ది దూరంలోనే పెద్ద పెద్ద గుట్టలు ఉన్నాయి. నిన్న జరిగిన ఎన్‌కౌంటర్‌లో కొంతమంది అగ్ర నేతలు తప్పించుకొని ఆ గుట్టల్లోనే ఉన్నారనే అనుమానంతో పోలీస్ బలగాలు గుట్టలను చుట్టుముట్టాయి. పోలీసులకు, మావోయిస్టులకు మధ్య బారీ స్థాయిలోనే కాల్పులు జరిగినట్లు సమాచారం కాగా ప్రస్తుతం మావోయిస్టులు తలదాచుకున్నట్లు భావిస్తున్న గుట్టల ప్రాంతానికి అటు ఛత్తీస్‌గఢ్ పోలీసులు, ఇటు తెలంగాణ పోలీసులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఏజెన్సీలో యుద్ధవాతావరణం నెలకొని ఉంది. కాగా, రెండు రోజులుగా తుపాకీల మోతలతో మన్యం ప్రజల గుండెల్లో గుబులు మొదలైంది. ఏ నిమిషం ఏంజరుగుతుందో తెలియని భయాందోళన మధ్య జీవిస్తున్నారు.

ఉద్యమద్రోహి వల్లే ఎన్‌కౌంటర్

- **అగ్ర నాయకులు చనిపోలేదు**
- **మావోయిస్టు పార్టీ రాష్ట్ర ప్రతినిధి జగన్**

హైదరాబాద్, మార్చి 3: ప్రజలతో మాట్లాడుతూ సేదదీరుతున్న సమయంలో ఒక ఉద్యమ ద్రోహి ఇచ్చిన సమాచారంతోనే ఎన్‌కౌంటర్ జరిగిందని మావోయిస్టు పార్టీ తెలంగాణ అధికార ప్రతినిధి జగన్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముందురోజు రాత్రే పోలీసులు చుట్టుముట్టి ఏకపక్షంగా కాల్పులు జరిపారని ఆయన ఆరోపించారు. పోలీసులు ప్రచారం చేస్తున్నట్లు ఈ ఎన్‌కౌంటర్‌లో హరిభూషణ్, బడే చొక్కారావు, కంకణాల రాజిరెడ్డి చనిపోలేదని జగన్ స్పష్టం చేశారు. ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన 10 మందిలో జిల్లా కమిటీ సభ్యుడు హన్మకొండ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన దడబోయిన స్వామి అలియాస్ ప్రభాకర్, రత్న ఉన్నారని చెప్పారు. మిగతా కామ్రేడ్స్ అంతా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా, దంతెవాడ జిల్లాలకు చెందిన వారని వివరించారు. కార్పొరేట్ శక్తులకు నీళ్లు, భూమిని దారాదత్తం చేసేందుకే నియంత కేసీఆర్ ఈ విధమైన బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇకపై మేము టీఆర్‌ఎస్ నేతలపై దాడులను ముమ్మరం చేయనున్నట్లు హెచ్చరించారు. హిందుత్వ నాయకుడు రమణ్‌సింగ్, నియంత కేసీఆర్‌లు కలిసికట్టుగా ఆదివాసీలపై, ప్రశ్నించే వారిని నిర్మూలించేందుకు దుర్మార్గమైన దాడులకు పాల్పడుతున్నారని జగన్ మండిపడ్డారు. ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత చనిపోయింది ఎవరనేది తెలిసినప్పటికీ



పోలీసులు ప్రజల్లో అయోమయం సృష్టించడంకోసం అబద్దాలు ప్రచారం చేశారని పేర్కొన్నారు. ముఖ్యనాయకులు చనిపోయారని ప్రచారంచేసి ప్రజల మనో ధైర్యాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేశారన్నారు. కార్పొరేట్లకు వనరులు దోచిపెట్టడం కోసం తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలతో పాటు కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ నిర్మూలనే లక్ష్యంగా దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయితే, ప్రజల సహకారంతో ఈ దాడులన్నింటినీ తిప్పికొడతామని జగన్ ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

సున్నా నుంచి శిఖరానికి చేరాం

- ఎన్డీఏ అభివృద్ధి అజెండాకు పట్టం
- త్రిపురలో సైద్ధాంతిక విజయం: మోదీ



న్యూఢిల్లీ, మార్చి 3: ఎన్డీఏ అభివృద్ధి అజెండాకు ప్రజలు మరోసారి పట్టం కట్టారని, అందువల్లే త్రిపురలో సున్నా నుంచి శిఖరానికి చేరామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. తిరోగమన రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టారని అభిప్రాయపడ్డారు. త్రిపురలో బీజేపీ విజయం అసాధారణమైనదని ఆయన అన్నారు. మూడు ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఆయన ట్విటర్ ద్వారా స్పందించారు. త్రిపురలో బీజేపీ చారిత్రక సాధించిన గెలుపును తమ పార్టీ 'సైద్ధాంతిక విజయం'గా ఆయన అభివర్ణించారు. ఇది అణచివేత, భయోత్పాత విధానాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమని మోదీ పేర్కొన్నారు. భయాన్ని శాంతి, అహింస జయించాయని అన్నారు. అలాగే నాగాలాండ్‌లోనూ బీజేపీ కూటమికి పట్టం కట్టడంపై ప్రజలకు ఆయన కృతజ్ఞతలు చెప్పారు. 2013లో త్రిపురలో ఒక్క సీటు కూడా లేని బీజేపీని అధికారంలోకి తెచ్చిన పార్టీ కార్యకర్తల కృషిని ఆయన అభినందించారు. నాగాలాండ్ అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో విజయం కోసం తీవ్రంగా కృషి చేసిన బీజేపీ నేతలను అభినందించారు. అలాగే మేఘాలయ అభివృద్ధి, సంక్షేమం తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని మోదీ చెప్పారు.

మోదీ నాయకత్వానికి ఆమోదం: అమిత్ షా

త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాల్లో బీజేపీ విజయం ప్రధాని మోదీ నాయకత్వానికి లభించిన ఆమోదమని ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా అభిప్రాయపడ్డారు. మొరార్జీ దేశాయ్ తర్వాత ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధిపై దృష్టిపెట్టిన ప్రధాని మోదీ ఒక్కరేనని చెప్పారు. న్యూఢిల్లీలో శనివారం ఆయన మీడియాతో మాటాడారు. భారత్‌కు వామపక్ష సిద్ధాంతాలు(లెఫ్ట్) సరికాదని షా అన్నారు. త్రిపురలో 2 దశాబ్దాలుగా అధికారంలో ఉన్న సీపీఎంను ఓడించడం ద్వారా ప్రజలు ఈ విషయాన్ని మరోసారి స్పష్టం చేశారని, ఇప్పటికే పశ్చిమ బెంగాల్‌లో ఆ పార్టీ తుడుచుకుపెట్టుకుపోయిందని పేర్కొన్నారు. ఈశాన్య భారతంలో అధికారంలోకి రావడం బీజేపీకీ చెప్పుకోదగిన విజయమని అమిత్ షా అన్నారు. అయితే ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళల్లోనూ విజయం సాధిస్తేనే బీజేపీ స్వర్ణయుగం మొదలైనట్లని ఆయన అభిప్రాయపడ్డారు. త్వరలో కర్ణాటకలో జరగబోయే శాసనసభ ఎన్నికల్లోనూ గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. వామపక్షాల దాడులను ధైర్యంగా ఎదుర్కొని ప్రాణాలు కోల్పోయిన ఆరెస్సెస్, బీజేపీ కార్యకర్తలకు త్రిపుర గెలుపును అంకితమిస్తున్నామని చెప్పారు.

ఇది మోదీ 'సర్కార్!'

త్రిపురలో మసకబారిన మాణిక్ ప్రాభవం.. వామపక్ష కూటమి పాతికేళ్ల పాలనకు తెర

ఉనికేలేని స్థాయినుంచి పాలనలోకి బీజేపీ.. కూలిన ఎర్రకోట.. కమలం విజయబావుటా

అగర్తల, మార్చి 3: త్రిపురలో కమలం కళకళలాడింది. ఈశాన్యాన అత్యంత ప్రధానమైన అసోంలో ఇప్పటికే పాగావేసిన బీజేపీ.. మరో కీలక రాష్ట్రం త్రిపురలో ఒక్క స్థానమూ లేని దశనుంచి ఏకంగా అధికార పీఠాన్ని కైవసం చేసుకుంది. పాతికేళ్ల సీపీఎం పాలనలో 20 ఏళ్లుగా ప్రభుత్వాన్ని నడుపుతున్న 'నిరుపేద' ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ నేతృత్వంలోని 'ఎర్ర'కోట కుప్పకూలింది. ఈ పరిణామాన్ని 'మోదీ సర్కార్' ఏర్పడటంగా బీజేపీ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. మాణిక్ సర్కార్ స్థాయిగల బీజేపీ నాయకులు రాష్ట్రంలో లేకపోవడమే ఇందుకు కారణం. మొత్తంమీద శనివారం మూడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో త్రిపురలో ఎర్రజెండా పతనమై కాషాయ పతాకం నింగికెగసింది. రాష్ట్ర జనాభాలో 31 శాతంగా ఉన్న గిరిజనుల ప్రతినిధిగా ఏర్పడిన 'ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర'(ఐపీఎఫ్‌టీ)తో జట్టుకట్టిన బీజేపీ విజయబావుటా ఎగరేసింది. గత ఎన్నికలలో ఒక్క సీటూ లేని, డిపాజిట్లు కూడా దక్కించుకోలేని ఆ పార్టీని ప్రజలు అధికారంలోకి తెచ్చి, వామపక్ష కూటమి సుదీర్ఘ పాలనకు తెరదించారు. ఇక ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు ప్రాతినిధ్యమే లేకుండా పోవడం గమనార్హం. పశ్చిమబెంగాల్‌లో మూడు దశాబ్దాలకు మించి సాగిన వామపక్ష పాలనకు 2011లో మమతా బెనర్జీ చరమగీతం పాడటాన్ని ఈ ఫలితాలతో కొందరు పోలుస్తున్నారు. అప్పట్లో ఆమె 'పరివర్తన్' (మార్పు) పేరిట బరిలో దిగితే- త్రిపురలో బీజేపీ 'చలో పల్టాయి' (మనం మారుదాం) అనే నినాదమిచ్చింది. అలాగే 'మాణిక్యం' బదులు 'హీరా' (హైవే, ఇంటర్నెట్, రోడ్ వే, ఎయిర్ వే)కు ఓటు వేయండంటూ ప్రధాని మోదీ కూడా పిలుపునివ్వడం ఈ సందర్భంగా గమనార్హం. మరోవైపు 60 స్థానాలున్న ఈ చిన్న రాష్ట్రంలో ప్రచారం కోసం బీజేపీ ఎంతో ముందుగానే 42వేల మంది కార్యకర్తలను రంగంలో దించింది. ప్రతి ఒక్కరూ 60 మంది ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యూహరచన చేసింది. తదనుగుణంగా ఆరు నెలల వ్యవధిలో వీరంతా 15 రోజులకొకసారి ఓటర్లతో మమేమకమవుతూ వారిని దాదాపు ఆకట్టుకోగలిగారు. రాష్ట్రంలో భారీస్థాయిలోగల నిరుద్యోగ సమస్యను ఎదుర్కొనడంలో వామపక్ష వైఫల్యాన్ని బీజేపీ సొమ్ము చేసుకుంది. యువతకు... ప్రత్యేకించి గిరిజనులకు ఉపాధి కల్పన, వెదురు, జౌళి, ఆహార పదార్థాల తయారీవంటి వాటికోసం ప్రత్యేక ఆర్థిక మండలి, కేంద్రం నుంచి నేరుగా నిధులందే విధంగా రాష్ట్ర స్వతంత్ర ప్రతిపత్తి మండలి తదితరాలపై ప్రధాని మోదీ స్వయంగా హామీలిచ్చారు. ఏదేమైనా సుదీర్ఘ పాలన ఫలితంగా సహజంగా ఏర్పడే ప్రభుత్వ వ్యతిరేకత, గిరిజన తెగలలో అసంతృప్తి, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పతనదశ కొనసాగుతుండటం తదితర కారణాలు బీజేపీ విజయానికి తోడయ్యాయి.





మాణిక్ పోయి.. విప్లవ్ వచ్చె!

ఈశాన్య రాష్ట్రమైన త్రిపురకు కొత్త ముఖ్యమంత్రి వస్తున్నారు. ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా ఉండి.. అగర్తలాలోని వనమలిపూర్ నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థిపై విజయం సాధించిన విప్లవ్‌కుమార్ దేవ్ (48) త్రిపుర కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. దాదాపు పాతికేళ్ల పాటు రాష్ట్రంలో కొనసాగిన కమ్యూనిస్టు పాలన ఎట్టకేలకు ముగిసింది. బీజేపీ తొలిసారిగా ఇక్కడ భారీ మెజారిటీతో అధికార పగ్గాలను చేపడుతోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా అగ్రనేతలంతా మోహరించి.. ఎలాగైనా ఈసారి త్రిపురను కైవసం చేసుకోవాలని చేసిన ప్రయత్నాలు ఫలించాయి. రెండు దశాబ్దాల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగిన మాణిక్ సర్కార్.. ఇపుడు మాజీ సీఎం అవుతున్నారు. విప్లవ్‌కుమార్ దేవ్ ముఖ్యమంత్రి రేసులో ముందున్నారని, మాణిక్ సర్కార్ కంటే ఆయనకు ప్రజల్లో ఎక్కువ ప్రాచుర్యం ఉన్నట్లు ఎన్నికలకు ముందు నిర్వహించిన సర్వేలో తేలిందని బీజేపీ ప్రధాన కార్యదర్శి ఒకరు చెప్పారు. ముందునుంచి బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లలో పనిచేసిన విప్లవ్.. త్రిపురలో సీపీఎం పాలన అంతానికి పంతం పట్టారని మరో బీజేపీ నేత చెప్పారు. ఆయన సంఘ్ మనిషని, ఆర్ఎస్ఎస్‌లోనే శిక్షణ పొందారని, బీజేపీలో అత్యంత వివాదరహితుడిగా పేరు పొందారని అన్నారు. గతంలో ఆర్ఎస్ఎస్ వలంటీరుగా పనిచేసిన విప్లవ్.. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం ఢిల్లీకి వచ్చి, అక్కడ జిమ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేశారు. ఆర్ఎస్ఎస్‌లో దేవ్‌కు శిక్షణ ఇచ్చినది సునీల్ దేవ్‌ధర్ కాగా.. సంఘ్‌లో ఆయనకు అండగా కేఎన్ గోవిందాచ్యా ఉండేవారు. 2016లో త్రిపుర పార్టీ అధ్యక్షుడిగా వెళ్లడానికి ముందు మధ్యప్రదేశ్‌లోని సత్నా ఎంపీ గణేశ్ సింగ్ వద్ద అసిస్టెంటుగా పనిచేశబూరు. విప్లవ్ భార్య స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పార్లమెంటు హౌస్ బ్రాంచిలో డిప్యూటీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వాళ్లకు ఇద్దరు పిల్లలునానరు. విప్లవ్‌దేవ్ యువకుడు కావడంతో పాటు.. స్థానికుడు కావడంతో సీపీఎం పాలనకు చరమగీతం పాడాలంటే అతడివల్లే సాధ్యమవుతుందని త్రిపురకు పంపారు. దానికితోడు పార్టీ వ్యూహకర్త, జాతీయ ప్రధాన కార్యదర్శి రాం మాధవ్, ఈశాన్య ప్రాంతంలో బీజేపీకి గట్టి నాయకుడిగా ఉన్న హిమాంత బిశ్వ శర్మల ఆశీస్సులు కూడా ఉన్నాయి. ఎన్నికలకు ముందుగానే విప్లవ్‌ను సీఎం అభ్యర్థిగా ప్రకటించాలని కొంతమంది అన్నారు గానీ.. అమిత్ షా మాత్రం దాన్ని తిప్పికొట్టారు.

'సర్కార్'ను నిలబెట్టని నిజాయితీ



త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ ఎంతో నిరాడంబరుడు... నిజాయితీపరుడు... దేశంలో నిరుపేద సీఎం. కానీ, ఇవేవీ ఆయన సర్కారును నిలబెట్టలేకపోయాయి. కోటీశ్వరులైన ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పోలిస్తే తొలిసారిగా 1998లో పదవిని అధిష్ఠించిన ఆయన ఆస్తులు కేవలం రూ.26 లక్షలు... బ్యాంకులో నగదు రూ.2,140, చేతిలో ఉన్నది రూ.1,520... నామినేషన్‌తోపాటు సమర్పించిన అఫిడవిట్‌లో మాణిక్ సర్కార్ పేర్కొన్న వివరాలివి. ప్రజా ప్రతినిధిగా, సీఎంగా తనకు అందే జీతభత్యాలను ఎప్పటికప్పుడు తమ పార్టీకి ఆయన విరాళంగా ఇచ్చేస్తారు. పార్టీ ఇచ్చే నెలవారీ గౌరవ వేతనంతోనే సరిపెట్టుకుంటారు. కాబట్టే ఒక్కసారి కూడా ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేసే అవసరం రాలేదు. మాణిక్ రాజకీయ ప్రస్థానంలోనూ ఎన్నో మెరుపులున్నాయి... ఆయన తండ్రి దర్జీ కాగా, తల్లి ప్రభుత్వోద్యోగి. ఆమెనుంచి సంక్రమించిన 432 చదరపు అడుగుల రేకుల షెడ్డే వారసత్వపు ఆస్తి. వామపక్ష విద్యార్థి రాజకీయాల్లో అడుగుపెట్టినప్పుడు మాణిక్ వయసు 18 ఏళ్లే. తర్వాత కొన్నాళ్లకే భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి అయ్యారు. మరో ఐదేళ్లకే సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యత్వం లభించింది. త్రిపురలో కమ్యూనిస్టులు తొలిసారి అధికారంలోకి వచ్చేనాటికి మాణిక్ వయసు 29 కాగా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడుగా ఉన్నారు. అటుపైన 1980లో తొలిసారి శాసనసభకు ఎన్నికయ్యారు. అప్పటినుంచీ ఓటమి మాటే ఎరుగని ఆయన, 49 ఏళ్ల వయసులో సీఎం అయ్యారు. ప్రస్తుత ఎన్నికలలోనూ ధన్‌పూర్ స్థానం నుంచి తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి ప్రతిమా భౌమిక్‌పై 3,278 ఓట్ల ఆధిక్యంతో నెగ్గారు. ఆయనకు 14,027 ఓట్లు రాగా, ప్రత్యర్థికి 10,749 ఓట్లు వచ్చాయి. ఒకనాటి కల్లోల రాష్ట్రమైన త్రిపురలో సీఎం భార్య పాంచాలి భట్టాచార్య కూడా ఏనాడూ వ్యక్తిగత భద్రత సిబ్బందిని నియమించుకోలేదు. మార్కెట్‌లో కూరగాయలు కొనుక్కుని రిక్షాలో అధికార నివాసానికి వచ్చేవారు.



బెంగాల్.. కేరళ.. బంగ్లాదేశ్

- మాణిక్‌కు మిగిలిన దారులివే
- బీజేపీ నేత హిమంత విశ్వ శర్మ

అగర్తల, మార్చి 3: రెండు దశాబ్దాలుగా త్రిపురను పాలించి తాజాగా అధికారం కోల్పోయిన సీపీఎం నేత మాణిక్ సర్కార్ ఆశ్రయం పొందేందుకు మిగిలింది మూడే దారులని బీజేపీ నేత, అసోం మంత్రి హిమంత విశ్వ శర్మ వ్యాఖ్యానించారు. సీపీఎంకు పట్టు ఎంతో కొంత మిగిలి ఉన్న పశ్చిమ బెంగాల్ లేదా ఆ పార్టీ ప్రభుత్వం కొనసాగుతున్న కేరళకు వెళ్లి ఆశ్రయం పొందవచ్చని అన్నారు. ఈ రెండూ కాదంటే పక్కనే బంగ్లాదేశ్‌కు పోవచ్చన్నారు. శనివారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రచార సమయంలో మాణిక్ సర్కార్ నియోజకవర్గమైన ధన్‌పూర్‌లో హిమంత శర్మ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక మాణిక్ సర్కార్‌ను బంగ్లాదేశ్ పంపేస్తామని అన్నారు. దీనిపై మీడియా ప్రశ్నించగా.. మాణిక్ సర్కార్‌కు ఇప్పుడు మిగిలింది పై మూడు దారులేనంటూ వ్యాఖ్యానించారు.

త్రిపుర గెలుపు మోదీ ఘనతే

బీజేపీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్



అగర్తల, మార్చి 3: త్రిపురలో బీజేపీ గెలుపు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఘనతేనని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ చెప్పారు. అగర్తలలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారాన్ని అడుగడుగునా ప్రధాని పర్యవేక్షించారని, ఆయన ఇక్కడ నాలుగు సభల్లో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపు కోసం ఆయన తీవ్రంగా శ్రమించారని తెలిపారు. రెండు దశాబ్దాలకు పైగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న సీపీఎంను ఓడించాలని, 'మార్పునకు శ్రీకారం' చుడుదామని బీజేపీ ఇచ్చిన పిలుపునకు ప్రజలు సానుకూలంగా స్పందించారని రామ్ మాధవ్ అన్నారు. ఎన్నికల సమయంలో సీపీఎం స్ఫూర్తిదాయక పోరాటాన్ని సాగించిందని ఆయన ప్రశంసించారు. అయితే త్రిపుర ప్రజలు గట్టిగా మార్పును కోరుకున్నారని చెప్పారు.



డబ్బుతో బీజేపీ అనైతిక రాజకీయం

సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



న్యూఢిల్లీ, మార్చి 3: త్రిపురలో బీజేపీ అనైతిక రాజకీయంతో విజయం సాధించిందని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ధన, అంగ బలంతోనే వామపక్ష వ్యతిరేక శక్తులు, పార్టీలను ఒక వేదికపైకి చేర్చిందని, ఈ క్రమంలోనే అది విజయం సాధించిందని పేర్కొన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. డబ్బును భారీ స్థాయిలో పంచి బీజేపీ అనైతిక రాజకీయాలను ప్రదర్శించిందని ఆరోపించారు. సీపీఎం, కాంగ్రెస్ వ్యతిరేక ఓట్లను తనవైపు తిప్పుకోవటంలో బీజేపీ విజయం సాధించిందన్నారు. అయినప్పటికీ వామపక్ష పార్టీ 45 శాతం ఓటు బ్యాంకును సాధించిందని సీతారాం ఏచూరి చెప్పారు. అందుకు త్రిపుర ప్రజలకు ధన్యవాదాలు చెబుతున్నామని, వారి తీర్పును గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. అయితే బీజేపీ మోసపూరిత రాజకీయాలను ప్రశ్నించటం మాత్రం తాము ఆపబోమని వెల్లడించారు. దేశవ్యాప్తంగా బీజేపీ-ఆరెస్సెస్ వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని ఆయన చెప్పారు.

వామపక్ష ముక్త భారత్ కూడా

కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్



న్యూఢిల్లీ, మార్చి 3: ఈశాన్య భారతంలో దాదాపుగా అన్ని రాష్ట్రాల్లోనూ ప్రస్తుతం బీజేపీనే అధికారం సొంతం చేసుకుందని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ అన్నారు. న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కాంగ్రెస్ ముక్త భారత్ దిశగా వేగంగా అడుగులు పడ్డాయన్నారు. ఇప్పుడు వామపక్ష ముక్త భారత్ నినాదం కూడా అందుకుంటున్నామని ఆయన చెప్పారు. కాగా, త్రిపుర, నాగాలాండ్‌లలో బీజేపీ విజయంపై గోవా సీఎం మనోహర్ పరికర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా, పార్టీ కార్యకర్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

మేఘాలయ సీఎం 'డబుల్' గెలుపు




షిల్లాంగ్, మార్చి 3: మేఘాలయ సీఎం ముకుల్ సంగ్మా (కాంగ్రెస్) పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు. 2010 నుంచి ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన ఈ ఎన్నికల్లో అంపతి, సంగ్‌సక్ నియోజకవర్గాల నుంచి పోటీ చేశారు. అంపతిలో సమీప ప్రత్యర్థి సీహెచ్ హజోంగ్ (బీజేపీ)పై 6 వేల ఓట్ల తేడాతో విజయం సాధించారు. సంగ్‌సక్‌లో సమీప ప్రత్యర్థి, ఎన్‌పీపీ నేత నిహిమ్ షిరాపై 1300 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కాగా, ముకుల్ సంగ్మా భార్య దిక్కంచి షిరా మహేంద్ర గంజ్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి తన సమీప ప్రత్యర్థి ప్రేమానంద కోచ్ (బీజేపీ)పై 6 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.

నాగాలో సంకీర్ణమే?

మళ్లీ పాత గూటికే బీజేపీ!

ఎన్‌పీఎఫ్ 27; ఎన్డీపీపీ.. బీజేపీ 27.. మరో 4 స్థానాల్లో ఇతరులు

బీజేపీకి ఎన్‌పీఎఫ్ ఆఫర్.. వారే చొరవ చూపాలి: హిమంత



కోహిమా, మార్చి 3: నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పీఎఫ్) కంచుకోట నాగాలాండ్‌లో ఏ పార్టీకీ పూర్తి ఆధిక్యం దక్కలేదు. శనివారం వెల్లడైన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మొత్తం 60 స్థానాలకుగాను ఒకటి ఏకగ్రీవం కాగా 59 సీట్లకు ఎన్నికలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అధికార ఎన్‌పీఎఫ్ 27 స్థానాలు సాధించి అతిపెద్ద పక్షంగా నిలిచింది. మరోవైపు ఎన్‌పీఎఫ్‌తో స్నేహానికి గుడ్‌బై చెప్పిన బీజేపీ మాజీ ముఖ్యమంత్రి నైఫియు రియో నేతృత్వంలోని ఎన్డీపీపీతో పొత్తు పెట్టుకున్నా ఈ సంకీర్ణం 27 స్థానాలు మాత్రమే సాధించింది. ఆ మేరకు ఎన్డీపీపీ 16, బీజేపీ 11 స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. మరో నాలుగు స్థానాల్లో ఇతరులు విజయం సాధించారు. అయితే, మళ్లీ తమతో కలవాల్సిందిగా ఎన్‌పీఎఫ్ అధినేత, ముఖ్యమంత్రి టి.ఆర్.జెలియాంగ్ బీజేపీకి ఆహ్వానం పలికారు. మరోవైపు నాగాలాండ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. అలాగే ఎన్‌పీఎఫ్ చొరవ చూపితే బీజేపీ సహకరిస్తుందని బీజేపీ వ్యూహకర్త హిమంత విశ్వశర్మ కూడా ప్రకటించారు. దీంతో ఈ రెండు పార్టీల సంకీర్ణం మరోసారి పాలన పగ్గాలు చేపట్టే అవకాశాలున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత ఎన్నికలలో ఒకేఒక్క స్థానంలో గెలిచిన ఎన్డీపీపీ ఈసారి అదనంగా 26 నియోజకవర్గాల్లో విజయం సాధించడం విశేషం. ప్రస్తుత సభలో 38 స్థానాలున్న ఎన్‌పీఎఫ్ 11 సీట్లు కోల్పోగా, కాంగ్రెస్ పార్టీ చావుదెబ్బ తింది. ఉన్న 8 స్థానాలనూ పోగొట్టుకోవడమేగాక ఈసారి ఒక్కచోట కూడా గెలవలేదు. మునుపటి ఎన్నికలలో రెండు స్థానాలున్న బీజేపీ ఈ దఫా 11 స్థానాలు సాధించింది. ప్రస్తుత సభలో చిన్నాచితక పార్టీలకు స్థానం లేకపోగా ఈసారి నాలుగు సీట్లు దక్కాయి.



మేఘాలయలో హంగ్

కాంగ్రెస్-ఎన్‌పీపీ నువ్వానేనా.. అతిపెద్దపార్టీగా హస్తం.. 21 స్థానాల్లో విజయం

- 19 స్థానాల వద్ద నిలిచిన ఎన్‌పీపీ
- పావులు కదుపుతున్న ఇరు పక్షాలు
- బీజేపీ చక్రం తిప్పితే అధికారం ఎన్‌పీపీదే!





షిల్లాంగ్, మార్చి 3: ఊహించిందే జరిగింది. మేఘాలయలో హంగ్ అసెంబ్లీ ఏర్పడింది. పదేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మెజారిటీ మార్కును దాటలేకపోయింది. మొత్తం 60 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 59 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో కాంగ్రెస్‌కు 21 స్థానాలు, నేషనల్ పీపుల్స్ పార్టీ (ఎన్‌పీపీ)కి 19 స్థానాలు, యూడీపీకి 6 స్థానాలు, పీడీఎఫ్‌కు 4 స్థానాలు, బీజేపీకి 2 స్థానాలు, స్వతంత్రులకు 3, ఇతరులకు 2 స్థానాలు దక్కాయి. ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 31 స్థానాలు సాధించడంలో అన్ని పార్టీలు చాలా కొద్ది దూరంలో నిలిచిపోయాయి. దాంతో అధికారం చేపట్టేందుకు అటు కాంగ్రెస్.. మరో వైపు ఎన్‌పీపీ ఇతర పార్టీలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, ఇతరులు, స్వతంత్రులతో కలుపుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ యత్నాలు ప్రారంభించగా.. ఎన్‌పీపీ కూడా అదే విధంగా స్పందించింది. యూడీపీ, పీడీఎఫ్ తదితర పార్టీల సాయంతో అధికారం చేపడుతామని ఎన్‌పీపీ అధ్యక్షుడు కన్రాడ్ సంగ్మా ప్రకటించారు. ఎన్‌పీపీకి మద్దతుగా బీజేపీ కూడా రంగంలోకి దిగినట్లు తెలిసింది. ఎన్‌పీపీ, యూడీపీ నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్‌మాధవ్ పేర్కొన్నారు. మరోవైపు, కాంగ్రెస్ కూడా తమ పార్టీ సీనియర్ నేతలు కమల్‌నాథ్, అహ్మద్‌పటేల్‌ను శనివారం ఉదయమే పంపించింది. మేఘాలయలో 2003 నుంచి కాంగ్రెస్ అధికారంలో ఉంది. ఇతరుల సాయంతో మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ప్రస్తుత ముఖ్యమంత్రి ముకుల్ సంగ్మా తిరిగి సీఎం ప్రదవి చేపట్టే అవకాశాలు ఉన్నాయి. అయితే.. బీజేపీ అంతర్గతంగా చక్రం తిప్పితే ఎన్‌పీపీ అధికారం చేపట్టవచ్చునని రాజకీయ పండితులు పేర్కొంటున్నారు. ''ఎన్నికల ఫలితాలు మేం అనుకున్న రీతిలో రాలేదు. అయినా..ప్రభుత్వ ఏర్పాటుకు శాయశక్తులా కృషి చేస్తాం. కాంగ్రెస్‌కు మద్దతిచ్చే పార్టీలతో సంప్రదింపులు జరుపుతాం'' అని ముకుల్ సంగ్మా పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను ఎలాగైన అధికారానికి దూరంగా ఉంచాలని బీజేపీ ఒక వేళ భావిస్తే.. మణిపూర్, గోవా ఫలితాలు ఇక్కడ కూడా పునరావృతం కావొచ్చునని విశ్లేషకులు అంటున్నారు. మేఘాలయ అసెంబ్లీకి 2013లో జరిగిన ఎన్నికల్లో 28 స్థానాల్లో గెలిచిన కాంగ్రెస్.. ఇతరుల మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇదే ఎన్నికల్లో కేవలం 2 స్థానాలకే పరిమితమైన ఎన్‌పీపీ ఈసారి 17 స్థానాలను అదనంగా తన ఖాతాల్లో వేసుకుంది. గతంలో ఈ రాష్ట్రంలో ఒక్కసీటు కూడా లేని బీజేపీ.. ఈసారి 2 స్థానాల్లో విజయం సాధించింది.

నాగాలాండ్ సీఎం విజయం



కోహిమా, మార్చి 3: నాగాలాండ్ ముఖ్యమంత్రి టీఆర్ జెలియాంగ్ (నాగాలాండ్ పీపుల్ ఫ్రంట్) పరేన్ నియోజకవర్గంలో తన సమీప ప్రత్యర్థి, ఎన్డీపీపీ నేత ఇహెరీ నడాంగ్‌పై విజయం సాధించారు. 5,432 ఓట్ల మెజారిటీతో జెలియాంగ్ విజయ ఢంకా మోగించారు. జెలియాంగ్‌కు 14,064 ఓట్లు రాగా, నాడాంగ్‌కు 8,632 ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో (2013) జెలియాంగ్ కేవలం 2,636 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

త్రిపుర వ్యవసాయ మంత్రి ఓటమి



అగర్తల, మార్చి 3: త్రిపుర శాసనసభ ఎన్నికల్లో ఆ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అఘోరి దేవర్మ ఓటమి పాలయ్యారు. తన సమీప ఐపీఎఫ్‌టీ నేత మేవర్ కుమార్ జమాతియా చేతిలో 6,988 ఓట్ల తేడాతో పరాజయాన్ని చవిచూశారు. ఆశారాంబరి నియోజకవర్గంలో పోటీ చేసిన అఘోరి దేవర్మకు 12,200 ఓట్లు పడగా.. మేవర్ కుమార్‌కు 19,188 ఓట్లు వచ్చాయి.


• రజనీకాంత్

'కరికాలుడి పూర్తి రౌడీయిజాన్ని చూపిస్తా'

రజనీకాంత్ హీరోగా ధనుష్ సమర్పణలో లైకా ప్రొడక్షన్స్, వండర్‌బార్ ఫిలింస్ ప్రై. లిమిటెడ్ పతాకాలపై పా.రంజిత్ దర్శకత్వంలో ధనుష్ నిర్మిస్తున్న చిత్రం 'కాలా'. ఏప్రిల్ 27న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. కాగా, ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేశారు. రజనీకాంత్ కొత్తలుక్ ఈ సినిమాకి హైలైట్‌గా నిలవనుంది. 'నలుపు శ్రమ జీవుల వర్ణం.. మా వాడకొచ్చి చూడు మురికంతా ఇంద్రధనుస్సులా కనిపిస్తుంది', 'క్యారే సెట్టింగా.. వీరయ్య బిడ్డన్రా.. ఒక్కడ్నే ఉన్నా.. దిల్లుంటే గుంపుగా రండ్రా..', 'ఈ కరికాలుడి పూర్తి రౌడీయిజాన్ని ఎప్పుడూ చూళ్ళేదు కదూ.. ఇప్పుడు చూపిస్తా..' అంటూ రజనీకాంత్ తనదైన స్టైల్‌లో చెప్పిన డైలాగ్స్ థియేటర్స్‌లో క్లాప్స్ కొట్టిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. రజనీకాంత్, పా.రంజిత్ కాంబినేషన్‌లో వచ్చిన 'కబాలి' రిలీజ్‌కి ముందు, రిలీజ్ తర్వాత ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. 'కాలా' టీజర్ రిలీజ్‌తో మరోసారి వీరిద్దరి సినిమాపై భారీ ఎక్స్‌పెక్టేషన్స్ ఏర్పడ్డాయి. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణన్, సినిమాటోగ్రఫీ: మురళి జి., ఎడిటింగ్: శ్రీకర్‌ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.వినోద్‌కుమార్, నిర్మాత: ధనుష్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: పా. రంజిత్.


• నాగచైతన్య

జూన్ 14న 'సవ్యసాచి'

'ప్రేమమ్' అనంతరం అక్కినేని నాగచైతన్య, చందు మొండేటిల కలయికలో రూపొందుతున్న చిత్రం 'సవ్యసాచి'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మాధవన్, భూమికలు ప్రత్యేక పాత్రలు పోషిస్తుండగా.. 'సవ్యసాచి' ఫస్ట్ లుక్, రిలీజ్ డేట్‌లను ప్రకటించారు మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు. ఈ సంరద్భంగా చిత్ర నిర్మాతలు వై.నవీన్-వై.రవిశంకర్-మోహన్‌లు మాట్లాడుతూ.. ''మా యూనిట్ సభ్యులందరికీ 'సవ్యసాచి' ఒక స్పెషల్ ఫిలిమ్. ప్రస్తుతం హైద్రాబాద్‌లో హీరో నాగచైతన్య, భూమికలపై కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్ పూర్తవ్వగానే నెక్స్‌ట్ షెడ్యూల్ కోసం టీం అమెరికా వెళ్లనున్నారు. సినిమా ఫస్ట్ లుక్‌ను మార్చి 18న విడుదల చేయాలనుకొంటున్నాం. అలాగే ఈ చిత్రాన్ని జూన్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నాం. ఆడియన్స్‌ను ఆశ్చర్యపరిచే స్థాయిలో సినిమా ఉంటుంది. ఆర్.మాధవన్ పాత్ర సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది'' అన్నారు.

రైతు బ్రతకాలి, ప్రపంచాన్ని బ్రతికించాలి

- ఆర్.నారాయణమూర్తి



స్నేహచిత్ర పిక్చర్స్ పతాకంపై ఆర్.నారాయణమూర్తి రూపొందిస్తున్న చిత్రం 'అన్నదాతా సుఖీభవ'. ఈ సినిమా పాత్రికేయుల సమావేశం శనివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ ''పొద్దు వాలక ముందే నాగలిని భుజాన వేసుకుని పొలానికి వెళ్లి అందరికీ అన్నం పెట్టే రైతు పరిస్థితి నేడు ఎలా ఉంది. రైతు తన ఉనికిని కోల్పోతున్నాడు. రైతు దేశానికి వెన్నెముక అన్న రైతు వెన్నెముక విరిగిపోతుంది. రైతే రాజు అన్న నానుడి ఇప్పుడు లేదు. రైతు దయనీయంగా తయారవుతున్నాడు. అన్నదాతా సుఖీభవ కాస్త.. అన్నదాతా దుఃఖీభవ అయిపోయింది. కారణం ఏంటంటే రైతుకు గిట్టుబాటు ధర లేకపోవడమే. 2009 నుండి నేటి వరకు మూడు లక్షల 25 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అది మన దౌర్భాగ్యం. రైతు బ్రతకాలి.. ప్రపంచాన్ని బ్రతికించాలి. 2005లో అప్పటి కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం స్వామినాథన్ కమీషన్‌ను ఏర్పాటు చేసింది. డా.స్వామినాథన్ కమిటీ చేసిన సిపార్స్ ఏంటంటే... రైతు పంటకు ఉన్న ధర కంటే 50 శాతం అదనంగా ఇవ్వాలని చెప్పారు. అప్పుడే రైతు బావుంటాడని ఆనాడు స్వామినాథన్ చెప్పిన సిపార్స్ ఇప్పటి వరకు అమలు కాలేదు. ఏ కేంద్ర ప్రభుత్వం ఆ సిఫార్స్‌ను అమలు చేయలేదు. దాన్ని అమలు చేయాలని చెప్పడమే మా సినిమాలోని కాన్సెప్ట్. ఈ సినిమాలో బాలసుబ్రహ్మణ్యంగారు.. వంగపండు రాసిన పాటను ఎంతో గొప్పగా పాడారు. ఆయనకు హ్యాట్సాఫ్. గద్దరన్న, గోరేటి వెంకన్న, సుద్దాల అందరూ ఎంతో సపోర్ట్ చేశారు. ఈ సినిమాను మా గురువుగారు దాసరి నారాయణరావుగారికి అంకితమిస్తున్నాం'' అన్నారు.


• నితిన్

అందరికీ నచ్చేలా 'ఏ మంత్రం వేసావె'

విజయ్ దేవరకొండ తాజా చిత్రం 'ఏ మంత్రం వేసావె'. గోలీసోడా ఫిలిమ్స్ నిర్మాణంలో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రాన్ని మార్చి 9న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత శ్రీధర్ మాట్లాడుతూ ''టెక్నాలజీ పరంగా అందరూ సోషల్ మీడియాకి బానిసలైపోయారు. అలాంటి కాన్సెప్ట్‌తో చేసిన సినిమా ఇది. కంప్యూటర్ గేమ్స్‌కు బానిసైన హీరోని.. ఆన్‌లైన్‌లో పరిచయమైన హీరోయిన్ ఎలా మార్చుకుంది. తనకు మానవ విలువలను, సంబంధాలను ఎలా తెలియజేసిందనేదే కథ. శివకుమార్‌గారి సహకారంతో సినిమాను మార్చి 9న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ ''సినిమాను మార్చి 9న విడుదల చేయాలని అనుకుంటున్నాం. నేను సినిమా చూశాను. నచ్చడంతో విడుదల చేయడానికి ముందుకు వచ్చాను. సినిమా మంచి రికార్డులను క్రియేట్ చేసేలా.. అందరికీ నచ్చేలా ఉంటుంది. రెండు రాష్ట్రాల్లో 900-1000 థియేటర్స్‌లో విడుదల చేస్తున్నాం'' అన్నారు.


• శ్రీధర్ మర్రి, మల్కాపురం శివకుమార్

'ఛల్ మోహన్‌రంగ' రెండో పాట విడుదల

నితిన్, మేఘా ఆకాష్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఛల్ మోహన్ రంగ'. కృష్ణ చైతన్య దర్శకుడు శ్రీమతి నిఖితా రెడ్డి సమర్పణలో, పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్, త్రివిక్రమ్, శ్రేష్ఠ్ మూవీస్ పతాకాలపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రానికి సంబంధించిన 'గఘ మేఘ' పాట విడుదలై అందర్నీ ఆకట్టుకుంటోంది. 'ఫస్టు లుక్కు సోమవారం'' అంటూ సాగే మరో పాటను శనివారం విడుదల చేశారు. వారంలో ఏడు రోజు లుంటే, ఒక్కో రోజుకి ఒక్కో ప్రత్యేకత ఉందంటూ తనదైన చమత్కారంతో కేదారనాథ్ ఈ పాటను రచించగా, నాకాష్ అజీజ్ ఆలపించారు. సంగీత, సాహిత్యాల కలబోతగా ఈ చిత్రంలోని పాటలు ఉంటాయని దర్శకుడు కృష్ణచైతన్య అంటున్నారు. నిర్మాత ఎన్.సుధాకర్‌రెడ్డి ఈ చిత్రాన్ని ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్టు ప్రకటించారు.



'సాహో' శ్రద్ధా కపూర్

ప్రభాస్ హీరోగా సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సాహో'. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన బాలీవుడ్ హీరోయిన్‌గా శ్రద్ధా కపూర్ నటిస్తోంది. శనివారం శ్రద్ధా పుట్టినరోజు సందర్భంగా 'సాహో'లో ఆమెకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది చిత్ర యూనిట్. అందులో స్టైలిష్ లుక్‌తో శ్రద్ధా అందరినీ ఆకట్టుకుంటుంది. ఈ చిత్రంలో ప్రభాస్‌తో కలిసి శ్రద్ధా కొన్ని యాక్షన్ సన్నివేశాల్లో కూడా పాల్గొననున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రాన్ని యు.వి. క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తుండగా.. శంకర్-ఇషాన్-లాయ్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఈ సంవత్సరం దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలని ప్లాన్ చేస్తున్నారు.


• రకుల్ ప్రీత్‌సింగ్

కార్తీతో రెండో సినిమా

కార్తీ, రకుల్ ప్రీత్ జంగా తమిళ్‌లో రూపొందిన 'ధీరన్ అధిగారమ్ ఒండ్రు' చిత్రం మంచి విజయాన్ని సాధించింది. తెలుగులో 'ఖాకి' పేరుతో విడుదలైన ఇక్కడ కూడా అనూహ్యంగా సూపర్‌హిట్ అయింది. ఇప్పుడు కార్తీ, రకుల్ జంటగా రజత్ రవిశంకర్ దర్శకత్వంలో తదుపరి చిత్రం శనివారం ప్రారంభమైంది. ఈ చిత్ర పూజా కార్యక్రమానికి హీరో సూర్య, అతడి తండ్రి శివకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇక ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో నటించనున్నారు.

బంద్‌కు సహకరిస్తున్న అందరికీ ధన్యవాదాలు

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ల తీరును నిరసిస్తూ శుక్రవారం నుండి ఐదు రాష్ట్రాల నిర్మాతల మండలి సంయుక్తంగా థియేటర్ల బంద్ చేసిన విషయం తెలిసిందే. థియేటర్ల బంద్ విజయవంతంగా జరుగుతున్న సందర్భంగా తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ శనివారం మీడియా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో టిఎఫ్‌సిసి ఛైర్మన్ ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ ''శుక్రవారం నుండి తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో థియేటర్స్ బంద్ సక్సెస్‌ఫుల్‌గా జరుగుతోంది. దీనికి సహకరిస్తున్న ఐదు రాష్ట్రాల నిర్మాతలకు, డిస్ట్రిబ్యూటర్స్‌కు, ఎగ్జిబిటర్స్‌కు, ప్రజలకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను'' అన్నారు. టిఎఫ్‌సిసి సెక్రటరి సాయి వెంకట్ మాట్లాడుతూ ''థియేటర్స్ బంద్‌కు సహకరిస్తున్న సౌత్ ఇండియన్ సినీ ఇండస్ట్రీవారికి నా ధన్యవాదాలు. ఇకనైనా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్.. వారి మొండి వైఖరి మానుకొని దిగివస్తే మంచిది. లేదంటే మా డిమాండ్స్ తీరే వరకు థియేటర్స్ బంద్ కొనసాగుతూనే ఉంటుంది'' అన్నారు.


• సాయివెంకట్, ప్రతాని రామకృష్ణ గౌడ్

ఏ నిమిషానికి ఏమి జరుగునో.. ప్రారంభం



నాగ అన్వేశ్ హీరోగా గణేష్ క్రియేషన్స్ పతాకంపై శ్రీకృష్ణ గొర్లె దర్శకత్వంలో లండన్ గణేశ్, సి.హెచ్.వి. నాగేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం 'ఏ నిమిషానికి ఏమి జరుగునో'. ఈ సినిమా పూజా కార్యక్రమాలు శనివారం హైదరాబాద్‌లో జరిగాయి. వినాయక్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. షో టైమ్ స్టూడియోస్ సమర్పిస్తున్న చిత్రమిది. ఈ సినిమా గురించి నిర్మాత లండన్ గణేష్ మాట్లాడుతూ ''నాగ అన్వేష్‌ని చూస్తే బాలీవుడ్ హీరోని చూసినట్టు అనిపిస్తాడు. డిసెంబర్‌లో ఈ టీమ్‌ని కలిశాను. ఇప్పుడు ప్రారంభోత్సవం చేశాం'' అన్నారు. సి.హెచ్.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ''కథ నచ్చి ఈ సినిమాతో కొనసాగుతున్నాను. మూడు షెడ్యూళ్లలో సినిమాను పూర్తి చేస్తాం. ఒక షెడ్యూల్ సిటీలో, ఒక షెడ్యూల్ ఫారెస్ట్‌లో, మరో షెడ్యూల్ లండన్‌లో ఉంటుంది'' అన్నారు. నాగఅన్వేశ్ మాట్లాడుతూ ''ఏ నిమిషానికి ఏం జరుగుతుందో క్లైమాక్స్ వచ్చేవరకు అర్థం కాదు. అట్రాక్ట్ చేసే సినిమా అవుతుంది'' అని అన్నారు. దర్శకుడు శ్రీకృష్ణ గొర్లె మాట్లాడుతూ ''సైన్స్ ఫిక్షన్ చిత్రమిది. మూడు షెడ్యూళ్లలో చేస్తాం. ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. మూడు పాటలుంటాయి. వచ్చే నెల నుంచి సినిమాను మొదలుపెడతాం'' అని తెలిపారు.

చంద్రబాబు దురాశతోనే పోలవరం ఆలస్యం

- టీడీపీ, బీజేపీ ప్రజలను మోసం చేశాయి
- రాజ్యసభ సభ్యుడు కేవీపీ బహిరంగ లేఖ



అమరావతి, మార్చి 3(మనం ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దురాశ వల్లే పోలవరం ఆలస్యమవుతోందని రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు ఆరోపించారు. రాష్ట్రం కోసం కాకుండా స్వప్రయోజనాల కోసం చంద్రబాబు పాకులాడుతున్నారని విమర్శించారు. పోలవరం అంశంపై కేవీపీ 10 పేజీల సుదీర్ఘ బహిరంగ లేఖను శనివారం చంద్రబాబు నాయుడుకు రాశారు. గొర్రె కసాయిని నమ్మినట్లు సీమాంధ్ర ప్రజలు బీజేపీ, టీడీపీని నమ్మి అధికారం కట్టబెడితే.. నమ్మించి గొంతు కోశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ చేసిన చట్టాలు, కేంద్ర మంత్రి మండలి చేసిన తీర్మానాలు పక్కన పెట్టి, విభజన హామీలను నిర్లక్ష్యం చేసి దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు చంద్రబాబు, బీజేపీ నాలుగేళ్లుగా అంటకాగుతూ... ఇప్పుడు ఒకరిపై ఒకరు కోపంతో గడ్డిపరకలు విసురుకుంటుంటే ప్రజలు నమ్ముతారనుకోవడం పొరపాటని చెప్పారు. పోలవరం విషయంలో చంద్రబాబు, కేంద్రం ఆడిన నాటకాలు తెరపైకి వచ్చాయన్నారు. కేవలం వ్యక్తిగత స్వార్థం కోసమే చంద్రబాబు పోలవరాన్ని చేపట్టి, ప్రాజెక్టు అంచనాలను పెంచే విషయంలో కేంద్రం అనుమతి లేకుండా కాంట్రాక్టర్లను మెప్పించేలా ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని కేవీపీ మండిపడ్డారు. చట్టప్రకారం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తలపై వేసుకోవడం ఆర్థికభారమేనన్నారు. పోలవరం, ప్రత్యేక హోదా విషయంలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉందని, సమస్యల్ని జాతీయస్థాయిలో హైలెట్ చేసింది కాంగ్రెస్సేనని చెప్పుకొచ్చారు.

అవినీతి తిమింగళాలు

- ముగ్గురు అధికారుల ఇళ్లపై ఏసీబీ దాడి
- విశాఖపట్నం జిల్లాలో ఒకేసారి సోదాలు
- ఒక్కొక్కరి వద్ద 10 కోట్ల ఆస్తుల గుర్తింపు

విశాఖపట్నం, మార్చి 3 (మనం న్యూస్ బ్యూరో): విశాఖపట్నం జిల్లాలో శనివారం ఏకకాలంలో ముగ్గురు ప్రభుత్వ అధికారులపై ఏసీబీ దాడులు చేయడం సంచలనం సృష్టించింది. ఆదాయానికి మించి ఆస్తులు కలిగివున్నారనే ఆరోపణలపై దాడులు చేశారు. వారి వద్ద కోట్లాది రూపాయల ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ అధికారులు కనుగొన్నారు. మల్కాపురం వీఆర్వో సంజీవకుమార్, అరేన్ వీఆర్వో వెంకటేశ్వరరావు, జీవీయంసీ చైన్‌మెన్ నాగేశ్వరరావు ఇళ్లపై ఏసీబీ డీఎస్పీ రామకృష్ణ ప్రసాద్ నేతృత్వంలో దాడులు జరిగాయి. ఒక్కొక్కరి వద్ద పది కోట్లకు తక్కువ కాకుండా విలువైన ఫ్లాట్‌లు, పొలాలు, స్థలాలు ఉన్నట్టు గుర్తించారు. పది నుంచి 30 లక్షల వరకూ నగదును కనుగొన్నారు. వీరంతా విశాఖ నగరంలో పని చేస్తూ లంచాల ద్వారా కోట్లు సంపాదించినట్లు ఏసీబీ నిర్ధారించింది. ముగ్గురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఒకే జిల్లాలో ముగ్గురు అధికారులపై ఏసీబీ దాడులు చేయడం ఇదే తొలిసారి.

పాచి లడ్డూలూ రాలేదు



'హోదా'పై స్పష్టంగానే ఉన్నాం

- సమానంగా ప్యాకేజీ ఇస్తామంటేనే ఒప్పుకున్నాం
- పవన్ వ్యాఖ్యలను ఖండిస్తున్నాం: లంకా దినకర్

అమరావతి, మార్చి 3 (మనం ప్రతినిధి): ప్రత్యేక హోదా, ప్యాకేజీ విషయంలో తెలుగుదేశం పార్టీ చాలా స్పష్టంగానే ఉందని టీడీపీ అధికార ప్రతినిధి లంకా దినకర్ పేర్కొన్నారు. నీతి ఆయోగ్ వల్ల ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వలేమని, దానికి సమానంగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని కేంద్రం చెబితేనే ఒప్పుకున్నామని ఆయన స్పష్టం చేశారు. శనివారం గుంటూరులోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అయోమంలో ఉన్నారని, ప్రత్యేక హోదాపై విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను అయోమయంలో పడేస్తున్నారని మాట్లాడిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలను దినకర్ ఖండించారు. నాలుగేళ్లలో రాష్ట్రానికి అవసరమైన నిధులను కేంద్రం నుంచి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం అనేక విధాలుగా ప్రయత్నించిందన్నారు. విభజన హామీల అమలుకు చంద్రబాబు అనేక సార్లు కేంద్రంతో సంప్రదింపులు చేశారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వంలో మంత్రి పదవులు టీడీపీకి కొత్తకాదన్నారు. రాష్ట్రానికి రైల్వేజోన్ విషయంలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు పార్లమెంట్‌లో ప్రవేట్ బిల్లు పెట్టారని వెల్లడించారు. కేంద్రంపై తెలుగుదేశం పోరుబాట దశల వారీగా ఉంటుందని దినకర్ పేర్కొన్నారు.

- హోదా ఇవ్వాల్సిందే.. తగ్గేది లేదు
- ప్యాకేజీ నిధులన్నారు.. అవీ లేవు
- ప్రజలకు కావల్సినవి ఇవ్వడంలేదు
- చంద్రబాబు పరస్పర విరుద్ధ ప్రకటనలు
- అయోమయ పరిస్థితి సృష్టిస్తున్నారు
- ఆయనకు కన్ఫ్యూజన్ ఉన్నట్టుంది
- జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్
- జేఎఫ్‌సీ సమావేశం.. నివేదిక సిద్ధం
- ఏపీకి రావాల్సింది రూ. 75వేల కోట్లు
- ఇది ఇంకా పూర్తి నివేదిక కాదు: జేపీ



హైదరాబాద్‌లో సమావేశమైన జేఎఫ్‌సీ సభ్యులు

హైదరాబాద్, మార్చి 3: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. హోదా విషయంలో వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర అవసరాల కోసం పాచిపోయిన లడ్డూలైనా తీసుకుంటామని టీడీపీ నేతలన్నారని, ఇప్పుడు ఆ పాచిపోయిన లడ్డూలు కూడా పూర్తిగా రాలేదని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో జరిగిన జేఎఫ్‌సీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సమావేశానికి లోక్‌సత్తా నేత జయప్రకాష్ నారాయణ.. ఇంకా ఉండవల్లి అరుణ్‌కుమార్, తోట చంద్రశేఖర్, పద్మనాభయ్య, ఐవైఆర్ కృష్ణారావు తదితరులు హాజరయ్యారు. ప్రజలకు ఏం కావాలో అవి ఇవ్వలేకపోతున్నారని.. తొలుత ప్రత్యేక హోదా అని, తర్వాత ప్యాకేజీ అన్నారని.. చివరకు ప్యాకేజీ నిధులు కూడా రాలేదని విమర్శించారు. సీఎం చంద్రబాబు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ.. ప్రజల మధ్య అయోమయ పరిస్థితి సృష్టించారని విమర్శించారు. అసలు చంద్రబాబు నాలుగేళ్లుగా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఆయనలో ఇంత కన్ఫ్యూజన్ ఎందుకు వచ్చిందన్నారు. అప్పట్లో అనుభవజ్ఞులని చంద్రబాబుకు మద్దతు పలికానని, ఎన్డీయే విజయానికి కషి చేశానని పవన్ చెప్పారు.

విభజనలో నేతల పాత్ర ఉంది గానీ ప్రజల పాత్ర లేదని, విభ జనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రత్యేక హోదా ఇస్తారనే తానూ నమ్మానని.. హోదాతో ఇంకేదీ సమానం కాదని చెప్పారు. పార్లమెంట్‌లో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలను పాలించే నైతిక అర్హత ఉండదని అన్నారు. జాతీయ విద్యా సంస్థలకు ఇప్పటివరకు కేంద్రం నాలుగేళ్లలో ఇచ్చింది కేవలం 5 శాతమేనని తేల్చిచెప్పారు. పూర్తి నిధులివ్వడానికి కేంద్రానికి ఎన్ని దశాబ్దాలు కావాలని ప్రశ్నించారు. ప్రత్యేకహోదా ఇస్తేనే 100 శాతం న్యాయం జరుగుతుందని చెప్పారు. విశాఖను రైల్వే జోన్‌గా ప్రకటించడానికి అర్హత లేదంటున్నారని.. అసలు ఏ అర్హతతో రాష్ట్రాన్ని విభజించారని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించాలని విభజన చట్టంలో ఉందని, ఇలాంటి జాతీయ ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్రం తీసుకోకుండా ఉంటే బాగుండేదని అన్నారు. ప్రాజెక్టు ముందుకు వెళ్లకపోతే రాష్ట్రానిదే బాధ్యత అవుతుందని చెప్పారు.



హాజీపూర్‌కు ఇస్తారు.. విశాఖ ఇవ్వరా?

విశాఖ రైల్వేజోన్‌ను కేంద్రం ప్రకటించాలని, రైల్వేజోన్‌పై పార్లమెంటులో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పవన్ డిమాండ్ చేశారు. బిహార్‌లో హాజీపూర్‌కు రైల్వేజోన్ ఇస్తారు కానీ... ఏపీలో విశాఖపట్నానికి ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. కేంద్రమంత్రి రాంవిలాస్ పాశ్వాన్ కోరితే జోన్ ఇస్తారు కానీ.. ఏపీకి ఇచ్చిన హామీని నిలబెట్టుకోరా అంటూ నిలదీశారు. దుగరాజుపట్నం పోర్టుకు ప్రత్యామ్నాయం ఎందుకు చూపలేదని, దుగరాజపట్నం కుదరకపోతే వేరే దగ్గర పోర్టు నిర్మించాల్సిందని చెప్పారు. కేంద్ర విద్యాసంస్థలకు కేవలం 5% నిధులే ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు ఉదాసీనంగా ఉందో అర్థం కావడంలేదని ఏపీ ప్రభుత్వాన్ని నిలదీశారు.

పార్ట్‌నర్ అంటున్నారు..

తమ పార్టీని కొందరు టీడీపీ పార్ట్‌నర్ అని, మరికొందరు బీజేపీ పార్ట్‌నర్ అని ప్రచారం చేస్తున్నారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఏపీకి జరుగుతున్న అన్యాయాన్ని తెలియజేసిన జేఎఫ్‌సీ సభ్యులకు అభినందనలు తెలిపారు. జేఎఫ్‌సీలో 11 అంశాలపై చర్చించామని, రాష్ట్ర విభజనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఏపీ, తెలంగాణ ప్రజల మధ్య సుహృద్భావ వాతావరణం ఉందన్నారు. స్థిరాస్తుల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ఆస్తులన్నీ హైదరాబాద్‌లోనే ఉండిపోయాయని పవన్ పేర్కొన్నారు.

తుది నివేదిక కాదు: జేపీ

ఇప్పటికి తాము సిద్ధం చేసింది తుది నివేదిక కాదని.. తమ వద్ద అరకొర సమాచారమే ఉందని లోక్‌సత్తా నేత జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఏడు అంశాల్లో కేంద్రం నుంచి రాష్ట్రానికి 75 వేల కోట్లు రావాల్సి ఉందని ఆయన తెలిపారు. విభజన చట్టం సరిగ్గా లేకపోవడం వల్లే ఏపీ తీవ్రంగా నష్టపోతోందని ఆయన తెలిపారు. తమ దగ్గరున్న లెక్కల ప్రకారం ఇప్పటి వరకు రాష్ట్రానికి రావలసినవి రూ.74,540 కోట్లు అని తెలిపారు. 2014 – 15 సంవత్సరానికి రెవెన్యూ లోటును ఇంకా భర్తీ చేయలేదన్నారు. రూ.10,225 కోట్లు రావాలని చెప్పారు. హైదరాబాద్ కేంద్రంగా పన్నులు కట్టాల్సి వస్తోందని.. దీని వల్ల ఏపీ రూ.3,825 కోట్ల మేరకు నష్టపోయిందన్నారు.

అమ్మ ప్రేమమూర్తి

- ప్రేమను పంచడం.. తిరిగి పొందడమే తెలుసు
- ఇన్‌స్టాగ్రాంలో జాన్వి లేఖ



ముంబై, మార్చి 3: 'అమ్మ అర్ధాంతరంగా మరణించడంతో నా గుండెల నిండా శూన్యం ఆవరించింది.. తన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించండి. అమ్మను ప్రేమతో గుర్తుంచుకోవాలి' అని జాన్వీ తన ఇన్ స్ట్రాగ్రామ్ లో భావోద్వేగపు లేఖ రాసింది. తల్లిని ఎంతగా మిస్ అవుతున్నానో ఇప్పుడు తెలిసొస్తుందంటూ పేర్కొంది. అమ్మే నా బెస్ట్ ఫ్రెండ్ అని తెలిపింది. భౌతికంగా శ్రీదేవి దూరమై అప్పుడే వారం రోజులు గడిచింది. అతిలోక సుందరిగా తనను ఆరాధించిన అభిమానులు తను లేదనే వార్తను ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. అభిమానుల సంగతే ఇలా ఉంటే తల్లే లోకంగా బతికిన అమ్మకూచి జాన్వి శ్రీదేవి మరణాన్ని తట్టుకోలేక తల్లడిల్లుతోంది. మార్చి 3న తన పుట్టిన రోజు.. గత ఏడాది పుట్టిన రోజుకు కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్లిన జ్ఞాపకాలు కళ్లలో కదలాడుతుండగా.. ఈ ఏడాది మాత్రం అమ్మ తన వెంట లేదనే నిజం తట్టుకోలేక పోతున్నానని తెలిపింది. ఈ సందర్భంగా రాసిన లేఖలో.. తల్లిదండ్రులను ప్రేమించాలని సూచించింది. తన తల్లిదండ్రుల మధ్య విడదీయలేనంత ప్రేమ, అభిమానం పెనవేసుకుని ఉన్నాయని, వాటికి మరకలు అద్దే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేసింది. ఒక నటిగా మాత్రమే కాదు, భార్యగా, తల్లిగా.. అన్ని రకాల పాత్రలనూ సమర్థవంతంగా పోషించిందని చెప్పింది. విసుగు, అసూయ లాంటివి తన తల్లికి తెలియవని.. అమ్మకు తెలిసిందల్లా ప్రేమను పంచడం, తిరిగి పొందడమేనని పేర్కొంది. తనపట్ల మనమూ అలాగే ఉందామని, మంచిని, ప్రేమను మాత్రమే పంచుదామని లేఖలో పేర్కొంది. అదే తన తల్లికి సంతోషం కలిగిస్తుందని జాన్వి తెలిపింది. ఇంకా.. 'స్వచ్ఛమైన ప్రేమమూర్తివి. ప్రేమకు ప్రతిరూపం నీవు. అందుకే దేవుడు నిన్ను త్వరగా తీసుకెళ్ళిపోయాడు. కాని కొన్నాళ్ళయినా నువ్వు మాతో ఉన్నందుకు సంతోషం. నన్ను నువ్వు చాలా ప్రేమించావు, నేను ఎవరిపైన ఆధారపడలేదు.. ఎందుకంటే నాకు కావలసిన ఒకే ఒక్క వ్యక్తి నువ్వు మాత్రమే. నా జీవితంలో సగ భాగం నువ్వు. నీ జీవితం మొత్తాన్ని మా కోసమే ఇచ్చేశావు. నేను కూడా ఇప్పుడు అదే చేయాలని అనుకుంటున్నా అమ్మా.. నిన్ను చూసి నేను ఎంత గర్వపడ్డానో.. నన్ను చూసి నువ్వు గర్వపడు రోజు వస్తుందని ఆశిస్తూ పనిచేస్తాను. ఈ ఆలోచనతోనే ప్రతి రోజు ఉదయం ప్రతిజ్ఞ చేస్తున్నాను' అని జాన్వి తన లేఖలో పేర్కొంది.




ఆ ఉద్యోగులకు ముప్పు లేదు

- హెచ్-1బీ భాగస్వాములకు శుభవార్త
- వర్క్ పర్మిట్ రద్దుపై డీహెచ్‌ఎస్ ప్రకటన

వాషింగ్టన్, మార్చి 3: హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములకు వర్క్ పర్మిట్ రద్దు విషయమై ఇంకా పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోలేదని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ(డీహెచ్‌ఎస్)పేర్కొంది. ఈమేరకు ఓ కోర్టుకు సమర్పించిన నివేదికలో ఈ విషయాన్ని పొందుపరిచింది. ఈ నిర్ణయాన్ని అమలు చేసే ముందు దేశ ఆర్థిక రంగంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయాన్ని ముందుగా అధ్యయనం చేయాల్సి ఉందని పేర్కొంది. హెచ్4 వీసాల మీద వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములను ఉద్యోగాల నుంచి తొలగించే నిర్ణయంపై జూన్ వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోబోమని తెలిపింది. అప్పటి వరకు హెచ్-4 వీసాదారుల ఉద్యోగాలకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని డీహెచ్‌ఎస్ వెల్లడించింది. దీంతో పెద్ద సంఖ్యలో అక్కడ పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు, వారి కుటుంబాలకు ఊరట లభించినట్లయ్యింది. 2015లో అప్పటి ఒబామా ప్రభుత్వం హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములు, గ్రీన్‌కార్డు కోసం ఎదురుచూసే వారి భార్య/భర్తలు యూఎస్‌లోని వివిధ కంపెనీల్లో హెచ్-4 డిపెండెంట్ వీసాల కింద పనిచేసేందుకు అవకాశం కల్పిస్తూ ఓ విధానాన్ని తీసుకొచ్చారు. అయితే.. దాన్ని ఫిబ్రవరి 28 నుంచి తొలగిస్తామని ట్రంప్ ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా ఈ నిర్ణయాన్ని అమలు చేయాలా వద్దా అనేది నిర్ణయించడానికి కొద్దిగా సమయం పడుతుందని అమెరికా ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

హోదా సున్నితమైన అంశం

- జఠిలం చేస్తే మరింత నష్టం
- దేశంలో ఎక్కడా లేని విధంగా వెనుకబడిన జిల్లాలకు ప్యాకేజీ
- కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు



విజయనగరం, మార్చి 3 (మనం న్యూస్ బ్యూరో): ప్రత్యేక హోదా సున్నితమైన అంశమని, దాన్ని జఠిలం చేయడం ద్వారా మరింత నష్టం కలుగుతుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు వ్యాఖ్యానించారు. అశాస్త్రీయంగా విభజన చేసిన వారే నేడు అన్యాయం జరిగిందంటూ ఆందోళన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శనివారం విజయనగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రాలకు హోదా ఇవ్వలేని స్థితిలో ఏపీకి అందుకు తగ్గ నిధులు ఇస్తామని కేంద్రం చెప్పడంతోనే ప్యాకేజీకి అంగీ కరించామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ నిధులను కేంద్రం అందిస్తోందని పేర్కొన్నారు. బుందేల్‌ఖండ్ ప్యాకేజీ తరహాలో నిధులు సాధించడానికి కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఆలోచన చేస్తున్నారని చెప్పారు. దేశవ్యాప్తంగా ఏపీకే ఈ నాలుగేళ్లలో అధిక పెట్టుబడులు వచ్చాయన్నారు. విద్యార్థులు ఆందోళన చెందనవసరం లేదని, పరిశ్రమల స్థాపన ద్వారా వేలాది ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇక విభజన చట్టం ప్రకారం 2025 వరకు అసెంబ్లీ సీట్లు పెంపు సాధ్యం కాకపోవచ్చునని ఆయన తెలిపారు. దీనివల్ల తెలంగాణకే ఎక్కువ నష్టం వాటిల్లుతుందన్నారు. ఏపీలో కూడా సీట్లు పెంపు లేకపోవడంపై కొంతమంది అసంతృప్తితో ఉన్నారన్నారు.

డీఎస్సీ, ఎస్‌జీటీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

- దరఖాస్తులకు మార్చి 14 తుది గడువు

అమరావతి, మార్చి 3: డీఎస్సీ, ఎస్‌జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్) పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, బీసీ(సీ) వర్గానికి చెందిన అభ్యర్థులకు విజయవాడలోని బీఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ, వసతి సదుపాయం కల్పిస్తున్నారు. ఈ శిక్షణలో చేరేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త సంచాలకులు పీఎస్‌ఏ ప్రసాద్ తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 14 తుది గడువు అని చెప్పారు. అంబేద్కర్ స్టడీ సర్కిల్‌లో వంద మందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, ఇప్పటివరకు 30 మంది దరఖాస్తులు చేసుకున్నారని ప్రసాద్ చెప్పారు. శిక్షణకు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందినవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవలెను. అభ్యర్థుల వయస్సు 47 సంవత్సరాలలోపు ఉండాలి. ఎస్సీ లేదా బీసీ(సీ)కి చెందిన వారై ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం ఎస్సీలకు రూ.లక్ష లోపు, బీసీ(సీ) వారికి రూ.2 లక్షల లోపు ఉండవలెను.

దాపరికంలేని ఇండో-పసిఫిక్..!

- భారత్, వియత్నాం సంయుక్త కృషి: మోదీ
- ప్రధానితో వియత్నాం అధ్యక్షుడు సమావేశం
- 3 కీలక ఒప్పందాలపై ఇరు దేశాల సంతకాలు



న్యూఢిల్లీ, మార్చి 3: భారత్-వియత్నాం అణు సహకారం సహా మూడు కీలక ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. దాపరికంలేని ఇండో-పసిఫిక్ ప్రాంతం కోసం, చట్టబద్ధమైన ప్రాంతీయ చట్రం కిందకు తీసుకురావడానికి సంయుక్తంగా కృషి చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. శనివారం ప్రధాని నరేంద్ర మోదీ, వియత్నాం అధ్యక్షుడు ట్రన్ దాయ్ ఖాంగ్ సమావేశమై చర్చలు జరిపారు. రక్షణ, ఆయిల్, గ్యాస్, వ్యవసాయం సహా కీలక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. ఇరు దేశాల నేతల సమక్షంలో ఒప్పందాలపై సంతకాలు చేశారు. అనంతరం సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. ''దాపరికంలేని స్వతంత్ర, సౌభాగ్య ఇండో-పసిఫిక్ ప్రాంతమే మా ఆకాంక్ష. ఇందుకు ఇరు దేశాలు సంయుక్తంగా పనిచేస్తాయి. సార్వభౌమత్వాన్ని, అంతర్జాతీయ చట్టాలను గౌరవిస్తూ, చర్చల ద్వారా విభేదాలను పరిష్కరించుకుంటాం. ద్వైపాక్షిక సహకారం విస్తరణకు ఇరు దేశాలు కృతనిశ్చయంతో ఉన్నాయి. రక్షణ ఉత్పత్తులు, సాంకేతిక సహకారం కోసం కలసికట్టుగా పనిచేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. అలాగే ఆయిల్, గ్యాస్, ఇంధన, వ్యవసాయం, టెక్స్‌టైల్ రంగాల్లో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలకు ఇరు దేశాలు పరస్పరం అంగీకరించాయి'' అని మోదీ పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంపై ఆధిపత్యం చెలాయించేందుకు చైనా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో భారత్, వియత్నాం కీలక ఒప్పందాలు కుదుర్చుకోవడం ప్రాధాన్యం ఏర్పడింది. అంతకుముందు వియత్నాం అధ్యక్షుడితో విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ భేటీ అయ్యారు. అన్ని రంగాల్లో ఇరు దేశాల మధ్య సంబంధాలను విస్తరించడంతో పాటు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా చర్చలు జరిపినట్టు విదేశీ వ్యవహారాల ప్రతినిధి రవీశ్ కుమార్ చెప్పారు.


అమెరికాలో పెను తుపాను

- ఐదుగురి దుర్మరణం
- విమాన సేవలన్నీ రద్దు
- అంధకారంలో 17 లక్షల కుటుంబాలు

బోస్టన్, మార్చి 3: అమెరికా ఈశాన్య ప్రాంతంలో ఉన్నట్టుండి పెనుతుపాను విరుచుకుపడింది. దాంతో ఐదుగురు మరణించారు. గంటకు దాదాపు 129 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. బోస్టన్ వీధులను వరదలు ముంచెత్తాయి. దాంతో విమాన సేవలన్నింటినీ రద్దు చేశారు. రైళ్లు ఆగిపోయాయి. దాదాపు 17 లక్షల కుటుంబాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వర్జీనియా నుంచి మైన్ వరకు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రాజధాని వాషింగ్టన్ డీసీలో కూడా గంటకు 96 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ మూతపడ్డాయి. సముద్ర కెరటాలు బాగా ఎత్తున రావడంతో బోస్టన్ వీధులన్నీ వరదమయం అయాయయి. ఈ ప్రాంతంలో ఇలా వరదలు రావడం ఈ ఏడాది ఇది రెండోసారి. దానికితోడు గాలి వేగం కూడా చాలా ఎక్కువగా ఉండటంతో చెట్లు పడిపోయి విద్యుత్‌లైన్లు తెగిపోయాయి. ప్రస్తుతానికి వరద తీవ్రత కొంతవరకు తగ్గినా, రికార్డు స్థాయిలో రాబోయే కెరటాల కారణంగా బోస్టన్ నగరంలో మాత్రం మరింత తీవ్రమైన వరద వచ్చే అవకాశం ఉందని జాతీయ వాతావరణ శాఖ తెలిపింది. తీరప్రాంతంలో మరోసారి వరదలు వస్తాయని, బోస్టన్ నగరానికే ప్రధానంగా ముప్పు పొంచి ఉందని మేరీలాండ్‌లోని కాలేజి పార్కులో గల వాతావరణ అంచనా కేంద్రంలో వాతావరణ నిపుణుడు జిమ్ హేస్ తెలిపారు. మరో రెండు రోజుల పాటు వర్షంతో పాటు మంచు కూడా పడుతుందని, ఆ తర్వాత గాలి వేగం కూడా తగ్గొచ్చని అన్నారు.

వర్జీనియాలో ఎమర్జెన్సీ


వర్జీనియా గవర్నర్ రాల్ఫ్ నార్తామ్ ఆ రాష్ట్రంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. తీవ్రమైన గాలుల కారణంగా నష్టపోయినవారికి ప్రభుత్వ సాయం అందుతుందని తెలిపారు. రోడ్ ఐలండ్‌లో చెట్టు విరిగి మీద పడటంతో 70 ఏళ్ల వృద్ధుడు మరణించారు. అలాగే న్యూయార్క్‌లోని పుత్నమ్ వ్యాలీలో తన ఇంటిమీద చెట్టు పడటంతో 11 ఏళ్ల బాలుడు మృతిచెందాడు. వర్జీనియాలోని జేమ్స్ సిటీ కౌంటీలో ట్రక్కు మీద ఓక్ చెట్టు పడటంతో అందులో వెళ్తున్న 44 ఏళ్ల వ్యక్తి



ప్రాణాలు కోల్పోయారు. వర్జీనియాలోని షెస్టర్‌ఫీల్డ్ కౌంటీలో ఆరేళ్ల బాలుడు ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటిపై చెటుట పడటంతో అతడు మరణించాడు. బాల్టిమోర్‌లో తన ఇటి సమీపంలో చెట్టుకొమ్మ విరిగి పడి 77 ఏళ్ల వృద్ధురాలు ప్రాణాలు కోల్పోయింది. న్యూయార్క్, పెన్సిల్వేనియా రాష్ట్రాల్లో 46 సెంటీమీటర్ల మంచు పడే అవకాశం ఉందని ప్రైవేటు వాతావరణ సంస్థ ఆక్యువెదర్ తెలిపింది.

'అమెరికన్ ఆర్థిక వ్యవస్థకూ చేటు'

ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై సుంకాలు విధించాలన్న ట్రంప్ నిర్ణయంపై ఐ.ఎం.ఎఫ్ హెచ్చరిక



వాషింగ్టన్: ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై భారీగా సుంకాలు విధించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేసిన పథకాలు అమెరికా బయట నష్టాన్ని వాటిల్లజేయడమే కాకుండా, అమెరికన్ ఆర్థిక వ్యవస్థపైన కూడా ప్రభావం చూపుతాయని అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్) హెచ్చరించింది. అమెరికన్ ఉత్పత్తి సంస్థల ప్రయోజనాలు కాపాడేందుకు ఉక్కుపై 25 శాతం, అల్యూమినియంపై 10 శాతం దిగుమతి సుంకం విధించనున్నట్లు ట్రంప్ గురువారం ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు ప్రకటించిన దిగుమతి ఆంక్షలు అమెరికా బయటనే కాకుండా, అల్యూమినియం, ఉక్కును ప్రధానంగా ఉపయోగించుకునే వస్తూత్పత్తి, భవన నిర్మాణ రంగాలతో సహా మొత్తం అమెరికా ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లజేయగలవని ఐ.ఎం.ఎఫ్ ప్రతినిధి జెరీ రైస్ చెప్పారు. ట్రంప్ ప్రకటన వెలువడిన మరునాడు ఐ.ఎం.ఎఫ్ ఈ విధంగా వ్యాఖ్యానించింది. అమెరికా ప్రతిపాదించిన చర్యలు, యదార్థంగా, వివిధ దేశాలు జాతీయ భద్రత హేతువును సాకుగా చూపి, విస్తృత ఆధారిత దిగుమతి ఆంక్షలను సమర్థించుకునే పరిస్థితులు విస్తరిస్తాయని ఐ.ఎం.ఎఫ్ ఆందోళన చెందుతోందని రైస్ చెప్పారు. ''వాణిజ్యపరమైన ప్రతిబంధకాలను తొలగించుకునేందుకు, వాణిజ్య విభేదాలు పరిష్కరించుకునేందుకు అటువంటి అత్యవసర చర్యలకు దిగకుండా, అమెరికా, దాని వాణిజ్య భాగస్వాములు కలసి నిర్మాణాత్మకంగా పనిచేయడాన్ని మేం ప్రోత్సహిస్తాం'' అని రైస్ చెప్పారు. అమెరికాలో భవన నిర్మాణ, వస్తూత్పత్తి రంగాలకు జీవనాడి వంటి రెండు పదార్థాలపై టారిఫ్‌లు విధించాలన్న ట్రంప్ నిర్ణయం అమెరికా కీలక మిత్రపక్షాలైన కెనడా, యూరోపియన్ యూనియన్, ఆస్ట్రేలియాలతో సహా మెక్సికో, చైనాలకు కూడా ఆగ్రహం తెప్పించింది. ప్రయోజనాలను సంరక్షించుకునేందుకు ''దృఢంగా ప్రతిక్రియ'' చూపుతామని యూరోపియన్ కమిషన్ ఛీఫ్ జీన్-క్లాడి జంకెర్ ప్రతిన బూనారు. టారిఫ్‌లు ''అంగీకారయోగ్యమైనవి కావు'' అని కెనడా, జర్మనీలు రెండూ ప్రకటించాయి. ''వాణిజ్య యుద్ధాలు మంచివే'' నంటూ ట్రంప్ తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. అమెరికా ''వర్తకంపై కోట్లాది డాలర్లు నష్టపోతోంది'', వాణిజ్య యుద్ధంలో ''తేలిగ్గా గెలవడమెలాగో కనుక్కుంటుంది'' అని ఆయన ట్వీట్ చేశారు. వాణిజ్య యుద్ధంలో అమెరికా ''పెద్ద గెలుపు'' సాధిస్తుందని ట్రంప్ శుక్రవారం ఉదయం ట్వీట్ చేశారు. వాటిని కొనసాగిస్తూ ఆయన ''మన దేశాన్ని, మన కార్మికులను రక్షించుకుని'' తీరాలని అన్నారు. వాణిజ్య లోటు వల్ల తనకు టారిఫ్‌లు విధించడంకన్నా మరో మార్గం లేకపోయిందని అన్నారు.



నాన్-బెయిలబుల్ వారంట్లు జారీ

- నీరవ్, మెహుల్ చుట్టూ ఉచ్చు బిగిస్తున్న ప్రత్యేక కోర్టు

ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి) కుంభకోణ సూత్రధారులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలకు ప్రత్యేక న్యాయస్థానం ఒకటి శనివారంనాడు నాన్-బెయిలబుల్ వారంట్లు జారీ చేసింది. ఈ ఇద్దరు వజ్రాల వర్తకులు పి.ఎన్.బికి రూ. 114 బిలియన్ల మేరకు కుచ్చు టోపీ పెట్టిన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గుప్తధన చెలామణీ నిరోధక చట్టం (పి.ఎం.ఎల్.ఎ) కింద ఈ ప్రత్యేక కోర్టు ఏర్పాటైంది. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న సంస్థల్లో ఒకటైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) దాఖలు చేసిన దరఖాస్తుల మేరకు ప్రత్యేక కోర్టు బెయిలు ఇవ్వడానికి వీలు లేని విధంగా అరెస్టు వారంట్లు జారీ చేసింది. నీరవ్, మెహుల్ పి.ఎన్.బిని వంచించినట్లుగా గత నెలలో కేసులు నమోదయ్యాయి. తమ ఎదుట హాజరు కావలసిందిగా ఇ.డి అంతకుముందే నీరవ్, మెహుల్‌లకు సమన్లు జారీ చేసింది. అయితే, క్రిమినల్ కేసులు నమోదవడానికి ముందే దేశం విడిచి పారిపోయినట్లు భావిస్తున్న ఆ ఇద్దరు వజ్రాల వర్తకులు ఇ.డి ఎదుట హాజరు కావడంలో విఫలమయ్యారు. దాంతో వారిపై నాన్-బెయిలబుల్ వారంట్లు జారీ చేయవలసిందిగా ఆ కేంద్ర సంస్థ పి.ఎం.ఎల్.ఎ కోర్టును ఫిబ్రవరి 27న ఆశ్రయించింది. హాజరు కావలసిందిగా నీరవ్‌కు మూడు సమన్లు జారీ చేసినట్లు ఆ సంస్థ కోర్టుకు నివేదించింది. ''మేం మెహుల్‌కి కూడా మూడు సమన్లు జారీ చేశాం. ఆయన ఆ సమన్లకు జవాబు ఇవ్వలేదు. సంస్థ ఎదుటహాజరు కానూ లేదు'' అని ఇ.డి ప్రాసిక్యూటర్ హితేన్ వెనిగాంవ్‌కర్ మార్చి 1న జడ్జి ఎం.ఎస్. అజ్మి అధ్యక్షతన గల ప్రత్యేక కోర్టుకు తెలిపారు.

తగ్గిన విదేశీ వాణిజ్య రుణాలు



ముంబయి: భారతీయ కంపెనీల రంగం ఈ ఏడాది జనవరిలో నిధులు సమకూర్చుకునేందుకు విదేశీ మార్కెట్లను ఉపయోగించుకోవడంపై నామమాత్రపు ఆసక్తినే కనబరచింది. విదేశీ నిధుల మార్కెట్లలో వడ్డీ రేట్లు పెరుగుతున్న, దేశీయంగా రుణాలకు డిమాండ్ రికవరవుతున్న నేపథ్యంలో కంపెనీలు విదేశీ నిధులకు అంతగా చేయి సాచలేదు. విదేశీ వాణిజ్య రుణాల (ఇ.సి.బిల) ద్వారా ఈ ఏడాది జనవరిలో భారతీయ కార్పొరేట్లు సేకరించిన నిధులు 540.464 మిలియన్ డాలర్ల మేరకు ఉన్నాయి. అవి గత ఏడాది అదే నెలలో సేకరించిన విదేశీ నిధులు 1.8 బిలియన్ డాలర్లతో పోలిస్తే అవి సుమారు 70 శాతం తక్కువని చెప్పవచ్చు. దేశంలో నిధుల పంపిణీ దానికి విరుద్ధంగా ఉంది. భారతదేశంలో షెడ్యూల్డు కమర్షియల్ బ్యాంకులు ఆహారేతర రంగాలకు ఇచ్చిన రుణాలు 2017 జనవరిలో 3.5 శాతం పెరిగితే, 2018 జనవరిలో 9.5 శాతం పెరిగాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ) డాటా వెల్లడించింది. అర్హత ఉన్న దేశీయ సంస్థలు గుర్తింపు పొందిన నాన్-రెసిడెంట్ సంస్థల నుంచి సేకరించే వాణిజ్య రుణాలను ఇ.సి.బి.లు అంటారు. అంతేకాదు, భారతీయ కంపెనీల రంగం 2017 డిసెంబరులో సేకరించిన 1.3 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇ.సి.బి.ల ద్వారా 2018 జనవరిలో సేకరించిన నిధులు సుమారు 59 శాతం తక్కువగా ఉన్నాయి.

వడ్డీ రేట్లే కారణం

ఇ.సి.బి.లకు డిమాండ్ మందగించిన, బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలు పుంజుకున్న ధోరణికి దేశీయ వడ్డీ రేట్ల కన్నా విదేశీ వడ్డీ రేట్లు పెరుగుతూండడమే కారణమని బ్యాంకర్లు చెబుతున్నారు. ఇ.సి.బి.ల ధర నిర్ణయించేందుకు ఉపయోగించే లండన్ ఇంటర్‌బ్యాంక్ ఆఫర్డ్ రేట్ (లిబోర్) గత ఏడాది కాలం లో పెరిగింది. ఉదాహరణకి, ఆరు నెలల లిబోర్ 2017 జనవరి 2న ఉన్న 1.31 శాతం నుంచి 2018 జనవరి అంతానికి 1.96 శాతానికి పెరిగింది. ప్రస్తుతం అది 2.20 శాతం వద్ద ఊగిసలాడుతోంది. లిబోర్, శ్వాప్ వెలలను కలుపుకుని మొత్తంమీద ఇ. సి.బి. నిధుల ధర ఉంటుంది. లిబోర్‌లో పెరుగుదల, విదేశీ డా లర్ నిధుల మార్కెట్ కట్టుదిట్టమయ్యే అవకాశం ఉండడంతో, ఇ.సి.బి.ల ద్వారా వనరులను సమీకరించేందుకు అయ్యే నిధుల వ్యయం పెరుగుతోందని బ్యాంకర్లు అభిప్రాయపడుతున్నారు. ఒ క ఏడాది పై కాలం నుంచి దేశంలో వడ్డీ రేట్లు సడలుతూ వస్తున్నాయి. భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్.బి.ఐ)కి చెందిన వార్షిక ప్రామాణిక రుణ రేటు 2017 జనవరి-2018 ఫిబ్రవరి నెలాఖరు మధ్య కాలంలో 95 బేసిస్ పాయింట్లు తగ్గి 8.90 శాతం నుంచి 7.95 శాతానికి దిగి రావడాన్ని అందుకు నిదర్శనంగా భావిస్తున్నారు. అయితే, రుణాలు పుంజుకోవడం, డిపాజిట్ రేట్లు పెరగడంతో ఎస్.బి.ఐ ప్రామాణిక రుణ రేటును 7.95 శాతం నుంచి 8.15 శాతానికి పెంచింది. పెట్టుబడి కార్యకలాపాల పునరుద్ధరణకు సంబంధించి తొలి సంకేతాలు కనిపిస్తున్నాయని, రుణాల స్వీకరణ మెరుగుదలలో అవి ప్రతిబింబిస్తున్నాయని ఆర్.బి.ఐ ఆరవ ద్వైమాసిక ద్రవ్య విధాన ప్రకటన పేర్కొంది. ప్రైమరీ క్యా పిటల్ మార్కెట్ నుంచి పెద్దయెత్తున నిధుల సమీకరణ, యం త్రాలు, యంత్ర పరికరాల ఉత్పత్తి, దిగుమతులు మెరుగుపడ డం కూడా ఆదే విషయాన్ని సూచిస్తున్నాయని తెలిపింది. ''...దుస్థితిలో ఉన్న పెద్ద రుణగ్రస్తుల (సంస్థల)ను ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్సీ కోడ్ (ఐ.బి.సి) కింద పరిష్కారానికి పంపిస్తున్నారు. ఇది రుణ ప్రవాహాలను మరింత మెరుగుపరచి, తా జా పెట్టుబడులకు డిమాండ్ సృష్టిస్తుంది'' అని కేంద్ర బ్యాంక్ పేర్కొంది.

శెనగలపై దిగుమతి సుంకం పెంపు



బెంగళూరు: శెనగలపై దిగుమతి సుంకాన్ని ఇంతకుముందున్న 40 శాతం నుంచి 60 శాతానికి ప్రభుత్వం పెంచింది. దేశంలో శెనగలను పండించే ముఖ్యమైన ప్రాంతాల్లో ఈసారి దిగుబడులు రికార్డు స్థాయిలో ఉండగలవని భావిస్తున్నారు. ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాల నుంచి చౌక ధరలకు దిగుమతులు చేసుకోకుండా ఈ చర్య నిరోధించి, శెనగ ధరలలో నిలకడ తీసుకురాగలదని భావిస్తున్నారు. ప్రస్తుతం శెనగ ధరలు వివిధ మార్కెట్లలో క్వింటాల్‌కు దాని కనీస మద్దతు ధర (బోనస్ రూ. 150తో కూడా కలుపుకొని) రూ. 4,400కన్నా దిగువకు పడిపోయాయి. కాబూలీ శెనగల రకంపై కేంద్రం గురువారం 40 శాతం సుంకాన్ని విధించింది. గత ఏడాది డిసెంబరు నుంచి శెనగలపై దిగుమతి సుంకాన్ని మూడుసార్లు పెంచారు. చౌక ధరలకు శెనగలు వచ్చి పడిపోకుండా అరికట్టేందుకు ప్రభుత్వం మొదట 30 శాతం కస్టమ్స్ సుంకాన్ని విధించింది. దిగుబడులు ఇబ్బడిముబ్బడిగా ఉండగలవనే అంచనాతో ప్రభుత్వం ఫిబ్రవరి మొదట్లో శెనగలపై దిగుమతి సుంకాన్ని 40 శాతానికి పెంచింది. పంట విస్తీర్ణం, దిగుబడులు పెరగడం వల్ల ఈసారి శెనగ పంట మున్నెన్నడూ లేనంత గరిష్ఠ స్థాయిలో 11.10 మిలియన్ టన్నుల మేరకు ఉండగలదని వ్యవసాయ మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. గత ఏడాది తుది అంచనా 9.38 మిలియన్ టన్నుల కన్నా ప్రస్తుత పంట దాదాపు 18 శాతం ఎక్కువ. పప్పు ధాన్యాలలో అత్యధికంగా మార్కెట్‌కు వచ్చేవి శెనగలే. అవి కర్ణాటక, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్‌లలో మార్కెట్లకు రావడం మొదలైంది. రానున్న రోజుల్లో ఇది వేగం పుంజుకుంటుందని భావిస్తున్నారు. ఈ ఏడాది దేశంలో మొత్తం పప్పు ధాన్యాల ఉత్పత్తి 23.95 మిలియన్ టన్నులను తాకవచ్చని భావిస్తున్నారు. దిగుబడులలో, ముఖ్యంగా మినుముల పంటలో వృద్ధిని దానికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. ఎగుమతులకు ద్వారాలు తెరుస్తూ, చౌక ధరలకు దిగుమతులు చోటుచేసుకోకుండా అరికట్టేందుకు ప్రభుత్వం వివిధ చర్యలు తీసుకున్నప్పటికీ, ఈ ఏడాది దిగుబడులు పెరగడం, ఇంతకుముందున్న నిల్వలు కొనసాగడంతో పప్పు ధాన్యాల ధరలు గత ఏడాది నుంచి మందగొడిగానే ఉన్నాయి. కంది పప్పు, మినుములు, పెసలలో దాదాపు అన్ని రకాల ధరలు వివిధ రాష్ట్రాలలో వాటి మద్దతు ధరల స్థాయిలకన్నా దిగువనే కొనసాగుతున్నాయి.

అనుమతుల మోతాదు తగ్గాలి




చెన్నై: కంపెనీలను నెలకొల్పడం, నడిపించడం, అవసరమైతే వ్యాపారం నుంచి వైదొలగడానికి సంబంధించి భారతదేశంలో కంపెనీలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించవలసిన అవసరం ఉంది. వ్యాపార సంస్థలు పొందవలసిన అనుమతులు, పాటించవలసిన నియమ నిబంధనలు లెక్కకు మిక్కిలిగా ఉంటున్నాయని సీనియర్ న్యాయవాది, గ్రంథకర్త అరవింద్ దతార్ అభిప్రాయపడ్డారు. ఉదాహరణకు, మహారాష్ట్రలో ఒక వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ఒక సంస్థకు 58 రకాల అనుమతులు అవసరం. సింగపూర్‌కు చెందిన ఒక కంపెనీ భారతదేశంలో ఫైవ్-స్టార్ హోటల్ పెట్టాలనుకుంటే 116 రకాల అనుమతులు అవసరమయ్యాయి. అదే పనికి సింగపూర్‌లో 11 అనుమతులు సరిపోతాయి. ''ఈ రకమైన అవాంతరాలను మనం తొలగించవలసిన అవసరం ఉంది'' అని దతార్ అన్నారు. ''దేనికి మొదటి ప్రాధాన్యం?-మెరుగైన న్యాయ నిబంధనలకా లేక మెరుగైన ఆర్థిక వ్యవస్థకా?'' అనే అంశంపై చెన్నై ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సామర్థ్యం ఉన్న పెట్టుబడిదారుకు చట్టపరమైన నిబంధనలే మొదట పరిశీలనకు వస్తాయని, ఆ తర్వాతే ఆర్థిక వ్యవస్థని ఆయన అన్నారు. అయితే, ఈ విషయంలో ఒక ఆసక్తికరమైన, ఆధునికమైన ధోరణికి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అన్ని అనుమతులు 30-45 రోజుల లోపల ఇచ్చి తీరుతామని స్పష్టం చేస్తున్నాయి. ఈ రకమైన వెసులుబాటు ధోరణి కనుక వేగం పుంజుకుంటే, పారిశ్రామిక రంగానికి మేలు చేకూరుతుందని దతార్ అన్నారు.

లక్ష్యాలతో కూడిన వ్యవస్థ

రెవిన్యూ టార్గెట్‌ను నేటి పెద్ద శాపంగా చెప్పాలి. వివిధ పన్నుల వసూళ్ళ శాఖలకు లక్ష్యాలు నిర్ణయిస్తున్నారు. ఇది కంపెనీలపై పరోక్షంగా ప్రభావం చూపుతోంది. తమిళ నాడులో ఆదాయ పన్ను అధికారికి రూ. 400 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించారనుకుందాం. ఆయన పెద్ద అస్సెసీలను డిమాండ్ చేసే మొత్తాన్ని పెంచుతాడు. వారి నుంచి రావలసిన మొత్తాలు ఎక్కువగా ఉన్నాయని చెప్పి లక్ష్యాన్ని చేరుకున్నట్లు తెలిపి చేతులు దులుపుకుంటాడు. పెద్ద అస్సెసీల నుంచి అనుకున్నట్లుగా ఆ మొత్తాలు కాకపోవచ్చు. ఈ వ్యవహారం కోర్టు కెక్కేసరికి ఐదేళ్ళు పడుతుంది. అప్పుడా డిమాండ్‌ను ఉపసంహరించుకుంటారని దతార్ వ్యాఖ్యానించారు.

అమెరికన్ కంపెనీ ఒకటి భారతీయ కంపెనీతో కలసి సంయుక్త రంగంలో సంస్థను ఏర్పాటు చేయదలిస్తే, పాటించవలసిన క్లాజుల గురించి యూనివర్శిటీ ఆఫ్ మిషిగన్ లా స్కూల్‌లో విలియం డబ్ల్యు కుక్ న్యాయ శాస్త్ర ఆచార్యునిగా ఉన్న విక్రమాదిత్య ఖన్నా వివరించారు. ఆ సందర్భంగా కుదిరే ఒప్పందంలో ఉండే క్లాజుల్లో ఒకటి మూడవ దేశంలో నిలంబ ఖాతా తెరచి దానిలో నిర్దిష్ట మొత్తాన్ని డిపాజిట్ చేయడం. రెండు కంపెనీల మధ్య వివాదం నెలకొంటే ఉపయోగపడుతుందని ముందు జాగ్రత్త చర్యగా ఆ మొత్తాన్ని ఉంచుతారు. మధ్యవర్తిత్వం అవసరమైతే, మూడవ దేశంలో ఉన్న సదరు మొత్తం గురించి కక్షిదార్లకు పరిజ్ఞానం ఉంటుందని ఆయన చెప్పారు. ఈ చర్చా గోష్ఠికి జె సాగర్ అసోసియేట్ భాగస్వామి ఆర్తీ శివానంద్ సమన్వయకర్తగా వ్యవహరించారు.





మిరియాల ఎంఐపీని రద్దు చేయండి



కొచ్చి: మిరియాల దిగుమతులపై ఇచ్చిన కనీస దిగుమతి ధర (ఎం.ఐ.పి) నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌ను మసాలా దినుసుల ఎగుమతుల పరిశ్రమ పునరుద్ఘాటించింది. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితి, భారతదేశం నుంచి ఇతర మసాలా దినుసుల ఎగుమతులపై పరంపరానుగత ప్రభావాన్ని చూపిస్తుందని పేర్కొంది. భారతదేశం నుంచి మిరియాలు ఒక్కటే ఎగుమతి అయిన సందర్భాలు అరుదని, శుద్ధి చేసిన ఇతర మసాలా దినుసులతో కలసి అవి ఎప్పుడూ ఎగుమతి అవుతూ వస్తున్నాయని అఖిల భారత మసాలా దినుసుల ఎగుమతిదార్ల ఫోరమ్ చైర్మన్ ప్రకాశ్ నంబూద్రి చెప్పారు. మిరియాలు, పసుపు, ఒక రకం మిరపకాయతో కూడిన దినుసులను ఒకే చోట నుంచి మొత్తంగా కొనేందుకు కస్టమర్లు మొగ్గు చూపుతారు. ''మసాలా దినుసుల మిశ్రమాన్ని సృష్టించేందుకు చైనా నుంచి మిరపకాయలు దిగుమతి చేసుకునేందుకు వియత్నాంలో మిరియాల ఎగుమతిదార్లు ప్రయత్నిస్తూండడాన్ని మనం ఇప్పటికే చూస్తున్నాం'' అని ప్రకాశ్ అన్నారు.

విధానాలలో మార్పుల వల్ల కడచిన మూడు నెలల్లో ఎగుమతుల పరిశ్రమ ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ. 50 కోట్ల నుంచి రూ. 75 కోట్ల విలువైన వ్యాపారాన్ని కోల్పోయిందని అంచనా. దీనితో కస్టమర్లు దినుసులు చౌక ధరలకు అందుబాటులో ఉన్న చోట్లకి తరలిపోతున్నారని ప్రకాశ్ అన్నారు. ఇప్పుడు రూపుదిద్దుకుంటున్న పరిస్థితి అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ మసాలా దినుసల పరిశ్రమను పోటీ ఇవ్వలేనిదిగా చేస్తోంది. ''మేం మిరియాలను కిలో రూ. 500 అధిక ధర వద్ద దిగుమతి చేసుకుంటే, మేం అనుకున్న రీతిలో ఎగుమతులు చేయలేం. అంతర్జాతీయ మార్కెట్ ధరల కన్నా 40 శాతం ఎక్కువ ధరకి ఇండియా నుంచి కొనుగోలు చేసేందుకు గ్లోబల్ కస్టమర్లు సిద్ధపడరు'' అని ఆయన అన్నారు. ప్రభుత్వం 1977-78లో సీటీసీ టీ ఎగుమతిని నిషేధించింది. దిగుమతిదార్లు భారతీయ టీ నుంచి వివిధ రకాలను సృష్టించుకోవడం మానేసి, తూర్పు ఆఫ్రికా నుంచి టీ తెప్పించుకోవడం మొదలెట్టారు. ఆ నష్టాన్ని ఇప్పటి వరకు పూడ్చుకోలేకపోయామని ఆయన అన్నారు.

మిరియాల అంతర్జాతీయ మార్కెట్ ధరలు టన్నుకు 3,500 డాలర్ల నుంచి 3,600 డాలర్లు ఉండగా, డి.జి.ఎఫ్.టి నోటిఫికేషన్ ద్వారా కేంద్రం అన్ని రకాల మిరియాలకు కనీస దిగుమతి ధరను కిలోకి రూ. 500గా, (టన్నుకి 7,875 డాలర్లుగా) నిర్ణయించింది. స్థానిక రైతుల ప్రయోజనాలను కాపాడడమనే ముసుగులో ఏ విధమైన సంప్రదింపులూ లేకుండానే ప్రభుత్వం ఎం.ఐ.పి విధించిందని ఎగుమతిదార్లు అంటున్నారు. అయితే, మిరియాల ధర పూర్తిగా ప్రపంచ డిమాండ్, సరఫరాలపై ఆధారపడి ఉంటుందని ఎగుమతిదార్ల ఫోరమ్ పేర్కొంటోంది. భారతదేశంలో ఈ ఏడాది దాదాపు 70,000 టన్నుల మిరియాలు పండగలవని భావిస్తున్నారు. ధరలపై ఈ దిగుబడి ప్రభావం ఉంటుంది. దీనికితోడు వియత్నాంలో కూడా మిరియాలు బ్రహ్మాండంగా పండుతున్నాయని చెబుతున్నారు.

మసాలా దినుసుల బోర్డు గణాంకాల ప్రకారం, గత ఏడాది దాదాపు 625 కోట్ల విలువ చేసే 23,500 టన్నుల మిరియాలను మనం దిగుమతి చేసుకున్నాం. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల సరిహద్దుల ఆవలి నుంచి మరికొన్ని మిరియాలు దేశంలోకి అక్రమంగా రవాణా అయ్యాయి. వ్యాపారానికి సరైన వాతావరణం కల్పించేందుకు, ఇతర దేశాల నుంచి తెప్పించుకున్న మిరియాలను తిరిగి ఎగుమతి చేసేందుకు అనుమతించవలసిందని ఫోరమ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. రిజిస్టరుకాని వర్తకులు నేరుగా మిరియాలను దిగుమతి చేసుకోకుండా చూడాలని కోరింది. ఎఫ్.టి.ఎ ద్వారా దిగుమతులపై కూడా పరిమితులు విధించవలసిందని అభ్యర్థించింది.

చెన్నై 'ఫెయిర్‌ప్రో' సక్సెస్

చెన్నై: వార్షిక మూడు రోజుల ఫెయిర్‌ప్రో (2018) ఈసారి 262 ఆస్తుల బుకింగును చూసి, రూ. 176 కోట్ల రాబడులను సృష్టించిందని భారతీయ స్థిరాస్తుల వ్యాపారుల సంఘాల సమాఖ్య (క్రెడాయ్) ఒక ప్రకటనలో తెలిపింది. చెన్నై ట్రేడ్ సెంటరులో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను తమిళ నాడు ముఖ్యమంత్రి కె. పళనిస్వామి ఉప ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వంతో కలసి ఫిబ్రవరి 23న ప్రారంభించారు. దీనిలో 74 మంది డెవలపర్లు 300లకు పైగా ఆస్తులను అమ్మకాలకు ఉంచారు. వాటిలో రూ. 20 లక్షల నుంచి రూ. 20 కోట్లు ఖరీదు చేసేవి కూడా ఉన్నాయి. ఈ సందర్భంగా గృహాల కొనుగోలుదార్లకు రుణాలు ఇవ్వజూపిన ఫైనాన్షియల్ సంస్థలలో ఎల్.ఐ.సి హౌసింగ్ ఫైనాన్స్, ఐ.సి.ఐ.సి.ఐ.బ్యాంక్, హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ కూడా ఉన్నాయని క్రెడాయ్ చెన్నై శాఖ అధ్యక్షుడు సురేశ్ కృష్ణ, కన్వీనర్ అనంత్ ఉమ్మిడి తెలిపారు.

Fortis

ఫోర్టిస్ హెల్త్‌కేర్‌కు నోటీసు

న్యూఢిల్లీ: నిర్దిష్ట సమాచారాన్ని, డాక్యుమెంట్లను కోరుతూ తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం (ఎస్.ఎఫ్.ఐ.ఓ) నుంచి నోటీసు అందుకున్నట్లు ఫోర్టిస్ హెల్త్‌కేర్ శనివారం వెల్లడించింది. వాటిని మార్చి 9కల్లా సమర్పించాలని సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ కోరినట్లు తెలిపింది. సంస్థలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకలకు సంబంధించి వార్తలు వెలువడడంతో ఫోర్టిస్ హెల్త్‌కేర్ వ్యవహారాలను కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిశీలిస్తోంది. మంత్రిత్వ శాఖ ఆదేశం మేరకు దానికి కూడా ఫోర్టిస్ హెల్త్‌కేర్ సమాచారాన్ని అందించనుంది. ప్రస్తుతం ఆ సమాచారాన్ని సంకలనపరచే పనిలో ఉన్నట్లు కంపెనీ పేర్కొంది. కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం లేకుండా ఇద్దరు (మల్వీందర్ సింగ్, షివీందర్ సింగ్) ప్రమోటర్లు ఏడాది క్రితం కంపెనీ నుంచి కనీసం 78 మిలియన్ల అమెరికన్ డాలర్లను తీసుకున్నారని ఆరోపణలొచ్చాయి. ఫోర్టిస్ హెల్త్‌కేర్ ఆర్థిక లావాదేవీలపై మరోపక్క భారతీయ సెక్యూరిటీల, ఎక్స్చేంజి బోర్డు (సెబి) కూడా దర్యాప్తు జరుపుతోంది.

మనం బాల
ఆదివారం, 4 మార్చి 2018
www.manamnews.com



కథ

కాకి కోరిక

ఒక అడవిలోని చెట్లకు దట్టంగా లతలు అల్లుకుని ఉన్నాయి. వాటిపైన అక్కడక్కడా గొంగళిపురుగులు. ఆకులోని సారాన్ని తింటూ బతుకుతున్నాయి. అందవికారంగా ఉన్న ఆ పురుగులు కొన్ని రోజులకు గూడు కట్టడం ప్రారంభించాయి.

గూడులో దూరి కదలకుండా బయటకు రాకుండా రోజుల తరబడి ఉండి పోవటం ఆశ్చర్యంగా గమనించిందో కాకి. తిండి లేకుండా ఇన్నాళ్లెలా బతుకుతాయో అని అబ్బుర పడుతున్న కాకి ఓరోజు కళ్లు చెదిరే చూసింది.

కాకి పట్టలేని సంభ్రమంతో వెళ్లి ఈ సంగతిని మిత్రుల చెవిలో వేసింది. కాకీ, ఎలుగుబంటీ, కోయిలా నల్లని తమ ఒంటిని విచారంగా చూసుకున్నాయి.

'మనమూ ఒక గూటిని కట్టుకుని అందులో కొన్ని రోజులుండిపోదామా? వికారంగా ఉన్న పురుగు ఆకర్షణీయమైన సీతాకోక చిలుక అయినట్లు మనమూ అందంగా మారతామేమో' ఆశగా, ఆలోచనగా అన్నది కాకి.

'అంత గూటిని నేను ఎలా కట్టగలను? అది జరిగే పనే కాదు'. పెదవి విరిచింది ఎలుగుబంటి.

'అన్నిరోజులు ఏం తినకుండా ఎలా ఉండగలం? అయినా మన జన్మ ఇంతే. చిలుక ఏ గూడు కట్టిందని? ఆకుపచ్చని ఒళ్లు, ఎర్రెర్రటి ముక్కుతో అంత బాగుంటుంది?' నిరాశపడింది కోయిల.

కాకికి పంతం పెరిగింది. పుల్లా, పుడకా ఏరింది. కొన్ని కొమ్మపై పరిచింది. వాటిపై కూర్చుని మిగతా పుల్లలను తనకు కవచంలా కప్పమని మిత్రులను కోరింది.

ఆకలితో మాడితే ఒక్క రోజులో అదే బయటకొస్తుంది అనుకున్నాయి ఎలుగూ, కోయిలా. పూటకాదు కదా! గంట కూడా కుదురుగా ఉండలేకపోయింది కాకి. ఉక్కిరి బిక్కిరౌతూ బయటపడి వూపిరి పీల్చుకుంది.

మిత్రుని బాధకు కారణమైన సీతాకోక చిలుకలను ఎలుగు, కోయిల నిందించాయి.ఆ బాధను తొలగించే బాధ్యత తనదేనని సీతాకోక చిలుక భావించింది. ఎగురుతూ వెళ్లి కాకి ముందు వాలింది. 'నీ ఆహారం ఉత్తమమైనది కాదు. నీ రూపం అందవికారమైనది. అదేనా నీ బాధా?' అని అడిగింది. కాకి ముభావంగా మొహం తిప్పుకుంది. కోయిల, ఎలుగు కుతూహలంగా వింటుండగా ఆ కీటకం ఇలా చెప్పింది.

'చూడు.. కమ్మని పండ్లు, గింజలు తినే అందమైన చిలుకలు, పావురాళ్లను వేటగాళ్లు వలవేసి పట్టుకుంటారు. నన్ను పిల్లలు చూస్తే రెండువేళ్లతో రెక్కలు పట్టి బంధించి కాసేపు వినోదిస్తారు. మీకా బెడదే లేదు. రూపం, ఆహారపు అలవాట్లు ఏర్పరిచినవి. ఎవరి అందం వారిదే. ఎవరి గొప్ప వారేకే ఉంటుంది. నిజానికి మీరు పండ్లు తిని గింజలు వ్యాప్తి చేస్తున్నారు. పర్యావరణానికి మేలు చేస్తూ... కనీసం హాని చేయకుండా బతికేస్తే చాలు. అదే గొప్ప' అంటూ ఎగిరిపోయింది. దాని మాటలకు కాకి మనసు తేటపడింది.

ఆహారం కడిగి తింటుంది!



పిల్లలూ! మనం రోడ్డుమీద వెళుతున్నప్పుడు.. ఆకలివేస్తే ఏ కాయో, పండో కొనేసి, తింటాం. కానీ, అలా తినకూడదు. ఎందుకంటే దానిలో కంటికి కనిపించని సూక్ష్మ క్రిములు ఉంటాయి. అందుకే వాటిని నీళ్లతో కడుక్కుని, తినాలి. ఈ అలవాటును మనం కేవలం మనుషుల్లోనే చూస్తుంటాం. కానీ ఒక జంతువు ఆహారాన్ని కడుక్కుని తింటుందట! మీరు నమ్మటం లేదు కదా! ఇది నిజమే పిల్లలూ..! ఆ జంతువు పేరే రెకూన్. వాటికి ఎంత ఆకలిగా ఉన్నా ఆహారం కడగడానికి నీరు లభించకపోతే ఆ పదార్థాలను అవి ముట్టవట. ఇంకొక చిత్రమైన విషయం ఏమిటంటే నీటిలో దొరికిన ఆహారాన్నీ ఇవి కడుగుతాయి. అవి ఆహారాన్ని ఎందుకు కడుగుతాయో స్పష్టమైన కారణాలు ఇప్పటికీ తెలియలేదు. రెకూన్ పాలిచ్చే జంతువు. ఇవి దక్షిణ కెనడా నుంచి పనామా వరకూ గల ఎత్తయిన కొండల్లో నివసిస్తాయి. బూడిద రంగులో ఉండి, పచ్చని లేదా గోధుమరంగు మచ్చలుంటాయి. దీని తోక సుమారు 25 సెంటీమీటర్ల పొడవు ఉండి, వెంట్రుకలు కుచ్చులా ఉంటాయి. ఇవి ఆహారం కోసం పదునైన పంజాను ఉపయోగిస్తాయి. బురద, మురికినీళ్ళల్లో ఆహారాన్ని వేటాడతాయి. పశ్చిమ దేశాలలో కనిపించే రెకూన్ జనవరి-జూన్ నెలల మధ్య జతకడతాయి. ఆడ రెకూన్ తొమ్మిది వారాల తర్వాత ఒకటి నుంచి ఏడు పిల్లలను పెడుతుంది. స్థానం మారినప్పుడు ఆడ రెకూన్ పిల్లలను ఒక్కొక్కటిగా కొత్త స్థానానికి చేరవేస్తుంది. వీటిని మాంసం, చర్మంపై ఉండే జుట్టు కోసం వేటగాళ్ళు వేటాడతారు



ఒక వ్యక్తి జీవితంలో చదువు అనేది ఎంత ప్రాముఖ్యతను కలిగి ఉందో మనందరికీ బాగా తెలుసు. అందువల్ల తల్లిదండ్రులుగా ఉన్న మనం, మన పిల్లలు చదువుల్లో బాగా రాణించాలని ఉద్దేశాన్ని ఎప్పుడూ కలిగి ఉంటాము. ఒక వ్యక్తి జీవితంలో మొదటి సారిగా అభ్యసించడమనేది ఇంటి నుంచే మొదలవుతుంది. అలా వారు ఒక నిర్దిష్టమైన వయసుకు వచ్చిన తర్వాత స్కూల్లో చేరతారు. మీ పిల్లలు ఒక స్కూల్లో చేరిన తర్వాత వారు ఇంట్లో స్టడీ రూమ్‌లో ఎలా చదవాలో తెలుసుకుందాం...

పిల్లల స్టడీ రూమ్



వాస్తవానికి, సంవత్సరాలు గడిచేకొద్దీ మీ పిల్లలు ఒక తరగతి నుండి మరొక తరగతికి చేరుకుంటారు, అలా మీ పిల్లలు మరింత ఎక్కువగా నేర్చుకోవటానికి అవకాశం ఉంటుంది. చదువుల (స్టడీస్) యొక్క స్వభావం ఇంటిపని నుండి ప్రాజెక్టు వర్క్ మరియు ఎసైన్మెంట్స్ వరకూ ఉంటుంది, అయితే మీ పిల్లలు ఈ చదువుల భారాన్ని ఎక్కువగా ఇంటి వద్దనే కలిగి ఉంటారు. ఈ పరిస్థితులను గూర్చి పిల్లల యొక్క తల్లిదండ్రులే కాకుండా, భారతీయ విద్యా వ్యవస్థ కూడా నిర్ధారిస్తుంది. ఇప్పుడు మీరు పిల్లల భుజాలపై విద్యాసంబంధమై ఉన్న ఒత్తిడులను తగ్గించటం కోసం, మీ పిల్లలు సౌకర్యవంతంగా ఇంట్లోనే చదువుకునేట్లుగా కొన్ని ప్రక్రియలను చేపట్టాలి. ఎలా మీ పిల్లలు అనుకున్న లక్ష్యాలను సాధించడం కోసం, మరియు మీ పిల్లలు మరింత శ్రద్ధగా చదవడానికి, మీ ఇంట్లోనే శాంతియుతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయటం ద్వారానే మొదలవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో, మీ పిల్లలు పాఠాలను గొప్పగా అభ్యసించి మంచి విద్యార్థతను పొందేలా ప్రేరేపించడం కోసం, పిల్లల యొక్క స్టడీ-రూమ్‌ను సరైన రీతిలో అలంకరించాలి. ఇక్కడ సూచించబడిన చిట్కాలను అనుసరించి స్టడీ-రూమ్‌ను అలంకరించడం ద్వారా మీ పిల్లలు చాలా శ్రద్ధగా చదవగలుగుతారు.

పిల్లల కోసం లైటింగ్ రూమ్

మీరు మీ పిల్లల చదువుకోవాలనుకున్న గదిలో అలంకరణకు (డెకరేషన్‌ను) రూపకల్పన చేస్తే, మీరు గుర్తుంచుకోవలసిన మొదటి విషయం ఆ గది యొక్క లైటింగ్. స్టడీ-రూమ్లో సహజసిద్ధమైన కాంతిని ప్రసరించేలా చెయ్యటం చాలా మంచి పద్ధతి. కానీ మనము క త్రిమ లైటింగ్ గురించి మాట్లాడేటప్పుడు, ఏ ఇతర రంగులను ప్రయత్నించకుండా కేవలం తెలుపు రంగును మాత్రమే స్థిరముగా వుంచండి.





ఎయిర్-కండిషనర్లు

మీరు నగరాల్లో నివసిస్తున్నట్లయితే, మీరు వేసవి కాలంలో మరింత ఎక్కువ వేడిని కలిగి ఉంటారు. అందుకోసం మీ పిల్లలు చదివే గదిలో కూలర్ను (లేదా) ఎయిర్-కండిషనర్‌ను ఏర్పాటు చేసుకోవడం చాలా మంచి ఆలోచన. ఇవి మీ పిల్లలు వేసవి కాలంలో కూడా బాగా చదువుకునేటట్లుగా ప్రోత్సహిస్తుంది. అలా మీ పిల్లలు ఎక్కువ సమయాన్ని చదవడం కోసం కేటాయించడాన్ని దీర్ఘకాలంలో మీరు చూస్తారు.

గోడల రంగు

మీ పిల్లల స్టడీ-రూమ్లో ఉన్న లైటింగ్‌ను తగ్గా, ఆహ్లాద భరితమైన రంగును కలిగి ఉండాలి. అందుకోసం మీరు చాలా ప్రకాశవంతమైన రంగులను (లేదా) ముదురు రంగులను ఎంపిక చేసుకోవద్దు. మీరు నిజంగా ఉత్సాహపూరితమైన రంగులను కోరుకున్నట్లయితే, ఒక గోడ మీద చూడగానే ఉత్తేజపరిచేలా ఉండే రంగును చిత్రీకరించవచ్చు. ఇలా మీరు ఏమి చేసినా అది కేవలం గోడకు మాత్రమే కట్టుబడి ఉండేలా నిర్ధారించుకోండి.



చిన్న లైబ్రరీని నిర్మించండి

మీ పిల్లలు, వారి చుట్టూ ఉన్న పుస్తకాలను చూస్తూ ఎదుగుతున్నట్లయితే, వారికి చదవాలనిపించేలా కోరికలు మరింతగా పెరుగుతాయి. ఈరోజు పుస్తకాల్లో చదివే మన పిల్లలే, పెద్దయ్యాక సమాజం గూర్చి మంచిగా ఆలోచిస్తారని మనందరికీ బాగా తెలిసిన వాస్తవం. పిల్లల కోసం మీరు నిర్మించే ఈ లైబ్రరీ, దీర్ఘకాలంలో ఎంతో కొంత ఫలితాన్ని మీకు అందజేస్తుంది. మీరు సాధ్యమైనంత వరకూ అన్ని రకాల పుస్తకాలను మీ పిల్లలకు అందుబాటులో ఉంచారని నిర్ధారించుకోండి.

ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను దూరంగా ఉంచండి

మీ పిల్లల ప్రాజెక్టుల కోసం డెస్క్టాప్ (లేదా) ల్యాప్టాప్ అవసరమయితే తప్ప, ఏదైనా ఎలక్ట్రానిక్ గాడ్జెట్ల రూపంలో ఉన్న వస్తువులను వారి యొక్క స్టడీ-రూమ్‌ను దూరంగా ఉంచడానికి ప్రయత్నించండి. ఈ స్టడీ-రూమ్లో తక్కువ సంఖ్యలో ప్లగ్గింగ్ పాయింట్లను ఉంచండి. ఇది వారి యొక్క ఆలోచనతో పూర్తిగా విద్యావేత్తల లాగా మార్చేలా ఉందని నిర్ధారిస్తుంది మరియు అనవసరమైన విషయాల కోసం మీ పిల్లల ఆలోచనను మరల్చకుండా చేస్తుంది.

స్పెల్లింగ్ ఎలా చెప్పాలో నేర్పించండి


స్పెల్లింగ్ ఎలా చెప్పాలో పిల్లలకు నేర్పించడం చాలా కష్టం, కానీ ఇది చాలా ముఖ్యమైన పని. మీరు మీ పిల్లలకు స్పెల్లింగ్స్ నేర్పేటపుడు వివిధరకాల పద్ధతులను పరిగణలోకి తీసుకోవడం అవసరం. ఒక్కొక్క మాటను 4-5 సార్లు రాయమనడం లేదా ఒక పదాన్ని వాక్యంలో అనేక సార్లు ఉపయోగించమనడం అనేవి పూర్వకాల పద్ధతులు. మీరు కొత్త పద్ధతిలో మీ మెదడు పనిచేసేట్టు చూసుకోవాలి. ఇలా చేయడం వల్ల మీ పిల్లలు స్పెల్లింగ్ నేర్చుకోవడానికి ఆశక్తి చూపిస్తారు. బడిలో మీ పిల్లలకు ఎక్కువ వర్క్ ఇచ్చినప్పటికీ, వీటితో మీరు టీచర్‌కి, మీ పిల్లలకి కూడా సహాయం చేయండి. మీ పిల్లలు మీతో ఎంతో సౌకర్యంగా ఉంటారు అనేవిషయంలో ఎటువంటి అనుమానం లేదు. వారికి సమస్య ఎక్కడ ఉందో మీకు తెలిస్తే, వారితో కలిసి వర్క్ చేయించండి. స్పెల్లింగ్ లను మీ పిల్లలకు నేర్పిస్తుంటే, మీరు మనసులో గుర్తుంచుకోవాల్సిన కొన్ని విషయాలు ఉన్నాయి. ఫోనోగ్రామ్‌లు, ఉపయోగకరమైన స్పెల్లింగ్ నియమాలు, లాజికల్ సీక్వెన్స్‌ని అనుసరించడం, చివరికి నిరంతర సమీక్ష అవసరం. స్పెల్లింగ్స్ బాగా తెలుసుకోవడానికి ఏమి అవసరమో మీ పిల్లలకు చెప్పడంలో శ్రద్ధ పెట్టండి. స్పెల్లింగ్స్ ఎలా చెప్పాలో మీపిల్లలకు నేర్పించేటపుడు మీరు ఈకింది కొన్ని పద్ధతులను అనుసరించాలి. వీటిని మీరు బేస్‌గా ఉపయోగించవచ్చు, అవసరమైతే మార్పులు చేయొచ్చు. వీటిలో ఏవి మీ పిల్లలకు సరిపోతాయో గమనించండి. చూడడం, రాయడం మీ పిల్లలు స్పెల్లింగ్స్‌ను గుర్తుంచుకోవడానికి ఇదో మంచి మార్గం. మీరు వారితో కొన్ని ఆటలు ఆడడం ద్వారా వాటిని తేలిక చేయండి. మీరు ఒక కార్డ్ పై ఒక పదాన్ని వ్రాయండి, దానిని తిరగేసి, వాటిని పరికించి, తిరిగి మరలా ఆ పదాలు రాయండి. మీరు అనేక ఇతర ఆటలను ఉపయోగించవచ్చు. స్పెల్లింగ్ ఎలా చెప్పాలో పిల్లలకు చెప్పేటప్పుడు ఉపయోగి0చే మార్గాలలో ఇదొకటి. దాగుడు మూతలు మీ పిల్లలు ఆడడానికి ఇష్టపడే ఆటల్లో ఇదొకటి. మీరు ఇంటిచుట్టూ కొన్ని కార్డ్స్ ఉంచండి, తరువాత ఆ కార్డ్‌లను పొందడానికి సూచనలు ఇవ్వండి. ఒకసారి మీ పిల్లాడు అన్ని కార్డ్స్ తీసుకొస్తే, దాన్ని రాయడానికి వారికి వివరించండి. స్పెల్లింగ్ ఎలా చెప్పాలో పిల్లలకు నేర్పించడానికి ఇది మరో మార్గం.

హాయిగా నిద్రపోతారు!

పిల్లలను నిద్రపుచ్చడానికి తల్లిందండ్రులు పడే పాట్లు అన్నీ ఇన్నీ కావు. ఆలా ఎంతో కష్టపడి పిల్లలను నిద్రపుచ్చితే వారు చిన్న కునుకు తీసి మేలుకుని తిరిగి ఆటలలో పడతారు. ఈ అవస్థ తల్లిదండ్రులందరికీ పరిచయమే. అందుకే, పిల్లల స్లీప్ ప్యాటర్న్స్ విషయంలో తల్లిదండ్రులకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. చిన్నారులు ఏకధాటిగా 8 గంటల సేపు నిద్రించరు. చిన్న చిన్న కునుకులు తీస్తూ వారి నిద్రాసమయాన్ని ముగిస్తారు. ఆరునెలలు నిండిన మీ శిశువుని రాత్రంతా హాయిగా నిద్రపుచ్చే ప్రయత్నం చేయాలి. ఈ వయసు నుంచి మీ శిశువు యొక్క నిద్రకి సంబంధించిన విషయంపై మీరు అమితమైన శ్రద్ధ కనబరచాలి. తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగస్తులైతే తమ పిల్లలు రాత్రంతా హాయిగా నిదురించాలని వారు కోరుకుంటారు. ఉదయమంతా ఆఫీసు వర్క్‌తో శ్రమకు గురైన వారికి రాత్రంతా పిల్లలతో మేలుకోవడం అలసటగా అనిపిస్తుంది. అంతే కాదు, పిల్లలకు రాత్రిళ్ళు నిద్రపోవడాన్ని అలవాటు చేయడం వారి ఆరోగ్యానికి కూడా మంచిది. మీ చిన్నారి రాత్రంతా ఎటువంటి ఇబ్బందులు లేకుండా హాయిగా నిద్రించాలంటే మీరు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఐదేళ్లు నిండేవరకు చాలా మంది పిల్లలలో స్లీపింగ్ రొటీన్ ఏర్పడదు. మీ పిల్లలకు రాత్రి పూట నిద్రపోవడం అలవాటు చేయడానికి మీరు పిల్లలతో కలిసి తగిన షెడ్యూల్‌ని ఏర్పరచుకోవాలి. ఇలా చేయడం ద్వారా, క్రమంగా, రాత్రిళ్ళు పిల్లలు ఎక్కువ సమయం హాయిగా నిద్రపోతారు. తద్వారా, ఎటువంటి ఇబ్బందులూ లేకుండా వారికి హాయిగా నిద్రపోవడం అలవాటవుతుంది. పిల్లల స్లీపింగ్ పాటర్న్ ను సాధారణ స్థితికి తీసుకురావడమే అసలు రహస్యం. అప్పుడే పుట్టిన శిశువులు రాత్రంతా హాయిగా నిద్రపోతారు.








కనురెప్పలు ఉండవు!



పిల్లలూ..! మీరు చేపలను చాలాసార్లు చూసే ఉంటారు. కానీ వాటిని దగ్గరగా ఎప్పుడైనా గమనించారా? వాటికి కనురెప్పలు ఉండవు. కాబట్టి అవి ఎప్పుడు చూసినా కళ్లు తెరిచే ఉన్నట్టు కనిపిస్తాయి. అయితే అవి నిద్రపోవా? అనేగా మీ సందేహం? అవి కూడా.. మనలాగే.. ఎంతో కొంతసేపు నిద్రపోతాయి. కొన్ని చేపలు పగటివేళ నిద్రిస్తే, మరికొన్ని రాత్రివేళల్లో నిద్రిస్తాయి. నిద్ర వచ్చిన వెంటనే సముద్రంలో ఉండే చేపలు నీటిలోతుల్లో ఉండే గుహల్లోకి, పగడపు లోయల్లోకి వెళ్లి బంకమన్నులాంటి పదార్థాన్ని పూతగా తమ దేహాలపై ఏర్పాటు చేసుకుంటాయి. అలా ఎందుకు చేస్తాయో తెలుసా? తమ ఉనికిని ఇతరప్రాణులు కనిపెట్టకుండా ఉండేందుకు. అలా అవి నిద్రపోతున్నా వాటి ప్రాణానికి ప్రమాదం లేకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటాయి. మంచినీటిలోని చేపలు నిద్రించేటప్పుడు వాటి జీవప్రక్రియలు కొంతమేర నెమ్మదించడంతో అవి అంత చురుగ్గా ఉండవు. అంతేకానీ అవి పూర్తిగా కోల్పోవు. ఇది ఎవరు చెప్పారు అనుకుంటున్నారా? కొందరు నిద్రించే చేపలపై పరిశోధనల చేశారు. వాటిలో తేలిందేమంటే అవి గాఢనిద్రలోకి చేరుకున్నాగానీ.. నెమ్మదిగా నీటిలో ఈదుతూనే ఉంటాయి.



అరుణకు అండగా ఉంటాం

సన్మాన సభలో క్రీడల మంత్రి టి.పద్మారావు హామీ

జిమ్నాస్ట్‌ను ఘనంగా సత్కరించిన శాట్స్
రూ. 20 లక్షల చెక్‌ను అందజేసిన మంత్రి
రూ. 50 లక్షలు విలువ చేసే విల్లాను ప్రకటించిన సువర్ణ అవనీస్ కంపెనీ

ఓ అథ్లెట్ హృదయం ఉప్పొంగిపోయింది. తల్లి చాటు బిడ్డకు మేమున్నామంటూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆపన్న హస్తాన్ని అందించింది. పేదరికంతో కొట్టుమిట్టాడుతున్న ఈ అథ్లెట్ కుటుంబానికి మున్ముందు మేము అండగా ఉంటామంటూ అనేక మంది పెద్దలు తరలి వచ్చి దీవించారు. క్రీడాకారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ అందిస్తున్న ప్రోత్సాహకాలకు ఎల్‌బీ స్టేడియం సజీవ సాక్షిగా నిలిచింది. ఆ అథ్లెట్‌ను సన్మానించడం తమ బాధ్యతగా శాట్స్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్) భావించగా.. వేలాది మంది సాక్షిగా బుద్ధ అరుణా రెడ్డికి శనివారం ఘన సన్మానం జరిగింది.

హైదరాబాద్: పట్టుదలతో కృషి చేస్తే సాధించలేనిది ఏదీ లేదన్న నానుడిని బుద్ధా అరుణా రెడ్డి నిజం చేసింది. పేద కుటుంబంలో జన్మించి, చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన బుద్ధా అరుణారెడ్డి పట్టుదలతో మెల్బోర్న్‌లో జరిగిన ''జిమ్నాస్టిక్ వరల్డ్ కప్''లో కాంస్య పతకం సాధించి రాష్ట్ర కీర్తి పతాకాన్ని ప్రపంచ వేదికలో రెపరెపలాడించింది.





తెలంగాణ రాష్ట్రానికి చెందిన జిమ్నాస్టిక్ క్రీడాకారిణి బుద్ధా అరుణా రెడ్డికి మరియు ఆమె కోచ్ ఎన్. బ్రిజ్ కిషోర్‌కి, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్), ఒలింపిక్ అసోసియేషన్ అఫ్ తెలంగాణ (ఓఏటీ), తెలంగాణ రాష్ట్ర జిమ్నాస్టిక్ అసోసియేషన్ సంయుక్తంగా శనివారం ఎల్.బి. స్టేడియంలో ఘన సన్మానం జరిగింది. తెలంగాణ రాష్ట్ర క్రీడల మంత్రి టి. పద్మారావు గౌడ్, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర క్రీడల కార్యదర్శి బుర్ర వెంకటేశం ఐఏఎస్, స్పోర్ట్స్ ఎండీ దినకర్ బాబు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

భారతదేశానికే వన్నె తెచ్చిన తెలంగాణ ముద్దుబిడ్డ అరుణా రెడ్డికి తెలంగాణ ప్రభుత్వం నుండి రాష్ట్ర క్రీడల మంత్రి టి. పద్మారావు గౌడ్, తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, స్పోర్ట్స్ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం , శాట్స్ ఎండీ దినకర్ బాబు 20 లక్షల నగదు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా క్రీడల మంత్రి మాట్లాడుతూ 'తెలంగాణ కీర్తితో పాటు భారతదేశ గౌరవాన్ని పెంచిన బుద్ధా అరుణా రెడ్డి తన 14 సంవత్సరాల కృషికి ఫలితమే ఈ పతకం. రాబోయే కామన్వెల్త్, ఆసియా మరియు ఒలింపిక్ గేమ్స్‌లో బంగారు పతకాలు తెచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం నుండి అన్ని విధాల ఆమెకు సహాయ సహకారాలను అందజేస్తాం. అని అన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా జిమ్నాస్టిక్ అసోసియేషన్ అధ్యక్షులు, సువర్ణ అవనిస్ సేరేనే సిటీ కంపెనీ యజమాని సురేందర్ కుమార్ రూ. 50 లక్షలు విలువ చేసే విల్లాను జిమ్నాస్టిక్ క్రీడాకారిణి బుద్ధా అరుణా రెడ్డికి బహుమతిగా ప్రకటించారు.

మరియు బుద్ధా అరుణా రెడ్డిని తమ కంపెనీకి బ్రాండ్‌అంబాసిడర్‌గా సురేందర్ కుమార్ ప్రకటించారు.ఈ సన్మాన కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు, పీఈటీ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ, హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్, కాలేజీ అఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (దోమలగూడ), క్రీడా ప్రముఖులు, క్రీడా విద్యార్థులు, తెరాస నాయకులు, క్రీడా అభిమానులు మరియు ఇతర ప్రముఖులు సుమారు 2000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను శనివారం ప్రారంభించిన ఎమ్మెల్యే కిషోర్ కుమార్, 'మనం' ఎడిటర్ వి.రమేష్ కుమార్. 9 స్టార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలోని ఈ పోటీలు యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డగూడూరు మండల కేంద్రంలో జ్యోతిప్రజ్వలన అనంతరం ప్రారంభమయ్యాయి

భారత్‌కు నిరాశ


అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీలో భారత జట్టుకు ఆదిలోనే నిరాశ ఎదురైంది. కానీ స్ఫూర్తిదాయక ఆటను ప్రదర్శించింది. శనివారమిక్కడ అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌లో భారత్ 2-3తో పోరాడి ఓడింది. అర్జెంటీనా ఆటగాడు గొంజాలెజ్ పీల్లట్ హ్యాట్రిక్ గోల్స్ చేసి తమ జట్టును గెలిపించాడు. భారత జట్టులో అమిత్ రోహిదాస్ రెండు గోల్స్ చేశాడు. ఈ మ్యాచ్ చివరి క్వార్టర్‌లో భారీ వర్షం కురవడంతో దాదాపు 45 నిమిషాలు ఆటకు అంతరాయం కలిగింది. ఆ తర్వాత కూడా వర్షం పూర్తిగా తగ్గలేదు. సన్నని తుంపర్లు పడుతున్నప్పటికీ 11 నిమిషాల ఆటను కొనసాగించారు. గొంజాలెజ్ పీల్లట్ 13, 24, 33 నిమిషాల్లో గోల్స్ అందించగా.. అమిత్ రోహిదాస్ 26, 31 నిమిషాల్లో గోల్స్ చేశాడు.



తొలి మ్యాచ్‌లో అర్జెంటీనా చేతిలో ఓటమి

- జొంజాలెజ్ పీల్లట్ హ్యాట్రిక్
- అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీ

ఇపో (మలేసియా): భారత జట్టు ఆరంభం నుంచే ఆధిపత్యం ప్రదర్శించింది. యువ ఫార్వర్డ్ ఆటగాళ్లు అర్జెంటీనా డిఫెండర్లను మభ్యపెట్టి ప్రత్యర్థి డి సర్కిల్‌లోకి దూసుకెళ్లారు. ముఖ్యంగా తల్విందర్ సింగ్, అరంగేట్ర ఆటగాడు సుమిత్ కుమార్ స్ఫూర్తిదాయక ఆటతో అర్జెంటీనాకు చెందిన అనుభవజ్ఞుడైన గోల్ కీపర్ జువాన్ వివాల్డినీ తప్పించి గోల్ చేసేందుకు ప్రయత్నించారు. భారత జట్టు నాలుగుసార్లు అర్జెంటీనా డి సర్కిల్‌లోకి ప్రవేశించింది. 10వ నిమిషంలోనే సుమిత్ కుమార్ బంతిని ప్రత్యర్థి గోల్ బాక్స్ వద్దకు తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. కానీ అర్జెంటీనా డిఫెండర్లు దాన్ని అడ్డుకున్నారు. మరు నిమిషంలో తల్విందర్ సింగ్ లాంగ్ పాస్‌ను అందుకున్నాడు. కానీ ప్రత్యర్థి గోల్ కీపర్ వివాల్డీని తప్పించలేకపోయాడు. అర్జెంటీనా జట్టు ఎక్కువగా దాడులు చేయకుండా భారత ఆటగాళ్లు అరికట్టారు. కానీ 13వ నిమిషంలో ఇసిడొరొ ఇబర్రా తొలి పెనాల్టీ కార్నర్‌ను సాధించాడు. ఈ పెనాల్టీ కార్నర్‌ను గొంజాలెజ్ గోల్‌గా మలచడంతో అర్జెంటీనాకు తొలి ఆధిక్యం లభించింది. ఆ తర్వాత కూడా అర్జెంటీనా జట్టు పెనాల్టీ కార్నర్ల కోసం తీవ్రంగా కృషి చేసింది. దీంతో 24వ నిమిషంలో మరో పెనాల్టీ కార్నర్ లభించింది. దీన్ని కూడా పీల్లట్ గోల్‌గా మలచడంతో అర్జెంటీనా 2-0తో నిలిచింది. మరో రెండు నిమిషాల తర్వాత భారత్‌కు వరుసగా మూడు పెనాల్టీ కార్నర్‌లు లభించాయి. అందులో రెండింటిని భారత ఆటగాళ్లు వృథా చేశారు. కానీ మూడో పెనాల్టీ కార్నర్‌ను రోహితదాస్ గోల్‌గా మలచడంలో భారత్ 1-2తో నిలిచింది. ఆ తర్వాత మరో గోల్ కోసం ప్రయత్నించిన అర్జెంటీనా ఆటగాళ్లను భారత డిఫెండర్లు ధీటుగా అడ్డుకున్నారు. అయితే 27వ నిమి షంలో అర్జెంటీనాకు మరో పెనాల్టీ కార్నర్ లభించింది. అయితే దీన్ని గోల్ బాక్స్‌లో నుంచి ముందుకు పరుగెత్తిన భారత ఆటగాడు అడ్డుకున్నాడు. దీంతో తొలి అర్ధ భాగం ముగిసింది. ఇక మూడో క్వార్టర్ విషయానికొస్తే.. 31వ నిమిషంలో భారత్‌కు నాలుగో పెనాల్టీ కార్నర్ లభించింది.



దీన్ని అమిత్ రోహిదాస్ గోల్‌గా మలచడంతో స్కోరును భారత్ 2-2తో సమం చేసింది. అయితే మరో మూడు నిమిషాల తర్వాత అర్జెంటీనాకు కూడా పెనాల్టీ కార్నర్ లభించింది. పీల్లట్ దీన్ని గోల్‌గా మలచ డంతో అర్జెంటీనా జట్టు 3-2 ఆధిక్యంతో నిలిచింది. ఇక నాలుగో క్వార్టర్‌లో వరుణడు ఆటం కం కలిగించాడు. దీంతో ఒడిషాలో జరిగిన పురుషుల హాకీ వరల్డ్ లీగ్ ఫైనల్ టోర్నీ గుర్తుకు వచ్చింది. భువనే శ్వర్‌లో ఇదే అర్జెంటీ నాతో జరిగిన ఆ టోర్నీ సెమీఫైనల్ మ్యాచ్ లోనూ వర్షం వల్ల పిచ్‌పై నీళ్లు ఎక్కువగా ఉండడంతో భారత జట్టు సహజసిద్ధమైన ఆటను ఆడలేక పోయింది. దీంతో భారత్ 0-1తో ఆ మ్యాచ్‌లో ఓటమిపాలైంది. ఇప్పుడు కూడా అలాగే జరుగుతుం దేమో అని అభిమానులు భయ పడ్డారు. అనుకు న్నట్టే అయింది. 45 నిమిషాల తర్వాత మ్యాచ్ ప్రారంభ మైంది. కానీ భారత జట్టు మరో గోల్ చేయలేకపోయింది. ఇక తదుపరి మ్యాచ్‌ను ఆదివారం ఇంగ్లండ్‌తో భారత్ ఆడుతుంది.



స్పిన్నర్లే విన్నర్లు

కివీస్‌పై ఇంగ్లండ్ విజయం
2-1తో ఆధిక్యం

వెల్లింగ్టన్: స్పిన్నర్లు మొయీన్ అలీ, ఆదిల్ రషీద్ తమ స్పిన్ మాయాజాలంతో ఇంగ్లండ్‌ను గెలిపించారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారమిక్కడ జరిగిన మూడో వన్డేలో ఇంగ్లండ్ జట్టు 4 పరుగులతో గెలిచింది. దీంతో ఇంగ్లండ జట్టు 2-1 ఆధిక్యంతో నిలిచింది. 235 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన న్యూజిలాండ్ జట్టులో కెప్టెన్ కేన్ విలియమ్సన్ ఒక్కడే ఒంటరి పోరు కొనసాగించారు. చివరి బంతికి విలియమ్సన్ ఆరు పరుగులు చేయాల్సి వచ్చింది. కానీ చేయలేకపోవడంతో న్యూజిలాండ్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల 230 మాత్రమే సాధించ గలిగింది. 18వ ఓవర్ ముగిసే సమయానికి 1 వికెట్ నష్టానికి 80 పరుగులు చేయడంతో మ్యాచ్ తమ చేతిలోనే ఉందని న్యూజిలాండ్ ఆటగాళ్లు భావించారు. కానీ అలీ, రషీద్ మొత్తం సీన్‌ను మార్చేశారు. వీళ్లిద్దరూ 41 బంతుల్లో 23 పరుగులిచ్చి ఐదు వికెట్లు పడగొట్టారు. అలీ 36 పరుగులిచ్చి 3 వికెట్లు, రషీద్ 34 పరుగులిచ్చి 2 వికెట్లు తీసుకున్నారు. స్పిన్నర్లకు బెన్ స్టోక్స్ సహాయకారిగా నిలిచాడు. కొలిన్ మన్రో (49) ఇచ్చిన స్టన్నింగ్ క్యాచ్ పట్టాడు. నాలుగో వన్డే బుధవారం జరుగుతుంది.

ఏసీయూ చీఫ్‌గా రాజస్థాన్ మాజీ డీజీపీ



న్యూఢిల్లీ: యాంటీ కరప్షన్ యూనిట్ చీఫ్‌గా రాజస్థాన్‌కు చెందిన మాజీ డీజీపీ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్) అజిత్ సింగ్‌ను నియమించేందుకు బీసీసీఐ అన్ని ఏర్పాట్లూ చేసింది. ఏప్రిల్ 7న ఐపీఎల్ ప్రారంభానికి ముందే ఈ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏసీయూ బాధ్యతలను చెప్పట్టనున్నట్టు సమాచారం. అజిత్ సింగ్ గతేడాది నవంబర్ 30వ తేదీన రిటైర్ అయ్యారు. 'అవును! ఏసీయూ కొత్త చీఫ్‌గా అజిత్ సింగ్ పేరును బీసీసీఐ ఖరారు చేసింది. అవినీతిని నిరోధించడంలో ఈయనకు ప్రత్యేకమైన అనుభవం ఉంది. బీసీసీఐ అంచనాలకు ఈయన సరిగ్గా సరిపోతారు' అని పేరు చెప్పేందుకు ఇష్టపడని బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. బీసీసీఐ ఏసీయూ చీఫ్ పదవికి అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ రాజస్థాన్ యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ)లో అదనపు డైరెక్టర్‌గా ఈయన పని తీరు బీసీసీఐకి నచ్చింది. రాష్ట్ర ఏసీబీ విభాగంలో ఈయన దాదాపు 600 కేసులను ఈయన పరిష్కరించారు.

క్రికెట్‌లో అరుదైన రికార్డు

ఒకే రోజు రెండు హ్యాట్రిక్స్



హాగ్లే ఓవల్/ఈడెన్ పార్క్: న్యూజిలాండ్‌కు చెందిన ప్లంకెట్ షీల్డ్ క్రికెట్ టోర్నీలో అరుదైన రికార్డు నమోదైంది. రెండు వేర్వేరు మ్యాచ్‌ల్లో ఇద్దరు బౌలర్లు ఒక గంట వ్యవధిలో హ్యాట్రిక్ వికెట్లు సాధించారు. 112 ఏళ్ల ప్లంకెట్ షీల్డ్ టోర్నీ చరిత్రలో ఇటువంటి రికార్డు నమోదు కావడం ఇదే తొలిసారి. ఈ టోర్నీ 1906-07లో ప్రారంభమైంది. ముందుగా హాగ్లే ఓవల్‌లో లోగాన్ వాన్ బీక్ ఈ హ్యాట్రిక్ సాధించాడు. వెల్లింగ్టన్ ఫైర్‌బర్డ్స్‌కు ఆడుతున్న బీక్ కాంటర్‌బరీ జట్టు ఆటగాళ్లయిన చాడ్ బౌస్, మైకెల్ పొల్లార్డ్, కెన్ మెక్‌క్లూర్ వికెట్లను తీశాడు. దీంతో కాంటర్‌బరీ 53 పరుగులకే కుప్పకూలింది. బీక్‌కు ఆరు వికెట్లు దక్కాయి. తర్వాత ఈడెన్ పార్క్‌లో నార్త్ ఈస్ట్రన్ డిస్ట్రిక్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆక్లాండ్ ఏసెస్ జట్టుకు చెందిన బౌలర్ మాట్ మెక్‌ఇవాన్ కెరీర్‌లో తొలిసారి హ్యాట్రిక్ వికెట్లు సాధించాడు. డీన్ బ్రౌన్లీ, బీజే వాట్లింగ్, డారిల్ మిచెల్ వికెట్లను మాట్ మెక్‌ఇవాన్ పడగొట్టాడు.

99 ఏళ్ల స్విమ్మర్ వరల్డ్ రికార్డు



మెల్బోర్న్: ఆస్ట్రేలియాకు చెందిన 99 ఏళ్ల జార్జ్ కొరొనెస్ ఫ్రీ స్టైల్ స్విమ్మింగ్‌లో వరల్డ్ రికార్డు సృష్టించాడు. 100 నుంచి 104 ఏళ్ల పురుషుల మాస్టర్స్ కేటగిరిలో 50 మీటర్ల ఫ్రీ స్టైల్ ఈత పోటీలు శుక్రవారం జరిగాయి. అయితే జార్జ్ ఒక్కడే ఈ పోటీలో పాల్గొన్నారు. వచ్చే నెలలో జార్జ్ వందేళ్లు పూర్తి చేసుకోనున్నారు. గోల్ట్ కోస్ట్ ఆక్వాటిక్ సెంటర్ స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన ఈ పోటీల్లో ఈయన 56.12 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేశారు. వచ్చే నెలలో ఇక్కడే కామన్వెల్త్ గేమ్స్ జరగనున్నాయి. 100 నుంచి 104 ఏళ్ల మధ్య వయస్కుల్లో బ్రిజన్‌కు చెందిన జాన్ హారిసన్ 2014లో నెలకొల్పిన 1:31.19 సెకన్ల రికార్డును బ్రేక్ చేయడానికని ఈ పోటీలు నిర్వహించారు. దీంతో కొరొనెస్ ఒక్కడే ఈ పోటీల్లో పాల్గొని రికార్డును బద్దలు కొట్టారు.

ఆసియా గేమ్స్‌లో షూటింగ్ పోటీలుండవు

నిర్వాహకుల ప్రకటన ● భారత షూటర్లకు మరో దెబ్బ



పూణె: గోల్డ్ కోస్ట్ కామన్వెల్త్ గేమ్స్ నిర్వాహకులు షూటింగ్ ఈవెంట్స్ సంఖ్యను తగ్గించారు. 2022 బర్మింగ్‌హాట్‌లో షూటింగ్ పోటీలపై నిర్వాహకులు అనిశ్చితిని తెలియజేశారు. తాజాగా భారత్ షూటర్లకు మరో దెబ్బ తగిలింది. జకార్తాలో జరగనున్న ఆసియా గేమ్స్‌లో షూటింగ్ పోటీలుండవని నిర్వాహకులు ప్రకటించారు. ఆసియా సంప్రదాయ సిద్ధమైన 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ (పురుషులు, మహిళలు), 50 మీటర్ల పిస్టల్, 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ ఈవెంట్లతో పాటు అన్ని టీమ్ ఈవెంట్స్‌ను కూడా తొలగించినట్టు ఆసియా గేమ్స్ నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులు రద్దు చేసిన ఈవెంట్స్ అన్నీ ఒలింపిక్స్ ఈవెంట్స్ కాదు. వీటిని తొలగించడంతో భారత్‌కు పెద్ద తగిలింది. ఎందుకంటే గతంలో ఈ ఈవెంట్లలో ముఖ్యంగా టీమ్ ఈవెంట్లలో భారత్ పతకాలను కైవసం చేసుకుంది.

అయితే ఆసియా గేమ్స్ నిర్వాహకులు డబుల్ ట్రాప్‌ను చేర్చారు. ఈ ఈవెంట్‌ను ఇటీవలే ఒలింపిక్స్ నుంచి తొలగించడం గమనార్హం. ఆసియా గేమ్స్ నిర్వాహకులు 300 మీటర్స్ 3 పొజిసన్ రైఫిల్ ఈవెంట్‌ను చేర్చారు. సాధారణంగా ఈ బిగ్ బోర్ రైఫిల్‌తో సైనికులు ప్రాక్టీస్ చేస్తుంటారు. ఆసియా గేమ్స్‌లు ఈ ఏడాది ఆగస్టు 18న ప్రారంభం కానున్నాయి. తొలగించిన షూటింగ్ ఈవెంట్స్:

పురుషులు (మొత్తం 15): 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్ (వ్యక్తిగత, టీమ్), 25 మీటర్ల రాపిడ్ ఫైర్ (టీమ్), 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ (వ్యక్తిగత, టీమ్), 50 మీటర్ల పిస్టల్ (వ్యక్తిగత, టీమ్), 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ (టీమ్), 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ (టీమ్), 50 మీటర్ల ప్రోన్ (వ్యక్తిగత, టీమ్), 50 మీటర్ల 3 పొజిషన్ (టీమ్), ట్రాప్ (టీమ్), డబుల్ ట్రాప్ (టీమ్), స్కీట్ (టీమ్).

మహిళలు (మొత్తం 9): 25 మీటర్ల పిస్టల్ (టీమ్), 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ (టీమ్), 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ (టీమ్), 50 మీటర్ల ప్రోన్ (వ్యక్తిగత, టీమ్), 50 మీటర్ల 3 పొజిషన్ (టీమ్), ట్రాప్ (టీమ్), డబుల్ ట్రాప్ (టీమ్), స్కీట్ (టీమ్).

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.